1993 నుండి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 3
సంచిక : 3
రు. 20/-లు
తెనాలి
పుటలు : 52

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు

మే 2017

- అక్కడా బౌద్ధమే... ఇక్కడా బౌద్ధమే...కానీ...
- బౌద్ధం- వైజ్ఞానిక మార్గం
- ఆంధ్రులకొక అంతర్జాతీయ నగరం
- మాతృభాషా మాధ్యమం కోసం పోరాటమే దారి

బుద్ధజయంతి శుభాకాంక్షలు



## సంఘసంస్కరణ రంగంలో స్ఫూర్తిమూర్తిత్రయం



స్వామినీని ముద్దునరసింహం



కందుకూరి వీరేశలింగం



రఘుపతి వెంకటరత్నం

## హిందీ ఆధిపత్యం- తక్కిన భారతీయ భాషల పట్ల ఉదాసీనత

# మండలి బుద్ధప్రసాద్ గారికి 'గౌరవ డాక్టరేట్'



ఫోటోలు : వస్కో శ్రీనివాస్

ఛాన్సెలర్ ఇ.ఎస్.ఎల్.నరసింహన్ గారి నుంచి 'డాక్టరేట్' గౌరవాన్ని అందుకొంటున్న దృశ్యం. ప్రక్కన విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడు ఆచార్య ఎస్. రామకృష్ణారావు, రిజిస్ట్రార్ ఆచార్య డి.సూర్యచంద్రరావు,



స్నాతకోత్సవంలో ప్రసంగిస్తున్న ముఖ్య అతిథి డా॥ మండలి బుద్ధప్రసాద్

ఏప్రిల్ 22న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి గౌ॥మండలి బుద్ధప్రసాద్‌గారికి కృష్ణావిశ్వవిద్యాలయం (మచిలీపట్నం) గౌరవ డాక్టరేట్‌ను ఇచ్చి సత్కరించింది. ఛాన్సెలర్ హోదాలో గవర్నరు ఇ.ఎస్.ఎల్.నరసింహన్ విశ్వవిద్యాలయ 4వ స్నాతకోత్సవంలో ఈ గౌరవాన్ని బుద్ధప్రసాద్‌గారికి అందజేశారు. ఉపాధ్యక్షుడు ఆచార్య ఎస్.రామకృష్ణారావు అభినందన పత్రాన్ని సమర్పించారు. "నిష్కళంక ప్రజాసేవకులు, నిరాడంబరులు, సాహితీమూర్తి, కళారంగ ప్రోత్సాహకులు, తెలుగుభాషారక్షణ దీక్షాదక్షులు అయిన శ్రీ మండలి బుద్ధప్రసాద్‌గారు భాషా, సాంస్కృతిక, సేవా రంగాలకు చేసిన సేవలకు గుర్తుగా ఈ 'డాక్టరేట్ పురస్కారాన్ని' అందిస్తున్నామని అందులో పేర్కొన్నారు. ఆయా రంగాల్లో ఆయన చేసిన కృషిని ఆపత్రంలో ప్రస్తావించారు. గవర్నర్ తెలుగులో గొప్పగా ప్రసంగించడం అందర్నీ ఆనందింపజేసింది. ఆయన ప్రసంగమూ, తర్వాత ముఖ్య అతిథిగా బుద్ధప్రసాద్‌గారు చేసిన ప్రసంగమూ ఆద్యంతమూ సభికులను ఆకట్టుకున్నాయి. అరుదైన ప్రసంగాలను విన్నామన్న తృప్తిని పొందారు. ఈ గౌరవ డాక్టరేట్‌ను అందుకోవడంతో బుద్ధప్రసాద్‌గారు భాషా సాంస్కృతిక రంగాలకు సేవలందించడానికి వారి స్థాయితోపాటు బాధ్యత కూడా మరింత పెరిగిందని సభికులు అభిప్రాయపడ్డారు.

◆ తెలుగు అభివృద్ధి, సాధికారతలకోసం...

◆ తెలుగుభాషోద్యమ నిర్మాణంకోసం...


◆ ఆంధ్ర,తెలంగాణల్లో, ఇతరరాష్ట్రాల్లో, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారికోసం...

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెనిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి

**మే 2017**

### రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్ధిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట –రచనను ఏ రూపంలోనైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి గాని వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి. 2. రచనలను యూనికోడ్‌లో గాని, అను ఫాంట్స్‌లో గాని టైప్ చేసి, పి.డి.ఎఫ్, పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్ చేసి *editorammanudi@gmail.com* కు పంపాలి. కొరియర్ / రిజిష్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంప వచ్చు. 3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ-మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకో లేము. 4. రచన స్వంతమేనని, ఇతర పత్రిక లకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంప లేదని, ఇంత వరకు ఎక్కడా ప్రచురణ కాలే దని హామీ పత్రాన్ని తప్పనిసరిగ పంపాలి. ముందుగా సోషల్ మీడియాలో పెట్టిన రచన లను ప్రచురణకు స్వీకరించలేము. **అమ్మనుడి** లో ప్రచురణైన తరువాత ఇతర పత్రికల లోగాని, సోషల్ మీడియాలోగాని ప్రచురించే ట్లయితే – **అమ్మనుడి** నుంచి తీసుకున్నట్లు తప్పక పేర్కొనాలి.

## లోపలి పుటలలో....


| | | |
|---|---|---|
| **సంపాదకహృదయం :** ఇక పోరాటమే / దారి | | |
| **పిట్టచూపు...**హిందీ ఆధిపత్యం.... | చలసాని నరేంద్ర... | 9 |
| **బోధనా మాధ్యమం :** విద్యాబోధనకు ఆంగ్లమా ..... | రహ్మానుద్దీన్ షేక్... | 12 |
| **తెలుగు మాధ్యమం-మరికొన్ని ప్రశ్నలూ ... :** | ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు | 14 |
| **బోధనామాధ్యమం :** తెలుగు తెలియని తరం... | ఆచార్య చందు సుబ్బారావు | 16 |
| **బుద్ధజయంతి ప్రత్యేకం :** ఆంధ్రులకొక... | వావిలాల సుబ్బారావు | 18 |
| **ప్రత్యేక వ్యాసం :** సంఘ సంస్కరణల రంగంలో..... | సన్నిధానం నర్సింహశర్మ | 21 |
| **సాహిత్య రంగం:** మెలట్టూరు భాగవత మేళా.... | డా॥ మధురాంతకం నరేంద్ర | 25. |
| **బుద్ధజయంతి ప్రత్యేకం :** బుద్ధుని చిత్త భావనా.... | డి. చంద్రశేఖర్ | 29 |
| **బుద్ధజయంతి ప్రత్యేకం :** అక్కడా బౌద్ధమే ఇక్కడా...... | అనూరాధ భట్ట | 30 |
| **ధారావాహిక :** బౌద్ధం- వైజ్ఞానిక మార్గం-1.. | బొర్రా గోవర్ధన్ | 33 |
| **తెలంగాణ వారసత్వ సంపద :** | సంకేపల్లి నాగేంద్రశర్మ | 36 |
| **తెలంగాణ కలల పంట :** మా స్వప్నం.... | బి.ఎస్. రాములు | 38 |
| **స్వాతంత్ర్య ఉద్యమం :** రైతు ఉద్యమాలు... | డా॥ జి. వెంకటేశ్వరరావ్ | 39 |
| **మన రాజులు, బిరుదులు :** కొండవీటి రెడ్డి రాజులు.. | డా॥ ఈమని శివనాగిరెడ్డి | 41 |
| **వారసత్వ జ్ఞానం :** నాయీల నైపుణ్యం.... | వుప్పల నరసింహం | 43. |
| **తెలుగులెంక సూక్తులు :** | డా॥ నాగభైరవ ఆదినారాయణ | 44 |
| **చైతన్యం :** చీకటిలో చిరుదీపాలు.... | గోవిందరాజు చక్రధర్ | 45 |
| **పుస్తక సమీక్ష:** | ఎం.వి. శాస్త్రి, అరసింగం | 47. |
| **గ్రంథాలయం :** | | 49 |
| **ఇవీ సంగతులు:** | | 50 |


**కవితలు**


| | | |
|---|---|---|
| స్మృతిగీతం | –మందరపు హైమవతి | 24 |
| ఢిల్లీ | –డా॥ ఎన్ గోపి | 28 |
| జీవ ప్రవాహం | –పి. లక్షణ్ రావు | 46 |
| ఒంటరి అనాథ | –గుర్రాల రమణయ్య | 42 |


కంప్యూటరీకరణ : **సోమయాజులు**


రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:

సంపాదకుడు: **అమ్మనుడి,** జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ-520004.

కార్యాలయం : *0866-2439466* సంపాదకుడు : *9848016136* , e-mail : editorammanudi@gmail.com

వలగూడు (ఇంటర్నెట్)లో *www.ammanudi.org* చూడండి.



రచయితల అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

మాసపత్రిక

నుడి - నాడు - నెనరు


## చందా వివరాలు

| | వ్యక్తులకు | సంస్థలకు | విదేశీయులకు |
|---|---|---|---|
| శాశ్వత చందా : | రూ.5000 | రూ.7500 | -- |
| 5 సం॥ : | రూ.1000 | రూ.1500 | 150 డాలర్లు |
| 3 సం॥ : | రూ. 700 | రూ.1000 | 75 డాలర్లు |
| 1 సం॥ : | రూ. 240 | రూ. 400 | 25 డాలర్లు |

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు డి.డి.ని **'అమ్మనుడి'** పేర పంపాలి. చెక్కు పంపేట్లయితే దయచేసి అదనంగా రు.30 లు చేర్చి పంపండి.

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'అమ్మనుడి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

**AMMA NUDI - AXIS BANK, TENALI**

అక్కౌంట్ నెం. **915020010550189**

**IFSC Code : UTIB0000556**

ఆన్‌లైన్‌లో చందాను పంపినవారు, ఆ వెంటనే దయతో - చిరునామా, ఫోన్ నెం. తదితర వివరాలను జాబుద్వారాగాని, ఫోన్ మెసేజి ద్వారాగాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా


**డా॥ సామల లక్ష్మణబాబు,** ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి**
గుంటూరు జిల్లా - 522 211. ఫోన్ : 9440448244
ఇ-మెయిల్ : ammanudi@gmail.com


**చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. ఇందుకోసం మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలుపగలరు.**

## చందాదారులకు సూచనలు

1. చందా కాలం ముగింపు తేదీ - పత్రిక కవరుమీద మీ చిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
3. మీ ఇంటి నెంబరుతో పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలపాలి.
4. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.

**'అమ్మనుడి'** ఈ క్రిందిచోట్ల కూడ లభిస్తుంది

**నవోదయ బుక్ హౌస్,** ఆర్యసమాజ్ భవనం ఎదురుగా, కాచిగుడా. **హైదరాబాదు - 27.** ఫోన్ :040-24652387

**మైత్రీ బుక్‌హౌస్,** జలీల్ వీధి, కార్ల్‌మార్క్స్‌రోడ్డు (ఏలూరు రోడ్డు) **విజయవాడ - 2.** ఫోన్ : 9866211995

**మణి బుక్‌స్టాల్,** షాప్ నెం.58, సండేమార్కెట్, **నెల్లూరు**-1. ఫోన్:7386223538.

# తెలుగుజాతి (ట్రస్టు)

**నడుస్తున్న చరిత్ర** ప్రోత్సాహంతో 2000సం॥నుండి ఆంధ్రప్రదేశ్ లోని, పొరుగు రాష్ట్రాల్లోని తెలుగువారి శ్రేయస్సుకు, తెలుగుభాషోద్యమ నిర్మాణానికి ఎంతో కృషి జరిగింది. దక్షిణ భారతదేశమంతటా చిక్కగా అల్లుకొని, మొత్తం దేశంలోనేకాక, ఇతర దేశాల్లో కూడా భాషా సాంస్కృతిక మూలాలను విస్తరించు కొనివున్న తెలుగు జాతిలో చైతన్యాన్ని పెంపొందించి, వారిలో సంఘీభావాన్ని, భావ సమైక్యతను బలపరచవలసిన అక్కరను గుర్తించిన కొందరు కార్యకర్తలు అందుకోసం పనిచేస్తున్నారు. అయితే, అనివార్య కారణాల వల్ల నడుస్తున్న చరిత్ర పత్రికను 2013 నవంబరు నుంచి నిలిపివేయవలసి వచ్చింది. కొద్ది విరామం తరువాత మళ్ళీ పత్రికను ప్రచురించడంతోపాటు తెలుగు నుడి, చరిత్ర, జాతి ముందడుగుకు అవసరమైన పుస్తకాల ప్రచురణను, ప్రచార కార్యక్రమాలను చేపట్టాలని తలపెట్టాము. ఇందుకోసం 'తెలుగుజాతి' ట్రస్టును స్థాపించాము. (92/2014).

2015 మార్చి నుంచి **అమ్మనుడి** పత్రికను ప్రచురిస్తున్నాము. తొలుత స.వెం. రమేశ్ వ్యాసాల సంకలనం **ఎల్లలు లేని తెలుగు**ను విడుదల చేశాము. ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు గారి రచనలు **ద్రావిడ-మంగోలు భాషల జన్యుసంబంధం ("తెలుగు" పుట్టుపూర్వోత్తరాలు)** అనే పరిశోధనా గ్రంథాన్ని, **తెలుగు రాష్ట్రాలలో భాషాసంక్షోభం** పైనా, చేపట్టవలసిన **భాషావిధానం**పైనా మరి రెండు పుస్తకాలను త్వరలో వెలువరించనున్నాము.

**ఈ ట్రస్టును బలమైన పునాదులపై, తగినన్ని వనరులతో నిర్వహించటానికి మీ అందరి చేయూత కావాలి. విరాళాలనిచ్చి తోడ్పడగోరుతున్నాము.**

| | |
|---|---|
| రాజ పోషకులు రు.1,00,000/- | పోషకులు రు.25,000/- |
| విశిష్ట పోషకులు రు.50,000/- | ప్రోత్సాహకులు రు.10,000/- |

దాత ఫొటోను, క్లుప్తంగా పరిచయాన్ని **'అమ్మనుడి'** పత్రికలో ప్రచురిస్తాము. దాతలందరినీ శాశ్వత చందాదారులుగా పరిగణించి పత్రికను ప్రతినెలా పంపిస్తాము. ట్రస్టు ప్రచురించే పుస్తకాలను కూడా వెనువెంటనే పంపిస్తాము.

సొమ్మును ఆన్‌లైన్‌లో 'TELUGUJAATHI' పేర **యాక్సిస్ బ్యాంక్, సికిందరాబాదు**కు పంపాలి. అక్కౌంట్ నెం. 914020020387880 I.F.S.C.Code : UTIB0000068. లేదా- అదే బ్యాంకు పేర బ్యాంకు డ్రాఫ్టుగా పంపాలి. డ్రాఫ్టు పంపుటకు, ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా : డా॥ సామల లక్ష్మణబాబు, ట్రస్టీ, తెలుగుజాతి (ట్రస్టు),8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి.** గుంటూరు జిల్లా - 522 211. ఫోన్ : 9440448244


**డా॥ సామల రమేష్‌బాబు,(98480 16136) మేనేజింగ్ ట్రస్టీ**
ట్రస్టీలు : పారుపల్లి కోదండరామయ్య, డా॥ వెన్నిసెట్టిసింగారావు, స.వెం.రమేశ్, సామల లక్ష్మణబాబు, కోటిపల్లి సుబ్బారావు, పూదోట శౌరీలు, డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు



### తెలుగుజాతి ట్రస్టుకు విరాళం

బి.ఎస్.ఎన్.ఎల్.లో డివిజనల్ ఇంజనీరుగా పనిచేసి ఉద్యోగవిరమణ తరువాత తూర్పుగోదావరి జిల్లా కొత్తపేటలో నివసిస్తున్న శ్రీ అయ్యగారి నరసింహమూర్తిగారి తల్లిదండ్రులు కీ.శే.శేషారత్నము, కీ.శే.వీర వెంకట లక్ష్మీ నరసింహముగార్ల ఛాయాచిత్రం. తండ్రిగారు జిల్లాపరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేశారు. తల్లిదండ్రుల గుర్తుగా నరసింహమూర్తిగారు తెలుగుజాతి ట్రస్టుకు పోషకులుగా రు.25,000 పంపించారు. వారికి ధన్యవాదాలు.

– మేనేజింగ్ ట్రస్టీ

**జనం మాట**

# మాతృభాషలోనే ప్రాథమిక విద్య

## ఆంధ్రప్రదేశ్‌లో 87% మంది అభిప్రాయం ఇదే...

ప్రాథమిక విద్యాబోధన మాతృభాషలోనే జరగాలి. ఆంగ్ల మాధ్యమాన్ని ఆరో తరగతి నుంచి మాత్రమే ప్రవేశపెట్టాలి. ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాల్లో విద్యాశాఖ జరిపిన అభిప్రాయ సేకరణలో 87% మంది ఈమేరకు స్పష్టం చేశారు. మాతృభాషలో బోధన జరిగితేనే విద్యార్థులు సులభంగా ఆంగ్ల పదాల్ని, పాఠాల్ని అర్థం చేసుకుంటారని, చక్కగా మాట్లాడగలుగుతారని ముక్తకంఠంతో పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో సైతం మాతృభాషలోనే ప్రాథమిక విద్యాబోధన జరుగుతోందని గుర్తుచేశారు. రాష్ట్రంలో కేవలం 13%మంది ఒకటో తరగతి నుంచే ఆంగ్ల మాధ్యమంలో బోధన ప్రవేశపెట్టాలని పేర్కొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ఏటా 10% విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు దూరమవుతున్నారు. అన్ని వర్గాల తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఆంగ్ల మాధ్యమంలోనే చదివించేందుకు ప్రాధాన్యమిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఒకటో తరగతి నుంచే ఆంగ్ల మాధ్యమంలో తరగతుల నిర్వహణను ప్రవేశపెట్టే విషయమై విద్యాశాఖ అభిప్రాయ సేకరణ చేపట్టింది. 13 జిల్లాల నుంచి సేకరించిన సమాచారాన్ని రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణ క్రోడీకరించి నివేదిక రూపొందించింది. ఆంగ్ల మాధ్యమం కారణంగానే ప్రైవేట్ పాఠశాలల వైపు తల్లిదండ్రులు ఆకర్షితులవుతున్నారని భావిస్తున్న తరుణంలో దీనికి భిన్నంగా స్పందన రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**నివేదికలోని అంశాలు**

♦ ఒకటో తరగతి నుంచే ఆంగ్ల మాధ్యమంలో తరగతులు నిర్వహిస్తే విద్యార్థులు నష్టపోతారు. మాతృభాషలో బోధన ద్వారా ఏ ఇతర భాషలోనైనా చదవగలిగే సామర్థ్యాలు విద్యార్థులకు లభిస్తాయి.

♦ 1నుంచి 5వ తరగతి వరకు ఆంగ్లం పాఠాలను సమర్థంగా బోధించేందుకు వీలుగా ఉపాధ్యాయులకు ప్రణాళికాబద్ధంగా పునశ్చరణ తరగతుల్ని నిర్వహించాలి.

♦ ఆరో తరగతి నుంచి ఆంగ్ల మాధ్యమంలో బోధనను ఎంపిక చేసుకునే (ఆప్షన్‌గా) సౌకర్యం కల్పించాలి. 'సక్సెస్' కింద గుర్తించిన ఉన్నత పాఠశాలల్లో ఆరు నుంచి పదో తరగతి వరకు తెలుగుకు సమాంతరంగా ఆంగ్ల మాధ్యమంలోనూ బోధన జరుగుతోంది. దీనిని పూర్తిగా అందుబాటులోకి తీసుకురావాలి.

♦ ప్రస్తుతం అనేక ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఒకే ఉపాధ్యాయుడితో బోధన జరుగుతోంది. విద్యార్థుల సంఖ్యను అనుసరించి కొన్నిచోట్ల మాత్రమే ఇద్దరు, ముగ్గురు చొప్పున ఉపాధ్యాయులు ఉన్నారు. ఒకే ఉపాధ్యాయుడు అన్ని తరగతుల వారికి బోధించాల్సి రావడంతో విద్యార్థులకు తగిన విధంగా ఆంగ్లంలో పాఠాల్ని చెప్పేందుకు వీలు ఏర్పడడం లేదు.

♦ ఇలా కాకుండా 1నుంచి 5 తరగతుల విద్యార్థులకు పాఠాల్ని చెప్పేందుకు ఐదుగురు ఉపాధ్యాయులను నియమిస్తే, ఆంగ్లంలోబోధనకు ఎటువంటి సమస్యలు ఉండవు. పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలకు పంపించేందుకు తల్లిదండ్రులు కూడా ముందుకు వస్తారు.

♦ ప్రైవేట్ పాఠశాలల్లో 1 నుంచి 5 వరకు ఆంగ్ల మాధ్యమంలో తరగతుల్ని నిర్వహించకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ కూడా పలుచోట్ల వ్యక్తమైంది. ఇలాచేస్తే ప్రభుత్వ పాఠశాలల మనుగడకు ఢోకా ఉండదని చెబుతున్నారు.

(ఈనాడు అక్టోబరు 22, 2015)

జనం మాట

# అమ్మభాషకే అగ్ర తాంబూలం

## తెలుగు రాష్ట్రాల్లో ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయ బృందం అధ్యయనం వెల్లడి

ఆంగ్లం మోజులో అమ్మభాష తెలుగును చిన్నచూపు చూస్తున్న ప్రజలకు, ప్రభుత్వాలకు తల్లిదండ్రులకు, విద్యార్థులకు హెచ్చరిక! ప్రాథమిక తరగతుల్లో మాతృభాషలో నేర్చుకున్నవారే ఆంగ్ల మాధ్యమంలో చదివిన వారికన్నా మెరుగ్గా రాణిస్తున్నారు! ఇది తెలుగుభాష వీరాభిమానుల మాట కాదు. ఆంగ్లానికి ఆయువుపట్టైన ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయ బృందం అధ్యయనం చెబుతున్న మాట! 2002 నుంచి 2011 దాకా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని తెలంగాణ, కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన యంగ్‌లైవ్స్ బృందం ఈ అధ్యయనం చేసింది. దీని ఆధారంగా 'మాధ్యమం చదువులపై ప్రభావం చూపుతుందా?' అనే అంశంపై ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో విశ్లేషకులుగా పనిచేస్తున్న పి. శ్రీకుమార్ నాయర్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని పాఠశాలల పరిస్థితులపై అధ్యయన పత్రం సమర్పించారు. ప్రాథమిక స్థాయిలో బోధన మాధ్యమానికి, విద్యార్థి ఫలితాలకు సంబంధాన్ని ఈ అధ్యయనం బేరీజు వేసింది. గణితంలో మెలకువల ఆధారంగా ఫలితాలు నిర్ణయించారు. తొలుత ఒకటో తరగతిలో చేరిన విద్యార్థులకు పరీక్ష పెట్టారు. మళ్ళీ అదే విద్యార్థులకు మూడో తరగతిలో, అనంతరం ఐదో తరగతిలో పరీక్ష నిర్వహించారు. తద్వారా ఆంగ్లమాధ్యమ విద్యార్థుల కంటే తెలుగు మాధ్యమంలో చదివిన పిల్లలు సగటున మెరుగ్గా రాణిస్తున్నారని అధ్యయనం తేల్చింది. అంతేకాక, ప్రాథమిక స్థాయిలో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెడితే భవిష్యత్తులో పిల్లల చదువులు, ఫలితాలు దెబ్బతినే ప్రమాదముందని హెచ్చరించింది.

"ఆంగ్ల మాధ్యమానికి మోజు పెరుగుతోంది. ఇంటివద్ద ఆంగ్లభాషకు అనుకూల వాతావరణం ఉండని కారణంగా బలహీన సామాజిక వర్గాల పిల్లలకు ఇవి దీర్ఘకాలంలో మేలు చేయకపోవచ్చు. మాతృభాషలో నేర్చుకుంటే ప్రతి సబ్జెక్ట్‌పై అవగాహన సులభ సాధ్యమవుతుంది. ఏదైనా భాషపై పట్టు సంపాదిస్తే, మరో భాషను నేర్చుకోవటం సులభమవుతుందని భాషాశాస్త్రవేత్తలు చెబుతున్న సంగతిని మరిచిపోకూడదు" అని నివేదికలో స్పష్టం చేశారు. తెలంగాణ, కోస్తాంధ్ర, రాయలసీమలకు చెందిన 20 మండలాల్లో దాదాపు ఎనిమిదేళ్లపాటు ఈ అధ్యయనం నిర్వహించారు. పట్టణ, పల్లె ప్రాంతాల్లోని ఆంగ్ల తెలుగుమాధ్యమాలున్న మొత్తం 233 బడుల్లోంచి 815 మంది విద్యార్థులను మూడు దఫాలుగా ప్రశ్నించారు. వారి కుటుంబ సభ్యులను, చుట్టుపక్కల వారిని అడిగి ఈ అధ్యయనం చేశారు.

**అసమానతలు పెరగొచ్చు: శ్రీకుమార్ నాయర్**

"ఇప్పటికీ గణనీయ సంఖ్యలో పిల్లలు తెలుగు మాధ్యమంలో చదువుతున్నారు. కానీ ఆంగ్ల మాధ్యమంతో పోల్చిచూస్తే మౌలిక సదుపాయాల్లో, పౌష్టికాహార విలువల్లో వెనుకబడుతున్నారు. తద్వారా వారి మేధోసామర్థ్య అభివృద్ధిపై ప్రభావం పడుతోంది. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల్లో బాధ్యత తక్కువగా ఉంటోంది. ఇన్ని సమస్యలున్నా తెలుగు మాధ్యమంలో చదువుతున్న పిల్లలు బాగా రాణిస్తున్నారు. ప్రాథమికస్థాయిలో తెలుగు మాధ్యమ బడులను ఆంగ్ల మాధ్యమంలోకి మార్చటం ద్వారా పిల్లల సామర్థ్యాల్లో అసమానతలు భారీగా పెరిగే అవకాశాలున్నాయి. బడుగువర్గాల, గ్రామీణప్రాంత పిల్లలపై ఆంగ్లమాధ్యమాన్ని రుద్దటం వారి ప్రతిభకు ఆటంకంగా మారే ప్రమాదముంది. ప్రాథమిక తరగతుల్లో మాతృభాషలో నేర్పినప్పుడు పిల్లలు బాగా నేర్చుకోవటానికి, అవగాహన పెరగటానికి అవకాశముంది. పైగా స్థానికంగా సామాజిక పరిస్థితులు, వాణిజ్య, వ్యాపార మార్కెట్లలో లావాదేవీలు, సమాజంలో వ్యవహారాలన్నీ స్థానిక భాషలోనే జరుగుతాయనే సంగతిని గుర్తుంచుకోవాలి.

(ఈనాడు 2015)

- తెలంగాణ, కోస్తాంధ్ర, రాయలసీమల్లోని 20 మండలాల నుంచి 233 బడుల్లో
- 915 మంది విద్యార్థులు
- 2002 నుంచి 2010 దాకా మూడు దశల్లో ఇళ్ళకు వెళ్ళి పిల్లల్ని, తల్లిదండ్రులను, స్థానికులను కలిసి ముఖాముఖి సర్వే
- 2011లో మళ్ళీ విడిగా స్కూల్ సర్వే
- అధ్యయనం కోసం 49 పట్టణ ప్రాంత, 29 గ్రామీణప్రాంత ఆంగ్లమాధ్యమం బడులను తీసుకున్నారు.
- పట్టణ ప్రాంతాల్లోని 35, గ్రామీణ ప్రాంతాల్లోని 109 తెలుగు మాధ్యమం బడులను ఎంచుకున్నారు.
- పట్టణ ప్రాంతాల్లోని ఆంగ్లమాధ్యమ బడుల్లో సౌకర్యాలు, విద్యార్థి- ఉపాధ్యాయ నిష్పత్తి మెరుగ్గా ఉంటోంది.
- గ్రామీణ ప్రాంతాల్లోని తెలుగు, ఆంగ్ల మాధ్యమ పాఠశాలలు రెండూ సదుపాయాల పరంగా అంతంతగానే ఉన్నాయి.
- పట్టణ ప్రాంతాల కంటే కూడా గ్రామీణ ప్రాంతాల్లోని తెలుగు, ఆంగ్ల మాధ్యమ విద్యార్థుల పౌష్టికాహార విలువల్లో అంతరం ఎక్కువగా ఉంది. తెలుగు మాధ్యమం పిల్లల్లో పౌష్టికాహార లోపం ఎక్కువ.

పిల్లలే మన అమూల్య సంపద-
పిల్లల వికాసమే జాతి వికాసం!

ఆంగ్ల భాష అవసరమే..
ఆంగ్ల మాధ్యమం అనర్థం.

పేదలైనా ధనికులైనా సొంతభాషలోనే
ప్రాథమిక విద్య!

సంపుటి : 3 సంచిక : 3
అమ్మనుడి
మే 2017

సంపాదకీయం

# ఇక – పోరాటమే దారి...

**తె**లుగు పట్ల ఆంధ్రప్రభుత్వ విధానం గురించి పూర్తి స్పష్టత వచ్చింది. నిజానికి ఇది ఎన్నడో ఏర్పడిన స్పష్టత. ఐనా పాలకనేతల్లో ఎంతో కొంత ప్రజాస్వామ్య పద్ధతీ, వివేకం ఉంటాయేమోనని కొందరిలో మిగిలివున్న ఆశకూడా నిన్నటితో కొడిగట్టుకు పోయింది.

ముఖ్యమంత్రిగారు ఒక సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ తెలుగుకోసం ఏదో చెయ్యాలన్న తపనను వెల్లడించారట. అయితే మాతృభాషా మాధ్యమం ఉండాలన్న ప్రధాన డిమాండును మాత్రం ప్రస్తావించలేదట! దీన్నిబట్టి మనం అర్థం చేసుకోవలసిందేమిటో స్పష్టం అయింది. ఎందుకంటే పత్రికల్లో వచ్చే వార్తలతోపాటు, టీవీ ఛానళ్లలో వచ్చే సమాచారంతో పాటు– ప్రభుత్వానికి అనేక కళ్లూ చెవులూ ఉంటాయి. ఇవే గాకుండా ఈ అంశంపై ముఖ్యమంత్రిగారికి కొందరు వ్యక్తులు, ప్రముఖ సంస్థలు వ్రాసిన జాబుల్నికూడా పక్కన పెట్టేశారు. తెలుగు భాషోద్యమ సమాఖ్యతోపాటు కొన్ని సంఘాలు, పూర్వ ఐ.ఎ.ఎస్ అధికారి ఇ.ఎ.ఎస్. శర్మ వంటి ఉద్యమశీలురూ వ్రాసిన లేఖలకు ముఖ్యమంత్రి సమాధానం ఇవ్వకుండా మౌనం వహించడం కూడా ఈ అంశంపై ప్రభుత్వ విధానమేమిటో తెలియజేస్తూనే ఉంది. జి.ఓ. నెం. 14లో తెలుగు మాధ్యమాన్ని పూర్తిగా ఎత్తివేస్తూ ఆంగ్లమాధ్యమాన్నే తప్పనిసరి చేసిన పరిస్థితిలో ఏమీ మార్పులేదు. తెలుగు మాధ్యమాన్ని తొలగించడం లేదనీ, ఇంగ్లీష్‌తో పాటు తెలుగు మాధ్యమంకూడా ఉంటుందనీ మునిసిపల్ మంత్రీ, విద్యామంత్రీ ఒకపక్క అంటూనే ఆ తెలుగు వ్యతిరేక జి.ఓ.ను పూర్తిగా అమలు చెయ్యడానికి యుద్ధోత్సాహంతో ముందుకు సాగుతున్నారు. ముఖ్యమంత్రి గారు తెలుగు అభివృద్ధికోసం ఏదో చేస్తున్నామంటూ ప్రకటనలు చేస్తూ, ఆచరణలో తన మంత్రులద్వారా సాగిస్తున్న వ్యూహం ఇది.

మండలి బుద్ధప్రసాద్‌గారికి గౌరవ డాక్టరేట్ ఇచ్చిన సందర్భంగా విజయవాడలో నిన్న సాయంత్రం అభినందనసభ జరిగింది. తెలుగన్నా తెలుగు సాంస్కృతికత అన్నా ఒక ప్రతీకగా తెలుగు రాష్ట్రాల్లోనే గాక బయటి రాష్ట్రాల్లోనూ, విదేశాల్లోనూ ఎంతో కీర్తి తెచ్చుకున్న బుద్ధప్రసాద్‌గారు ఈ సభలో చేసిన ప్రసంగంలో తనదైన శైలిలో చెప్పవలసింది చెప్పేశారు. తాము భాగస్వామిగా ఉన్న ప్రభుత్వాన్నీ తమనేతనూ ఆయన విమర్శించాలనిగాని, విమర్శిస్తారనిగాని తెలివిగల వారెవ్వరూ అనుకోరు. అందులో బుద్ధప్రసాద్‌గారివంటి సర్వహితమూర్తి తొందరపడి తగనిచోట తగని మాటలు మాట్లాడుతారని అనుకోలేం. ఆయన ప్రభుత్వ బాధ్యతను గురించి గాని, మాతృభాషా మాధ్యమం అవసరాన్ని గురించి గాని ఏమీ మాట్లాడకుండా– ప్రజల్లోనే చైతన్యం రావాలని, ప్రతి ఇంట్లో, తల్లిదండ్రుల్లో మార్పు రావాలని, అంతవరకూ ఏమీ జరుగదని చెప్పారు. ఈ చైతన్యాన్ని తెచ్చే దిశగా భాషా సేవకులంతా కృషి చెయ్యాలన్నారు. ప్రజాస్థాయిలోనే మాతృభాషను కాపాడుకోవాలన్నారు. పొరుగు రాష్ట్రాల్లో తమతమ మాతృభాషల్ని కాపాడుకోవడం పట్ల వారిలో వున్న పట్టుదలను ప్రశంసించారు తప్ప, మన ప్రభుత్వ బాధ్యతను గురించి ఏమీ మాట్లాడలేదు!

ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇంతకంటె ఆయన నుంచి ఆశించగలిగేది ఏమీ లేదు. ఒక గౌరవనీయ పదవిలో తాము ఉంటూ ప్రభుత్వాన్ని విమర్శించేంత తీవ్రమైన చర్యకు డా॥ మండలి బుద్ధప్రసాద్ పాల్పడుతారని అనుకోలేం. ఉన్న అవకాశాలను ఉపయోగించి, తెలుగుకోసం ఏది వీలైతే, ఎంతవీలైతే అంత చెయ్యాలనుకొనే, చేసే స్వభావం, వ్యూహం ఆయనది. రాజకీయాల్లో ఆయన ఉదారవాది. ప్రజాస్వామ్యశీలం ఉన్న వ్యక్తి. ఇప్పుడున్న ఏకపక్ష, నిరంకుశ, స్వార్థ రాజకీయాల్లో అధికారపక్షంలో ఉండే ఏదైనా సాధించగలుగుతాం తప్ప ప్రతిపక్షంలో ఉండి ఏమీ సాధించలేమన్నది ఆయన విధానం.

ఇటీవల ఒక విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యుడు ఒక దినపత్రికలో వ్రాసిన వ్యాసంలో ఆశించినట్లు – అధికారంలో ఉన్న ఉద్యమనేతలైనా ప్రభుత్వానికి ఈ విషయంలో ఏమీ చెప్పగల స్థితిలో లేరని, త్యాగబుద్ధి చూపినంత మాత్రాన ఏమీ సాధించలేమనే అభిప్రాయంతో ఉన్నారని కూడా బోధపడుతోంది.

జి.ఒ.నెం. 14కు సంబంధించినంతవరకు– తెలుగు మాధ్యమాన్ని తీసివేయబోవడం లేదనీ, ఇంగ్లీషు మాధ్యమాన్ని కూడా ప్రవేశపెడుతున్నామనీ ప్రభుత్వం ప్రకటించింది కనుక, ఇదే నిర్ణయాన్ని కోర్టుకు కూడా తెలుపుతుంది. వ్యాజ్యం వేసినవారు కూడా ఇందుకు అభ్యంతరం చెప్పదలచుకోనివారేనని తెలుస్తోంది. కనుక కోర్టులో వ్యాజ్యం పరిష్కారమవుతుంది. మాతృభాషా మాధ్యమంలో కనీసం ప్రాథమిక విద్యను నేర్పితీరాలన్న కర్ణాటక ప్రభుత్వ నిర్ణయం రాజ్యాంగ వ్యతిరేకం అని సుప్రీంకోర్టు ఇప్పటికే తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఒక విధాన నిర్ణయంగా ఈ అంశాన్ని ముందుకు తేవడానికి రాష్ట్ర ప్రభుత్వాలు

తిరస్కరించడం చాలా సులువైన పని. ఈ సాకుతో ప్రభుత్వం తెలుగును బోధనామాధ్యమంగా నిర్దేశించడానికి ముందుకు రాదు. మంత్రులుగా తిష్ట వేసుకొన్న విద్యావ్యాపారుల ప్రతినిధులు తమ ఇష్టం వచ్చిన రీతిలో ప్రభుత్వాన్ని శాసించడానికి పట్టుదలతో ముందుకు సాగుతున్నారు. ఇదంతా మొత్తం ప్రభుత్వ విద్యారంగాన్నే కలుషితంచేసి, నిర్వీర్యం చేసేందుకూ, క్రమంగా మొత్తంగా ప్రయివేటు వ్యక్తుల, సంస్థల అధీనంలోకి వాటిని నెట్టివేసేందుకూ జరుగుతున్న విద్రోహచర్య మాత్రమే.

మాతృభాషా మాధ్యమం పాఠశాల విద్యలో– కనీసం ప్రాథమిక విద్యలో విద్యార్థికి పూర్తిగా శ్రేయస్కరం అని విద్యావేత్తలంతా పదేపదే చెప్తూవున్నదే. గణాంకాలతో సర్వేలన్నీ చెప్తున్నవే. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ అయితే రెండు తెలుగు రాష్ట్రాల్లో సర్వే చేసి తెలుగు మాధ్యమమే మేలు అని నిరూపించిన విషయం దినపత్రికల్లో వచ్చిన సంగతి అందరికీ తెలిసిందే. అంతెందుకు? సాక్షాత్తు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యాశాఖ 2015లో 13 జిల్లాల్లో జరిపిన సర్వేలో తేలిందేమిటి? ఒకటవ తరగతినుండే ఆంగ్లమాధ్యమం వద్దని, ఆరవ తరగతి నుంచి ప్రవేశపెట్టవచ్చునని తేల్చి చెప్పింది కదా, దానిని మంత్రివర్యులు ఎందుకు కప్పిపెడుతున్నారు? ఇటీవలే లోక్‌సభలో వచ్చిన ఒక ప్రశ్నకు సమాధానం చెప్తూ కేంద్రమంత్రి చేసిన ప్రకటన కూడా విద్యాహక్కుచట్టాన్ని ఉటంకిస్తూ మాతృభాషా మాధ్యమాన్ని సమర్థిస్తూనే, అది రాష్ట్రాల ఇష్టానికి సంబంధించిన విషయమని చెప్పింది.

అయినా రాష్ట్రప్రభుత్వ మునిసిపల్ శాఖ మంత్రి తెలుగు మాధ్యమానికి వ్యతిరేకంగా పనిగట్టుకొని ప్రచారం చేస్తూ, తెలుగు మాధ్యమంలో చదివినవారికి భవిష్యత్తు లేదని చెప్పడంలో ఔచిత్యం ఏమిటి? ప్రత్యేకించి ఎంసెట్‌లో తెలుగు మాధ్యమ విద్యార్థులు విజయాన్ని సాధించలేరనడం అబద్ధం కాదా? ప్రభుత్వ బడుల సమర్థత, అసమర్థతలను బేరీజువేసి మాట్లాడుతున్నారా ఆయన? నిష్పాక్షిక పరిశీలనకూ చర్చకూ సిద్ధంగా ఉన్నారా ఆయన? బహిరంగ చర్చకు సిద్ధపడకుండా తన ఇష్టం వచ్చినట్లు చేసుకుపోవడమేనా ప్రభుత్వ పద్ధతి? పాఠశాల విద్య విషయంలో మునిసిపల్‌శాఖమంత్రికి విధానపర నిర్ణయాలను పూర్తిగా అప్పజెప్పేశారా ముఖ్యమంత్రిగారు? మునిసిపల్ మంత్రీ విద్యాశాఖామంత్రీ వారి సలహాదారులూ మాతృభాషా మాధ్యమ ఉద్యమకారులతోనూ, విద్యావేత్తలతోనూ, నిపుణులతోనూ బహిరంగచర్చకు సిద్ధంగా ఉన్నారా?

'ప్రజలు కోరుకొంటున్నారు గనుక మేం ఇదంతా చేస్తున్నాం' అనే ప్రకటన వెనుక మర్మాన్ని కూడా బహిరంగ చర్చకు పెట్టాలి. ఏ పరిస్థితుల్లో అమాయకప్రజలు విద్యావ్యాపారుల, వారి ప్రభుత్వాల ప్రచారానికి లోబడుతున్నారు? ఒకవైపు తెలుగు మాధ్యమంతో పాటు ఇంగ్లీషు మాధ్యమంకూడా ఉంటుందే తప్ప, తెలుగును పూర్తిగా తీసివేయబోమంటూ ప్రకటనలిస్తున్న మంత్రులు అందుకు తగ్గ స్పష్టమైన ప్రభుత్వ ఉత్తర్వులనెందుకు ఇవ్వడం లేదు? అదే సమయంలో తగినంతమంది ప్రజలు కోరితేనే తెలుగు మీడియం తరగతులుంటాయని బెదిరింపులకు, పరోక్ష హెచ్చరికలకు మంత్రుల, అధికారులు పాల్పడుతున్నారన్న వార్తలు నిజం కాదా? తెలుగు మాధ్యమాన్ని పటిష్టంగా అమలు చెయ్యడానికి, బోధనా స్థాయిని, సౌకర్యాలను పెంచడానికి ప్రభుత్వం ఏం చేస్తున్నది?

తెలంగాణలో అయితే ఆంగ్లమాధ్యమంలోకి చదువునంతా మార్చేశారు. అక్కడా ఇక్కడా కూడా అధికారంలో ఉన్న రాజకీయ పార్టీలతో పాటు, అధికారాన్ని చేపట్టాలని పోటీ పడుతున్న రాజకీయ పార్టీల విధానం ఏమిటి అనేదే ఇప్పుడు అసలు ప్రశ్న.

శాస్త్రీయమైన, హేతుబద్ధమైన విద్యావిధానం మాతృభాషా బోధననే కోరుకుంటుంది. రాజ్యాంగం గాని, విద్యాహక్కుచట్టంగాని, యునెస్కోగాని, మేధావులుగాని చెప్తున్నదిదే. వివేకం ఉన్న ఎన్నో దేశాలు, మనదేశంలోని రాష్ట్రాలు అనుసరిస్తున్నది ఇదే. మరి తెలుగు రాష్ట్రాలకు ఇదేం బుద్ధి?

ఇతర రాజకీయ భేదాలతో నిమిత్తం లేకుండా అన్ని రాజకీయ పార్టీలూ, రాజకీయేతర సామాజిక సంస్థలూ, మేధావులూ, ఉద్యమకారులూ అందరూ కలిసి ఆలోచించి ఒక స్పష్టమైన కార్యాచరణకు వెంటనే పూనుకోవలసిన తీవ్రమైన అంశం కాదా ఇది? ఇప్పుడు కదలకపోతే, మొత్తం తెలుగుజాతి భవిష్యత్తరాల సృజనాత్మకతను, వ్యక్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని కోలుకోలేని విధంగా దెబ్బతీసినట్లే అవుతుంది. కొద్దిమంది స్వార్థపరుల దుర్మార్గానికి జాతిని వదలి వెయ్యడం విజ్ఞత కాదు.

ప్రజలను చైతన్యవంతులను చెయ్యాలి నిజమే. అన్ని శాస్త్రాలకంటే అర్థ (రాజకీయార్థికం) శాస్త్రం గొప్పదనీ, కారణం అది నిర్ణయాత్మక శక్తి కావడమేనని చాణక్యుడు చెప్పిన సంగతిని ఇక్కడ గుర్తుంచుకోవాలి. రాజ్యశక్తి పక్కదారి పట్టినపుడు, ప్రజాశక్తిని కూడగట్టడం మేధావుల బాధ్యత. నేటి రాజకీయ వ్యవస్థలో ప్రజాశక్తి ఓటులో ఉంది. అది ప్రజల చేతుల్లో ఉంది. తెలుగుజాతి మేలు అంతా తెలుగు భాషలో ఉంది. దాన్ని కాపాడుకోవడం కోసం జరిగే ఉద్యమం 'ఓటు'ను ప్రభావితం చేస్తుందనుకొన్నప్పుడే నేటి రాజకీయ పార్టీలు సరైన దారిలోకి వస్తాయి. అప్పటిదాకా ఇప్పుడున్న మద్య విధానాలూ, విద్యా విధానాలూ, భాషా విధానాలూ, ఆర్థిక విధానాలూ వేగంగా నడుస్తూనే ఉంటాయి.

ఇక– పోరాటమే దారి. ప్రజలను చైతన్యపరచే కార్యక్రమాల్ని పెద్ద ఎత్తున అందరి సహకారంతో ఉద్యమస్థాయిలో చేస్తూనే, మరోప్రక్క పాలకవర్గాలను దారిలో తెచ్చేందుకు ప్రజాస్వామ్య పోరాటాలను కొనసాగించవలసిందే.

(వివరాల కోసం ఈ సంచిక 5,6,50 పుటలను చూడండి)

సామల రమేష్‌బాబు

తేది : 01-05-2017

విష్వచూపు

-చలసాని నరేంద్ర
98495 69050

# హిందీ ఆధిపత్యం- ఇతర భారతీయ భాషల పట్ల ఉదాసీనత !

కేంద్రమంత్రులు అందరూ ఇకనుండి హిందీలోనే ప్రసంగించాలని అంటూ ఆరేళ్ళ క్రితం పార్లమెంటరీ కమిటీ ఒకటి చేసిన సూచనను ఆమోదిస్తూ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఇప్పుడు ఉత్తరువులు జారీ చేయడంతో నరేంద్ర మోదీ ప్రభుత్వం అనువరిస్తున్న భాష విధానం పట్ల ఇప్పుడు మరోసారి అనుమానాలు ముసురుకోవడం ప్రారంభమైనది.

చిరకాలంగా దేశంలో భాషావిధానం పట్ల చెలరేగుతున్న ఆధిపత్య ధోరణులు భారతీయ భాషల సంపూర్ణ వికాసానికి గొడ్డలి పెట్టుగా మారుతున్నాయి. రాజ్యాంగ పదవులలో ఉన్న వారంతా, హిందీలో మాట్లాడాలని 2011లో పార్లమెంటరీ కమిటీ చేసిన సిఫార్సు ఇప్పుడు ఎందుకు తెరపైకి వచ్చిందో అర్ధం కావడం లేదు.

ఆయా పదవులకు ఎన్నిక కావడానికి హిందీ లో మాట్లాడే, హిందీని చదువ గలిగే అవసరం లేదు. హిందీ రాకపోయినా వారిని హిందీలో మాట్లాడమని నిర్బంధించడం ఎటువంటి పరిణామాలకు దారితీయగలదో ఊహించలేము. మరోవంక10వ తరగతి వరకు విద్యాబోధనలో హిందీని నిర్బంధంగా బోధించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం మరో ప్రమాదకర ఆధిపత్య ధోరణిగా గుర్తించాలి.

బ్రిటిష్ విద్యా మానస పుత్రులయితే ఆంగ్లం అభ్యసిస్తే గాని ఆధునిక ప్రపంచం చూడలేమనే సంకుచిత ధోరణితో మనపై ఆంగ్లాన్ని రుద్ది, భారతీయ భాషలను కాలక్రమంలో కుంచించుకు పోయే పరిస్థితులు కల్పించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా భారతీయ భాషలకు మాత్రం ఇంకా వలస ఆలోచన విధానాలతో నలిగిపోతూనే ఉన్నాయి. ఈ విషయమై రాజ్యాంగ స్ఫూర్తితో ఏ ప్రభుత్వమూ వ్యవహరించే ప్రయత్నం చేయడం లేదు.

విదేశీపాలన నుండి ఆంగ్లభాష ఆధిపత్య ధోరణులు మన నాయకులను క్రమ్మివేస్తూ వస్తుంటే, మరో వంక హిందీ భాష ఆధిపత్య ధోరణులు భారతీయ భాషలను సమాధి చేసే స్థితికి చేరుస్తున్నాయి. స్వరాష్ట్రం గుజరాత్ లో సహితం తాను హిందీలో మాట్లాడితే తప్ప తనను జాతీయ నాయకుడిగా ప్రజలు గుర్తించరనే దౌర్భాగ్య పరిస్థితికి మన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేరుకోవడమే అందుకు ప్రత్యక్ష నిదర్శనం.

దేశంలో భాషావిధానంపై స్వాతంత్ర్యం వచ్చిన తొలి రెండు దశాబ్దాల పాటు ఎన్నో వివాదాలు, ఆందోళనలు, తర్జనభర్జనలు జరిగి చివరకు త్రిభాషా సూత్రం అనే ఒక అభిప్రాయానికి వచ్చాము. అయితే హిందీ పాలిత రాష్ట్రాలలో ఈ సూత్రానికి విలువ లేకుండా చేయడంతో భాషాపరంగా దేశంలో సామరస్యత సాధించలేక పోతున్నాము.

**రాజ్యాంగ సభలో విస్తృత చర్చ**

భారత రాజ్యాంగ సభలో బహుశా భాష అంశంపై జరిగినంత విస్తృతమైన, భావావేశాలతో కూడిన చర్చ మరే అంశంపై కూడా జరుగలేదని డా. బి ఆర్ అంబేద్కర్ చెప్పారు. చివరకు ఒక వోటు ఆధిక్యతతో హిందీని అధికార భాషగా చేయాలనే నిర్ణయానికి వచ్చారు. అధికార భాష అంటే పరిపాలన భాష మాత్రమే గాని, జాతీయ భాష మాత్రం కాదని గుర్తించాలి.

దేశంలోని భాషలు అన్నీ జాతీయ భాషలే అని, అన్నింటికీ సమాన గౌరవం, ప్రతిపత్తి ఇవ్వాలని రాజ్యాంగం స్పష్టం చేస్తుంది. అయితే రాజకీయ నాయకత్వం ఆ అంశాన్ని పట్టించుకొనడం లేదు. 1965 నుండి ఇంగ్లీష్ స్థానంలో హిందీని అధికార భాషగా అమలులోకి తీసుకు రావాలని రాజ్యాంగం నిర్దేశించింది.

అయితే ఆ సమయంలో పలు హిందీయేతర రాష్ట్రాలలో, ముఖ్యంగా తమిళనాడు వంటి దక్షిణ రాష్ట్రాలలో చెలరేగిన హింసాయుత నిరసనలతో ఆ ప్రయత్నాన్ని ప్రభుత్వం విరమించు కొంది. హిందీ పట్ల జాతీయ ఏకాభిప్రాయం ఏర్పడే వరకు బలవంతంగా ప్రజలపై రుద్దబోమని ఆనాటి ప్రధాన మంత్రి లాల్ బహదూర్ శాస్త్రి స్పష్టమైన హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగానే కొఠారి కమీషన్ సిఫార్సు మేరకు 1968 నుండి త్రిభాషా సూత్రాన్ని తీసుకువచ్చారు. ఆ సూత్రం ప్రకారం ప్రతి రాష్ట్రంలో తమ మాతృభాషతో పాటు హిందీ, మరో భాషను నేర్చుకోవాలి. జాతీయ సమైక్యత భావన పెంపొందింప చేయడం కోసం హిందీ రాష్ట్రాలలో ఏదో ఒక దక్షిణాది భాషను నేర్చుకోవాలని పేర్కొన్నారు.

ఈ సూత్రాన్ని అన్ని రాష్ట్రాలు అమలు ప్రారంభించినా హిందీ రాష్ట్రాలలో మాత్రం ఇప్పటికీ అమలుకు నోచుకోవడం లేదు. ఇతర భారతీయ భాషలను నేర్పడమే లేదు. దానితో భాషాపరంగా మన దేశం సమైక్యతను సాధించడం సాధ్యపడటం లేదు.

భారత దేశ జాతీయతను ఎల్లప్పుడూ భిన్నత్వంలో ఏకత్వం అని గర్వంగా చెప్పుకొంటూ ఉంటాము. అయితే ఎక్కువగా వాడే హిందీని లేదా సంస్కృతంను అధికార భాషగా చేసి ఉండవలసింది. ఇజ్రాయిల్ ఏర్పడిన తరువాత శిధిలావస్థలో ఉన్న హీబ్రూ భాషను పైకి తీసుకొచ్చి అభివృద్ధి చేసుకొన్నారు. ఈ విషయమై జాతీయ నాయకులు ఒక నిశ్చిత అభిప్రాయానికి రాలేక పోవడంతో తొలినుండి వివాదాస్పదంగా మారుతూ వచ్చింది.

మహాత్మా గాంధీ, సావర్కర్ వంటి నాయకులు హిందీ కోసం పట్టుబట్టగా అంబేద్కర్ మాత్రం సంస్కృత భాష కోసం వాదించారు. సుభాష్‌చంద్రబోస్ రోమన్ లిపిలో ఉండే హిందీ పట్ల మొగ్గు చూపారు. నేడు తిరిగి ఇటువంటి రాగద్వేషాలను తెరపైకి తీసుకు వచ్చే ప్రయత్నం జరుగుతున్నది. పాఠశాలలో సహితం హిందీని నిర్బంధంగా బోధించాలనే ప్రతిపాదనను పైకి తీసుకు వస్తున్నారు.

బలవంతంగా ఒక భాషను ప్రజలపై రుద్దే ప్రయత్నం చేస్తే జాతీయ సమగ్రతకు భంగం వాటిల్లే పరిస్థితులకు దారితీస్తుందని ఈ

సందర్భంగా గుర్తించాలి.

పాకిస్తాన్ ప్రభుత్వం తూర్పుబెంగాల్ ప్రజలపై బలవంతంగా ఉర్దూను రుద్దే ప్రయత్నమే నిరసన ఉద్యమాలకు దారితీసి, ఆ తరువాత బాంగ్లాదేశ్ ఏర్పడటానికి కారణమైనదని ఈ సందర్భంగా మరచిపోరాదు.

**ఆదరణ పొందలేకపోతున్న సంస్కృతం**

ఇతర భారతీయ భాషలను అణచి వేయడం కోసం హిందీ రాష్ట్రాలలో సంస్కృతంను ప్రోత్సహించే ప్రయత్నం చేస్తున్నారు. 1968 నాటి త్రిభాషా సూత్రం ప్రకారం తమ మాతృభాషతో పాటు హిందీ, మరో ఇతర భాషను నేర్చుకోవలసి ఉండగా, హిందీ రాష్ట్రాలలో ఇంగ్లీష్‌ను కాకుండా సంస్కృతంను నేర్చుకొంటున్నారు.

అంటే హిందీ రాష్ట్రాలలో అత్యధికులు అటు ఇంగ్లీష్‌లో గానీ, ఇటు సంస్కృతంలో గాని మాట్లాడలేని పరిస్థితులలో ఉన్నారు. భాషలకు సంబంధించి చివరంగా 2001 నాటి జనాభా లెక్కల సేకరణలో సమగ్ర సర్వే జరిపారు. దాని ప్రకారం దేశంలో సంస్కృతం మాట్లాడేవారు 14 వేలమంది మాత్రమే ఉన్నారు. హిందీ మాట్లాడే రాష్ట్రాలలో, దేశ రాజధానిలో పాఠశాలల్లో ఈ భాషను నిర్బంధంగా బోధిస్తున్నా ఇటువంటి పరిస్థితి ఏర్పడటం విచారకరం.

**ఢిల్లీలోనే 2015-16లో 98 శాతం పాఠశాలల్లో సంస్కృతం బోధిస్తున్నారు. 1,94,801 మంది విద్యార్థులు ఈ భాషను చదివారు. ఢిల్లీ లోని 1,024 ప్రభుత్వ పాఠశాలల్లో 4,296 మంది సంస్కృత ఉపాధ్యాయులు ఉన్నారు. అంటే ప్రతి 45 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు అన్నమాట. అయినా సంస్కృత భాష జీవం పోసుకోవడం లేదు.**

నేడు దేశంలో కేవలం 10 రాష్ట్రాలలో మాత్రమే హిందీ ప్రధానమైన బాష. దానిని ఇతర రాష్ట్రాలపై, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలపై బలవంతంగా రుద్దే ప్రయత్నం, మరో వంక హిందీ రాష్ట్రాలకు చెందిన వారు ఏదో ఒక దక్షిణాది భాషను నేర్చు కోవడం పట్ల విముఖతను కొనసాగిస్తూ ఉండటం నేడు జాతీయ సమైక్యతకు ఎదురవుతున్న ప్రధాన సవాల్ గా గుర్తించాలి.

2001 నాటి జనాభా లెక్కల ప్రకారం దేశంలో 25 శాతం మంది ప్రజలకు మాత్రమే హిందీ మాతృభాషగా ఉంది. భాషాపరమైన సమస్యలకు త్రిభాషాసూత్రంలోనే పరిష్కారాలు కనుగొనవచ్చని, తిరిగి భాషోన్మాదాన్ని రెచ్చగొట్టే ప్రయత్నం చేయడం తగదని బిజెపి యంపీ స్వపన్‌దాస్ గుప్త హెచ్చరించారు. ఉత్తరాదిన త్రిభాషా సూత్రాన్ని సమాధి చేస్తూ ఉండడం వలన దేశంలో అనేక భారతీయ భాషలు సమాధి కావడానికి దారితీస్తున్నట్లు పలువురు భాషా నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**మాతృభాషల వికాసానికి అడ్డంకులు**

భాషా ప్రయుక్త రాష్ట్రాలను ఏర్పాటు చేసుకున్న తరువాత, భాషల ఆధారంగా పలు రాష్ట్రాల ఏర్పాటు జరిగిన తరువాత ఇప్పుడు భాషాపర వివాదాలను తెరపైకి తీసుకు రావడం తగదు. బలవంతంగా హిందీ భాషను ఇతరులపై రుద్దే ప్రయత్నం కూడా ప్రమాదకర సంకేతాలను పంపగలదని అర్థం చేసుకోవాలి. హిందీ భాషను అభివృద్ధి చేయాలని కోరుకునేవారు ఇతర భాషల పట్ల తమ వైఖరిని మొదట ఆత్మావలోకనం చేసుకోవాలి.

ఎవ్వరైనా ఒక ప్రసంగం చేసే సమయంలో తాను ఏ భాషలో ధారాళంగా, స్పష్టంగా మాట్లాడగలడో, తాను మాట్లాడుతున్న అంశాన్ని, ప్రదేశాన్ని బట్టి నిర్ణయించుకొంటూ ఉంటారు. అట్లా కాకుండా ఒక భాషలో మాట్లాడమని నిర్బంధం చేసే ప్రయత్నం చేయడం దురహంకారమే కాగలదు.

హిందీ భాషా ప్రాంతాలలో ఇతర భాషా ప్రజలకు తమ మాతృ భాషను నేర్చుకొనే సదుపాయం కల్పిస్తున్నారా? తాము ఇతర భాషలను నేర్చుకొనే ప్రయత్నం చేస్తున్నారా? మనం ఎంతో గౌరవంగా చూసే



పలువురు జాతీయ నాయకులు సహితం హిందీ భాషోన్మాదులుగా వ్యవహరించి ఇతర భాష ప్రజల మనోభావాలను గాయపరచే ప్రయత్నం గతంలో కూడా చేశారని ఈ సందర్భంగా గుర్తించాలి. ఇప్పుడు నరేంద్ర మోదీ ప్రభుత్వం ఆ దిశలో పయనం చేసున్నట్లు భావించవలసి వస్తున్నది. ఈ ధోరణులను కొనసాగించిన పక్షంలో తిరిగి దేశంలో భాషాపరమైన ఘర్షణలకు తావిచ్చినవారు కాగలరు.

భారతీయ భాషల వికాసం ద్వారానే హిందీ వికాసం సహితం ఆధారపడి ఉంటుందని గుర్తించాలి. పాఠశాల విద్య మాతృభాషలో మాత్రమే సాగాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకొని, భారతీయ భాషల అభివృద్ధికి దోహద పడవలసిన సమయం ఇది. స్థానిక ప్రజలకు అందుబాటులో పరిపాలన ఉండటం కోసం ప్రజల మాతృభాషలో పాలన సాగాలి. అందుకు అవసరమైన వాతావరణం ఏర్పాటు చేసే ప్రయత్నం జరగాలి.

**హిందీ వ్యాప్తి అనివార్యం**

మన దేశంలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితులలో హిందీ భాష వ్యాప్తి అనివార్యంగా జరుగుతూ ఉండగా ఇటువంటి ఆధిపత్య ధోరణులు తీవ్ర ప్రమాదకర సంకేతాలుగా మారుతున్నాయి. హిందీ సినిమాలు, కేబుల్ టి వి చాన్నళ్లు హిందీ భాషను దేశం అంతా సుపరిచితం చేయడంలో గొప్ప పాత్ర వహిస్తున్నాయి.

నేడు దేశంలో అనేక ప్రాంతాలలో హిందీ భాష వ్యాప్తి చెందుతున్నది. ముఖ్యంగా వాణిజ్యం, వినోదంలలో ఈ భాష ప్రాధాన్యత పెరుగుతున్నది. ఆ విధంగా క్రమ వికాసం చెందటం స్వాగతనీయమే. కానీ ఇతర భాషల పట్ల వివక్ష పూరితంగా వ్యవహరించడం, హిందీని మాత్రమే ప్రోత్సహించే ప్రయత్నం ప్రభుత్వమే చేయడం పలు అనర్ధాలకు దారితీసే అవకాశం ఉంది.


శాంతియుతంగా దేశంలో హిందీ వ్యాపిస్తున్న తరుణంలో మూఢంగా వ్యాప్తి చేసే ప్రయత్నాలు చేయడం తగదు. ఈనాడు సివిల్ సర్వీస్ పరీక్షలను పలు ప్రాంతీయ భాషలలో జరుపుకొంటు న్నాము. పోటీ పరీక్షలు, ప్రవేశ పరీక్షలు సహితం ప్రాంతీయ భాషలలో జరపాలనే వాదనలు వినిపిస్తున్నాయి. **వివిధ భారతీయ భాషల అభివృద్ధి కోసం పలు జాతీయ సంస్థలు వస్తున్నాయి. అయితే అవి అర్ధవంతంగా పనిచేసేందుకు అవసరమైన విధానపర నిర్ణయాలు, వనరుల కేటాయింపు జరగడం లేదు.**


**జాతీయ స్థాయిలో సహితం ఇతర ప్రాంతీయ భాషలను ప్రోత్సహించడం ద్వారా ఇంగ్లీష్ ప్రాధాన్యతను తగ్గించి, తద్వారా అనుసంధాన భాషగా హిందీ ని అభివృద్ధి చేసే వీలు కలుగుతుంది. ఉదాహరణకు పార్లమెంట్ లో హిందీ ప్రాంతానికి చెందిన వారంతా తమ భాషలో మాట్లాడుతున్నారు. మిగిలిన ప్రాంతాలకు చెందిన వారిని సహితం తమ తమ భాషలలో మాట్లాడమని ప్రోత్సహించవచ్చు గదా?** ఎటూ అనువాదం సదుపాయం ఉంటుంది.

కేంద్ర మంత్రులను సహితం తమ తమ భాషలలో మాట్లాడమని ప్రధానమంత్రి ఆదేశిస్తే భారత జాతీయతకు ప్రతినిధిగా నరేంద్ర మోడీ నిలిచి ఉండేవారు. వారి ప్రసంగాలకు స్థానిక భాషలలో అనువాద సదుపాయం కల్పించడం ఏమంత కష్టం కాబోదు.

**ముందుగా ప్రాథమిక స్థాయిలో విద్యాబోధన తప్పనిసరిగ్గా మాతృభాషలో మాత్రమే జరగాలనే నిబంధనను ప్రభుత్వం విధించాలి. ఆంగ్లభాషకు బానిసలైన మేధావులు, అధికారవర్గం నుండి దేశ ప్రజలకు విముక్తి కలిగించాలి.**

**అన్ని భారతీయ భాషలు వికసించే అవకాశాలను కల్పిస్తూ, పరిపాలన పరంగా కూడా రాష్ట్ర స్థాయిలో ఆయా భాషలు రాజ్యమేలే పరిస్థితులు కల్పించగలిగితే అనుసంధాన భాషగా హిందీ సహితం సహజరీతిలో వికసిస్తుంది. అట్లా చేయకుండా హిందీని మాత్రమే ప్రోత్సహించే ప్రయత్నం చేయడం దేశంలో అర్ధ శతాబ్దకాలం నాడు చెలరేగిన భాషాద్వేషాలను తిరిగి రెచ్చగొట్టినట్లు అవుతుంది.**




## సురవరం ప్రతాపరెడ్డి పుట్టినరోజు మే 28 :

### "తెలుగుజాతి వారసత్వ దినోత్సవం"

*అఖిల విద్యల సమాహారమాతడు విజ్ఞానఖని*
*మూగవడిన తెలంగాణ– మూల్గిన తొలినాటి ధ్వని–* దాశరధి

*తన పరిశోధనాత్మను పిండి "ఆంధ్రుల సాంఘిక చరిత"గా సంతరించె.*
*తన నేల సారస్వతశ్రీల "గోల్కొండ కవుల సంచిక"లోన నవధరించె*
*తన కవితా చణత్వమును "హంవీరసంభ" కావ్యఖండాన పాదుకొల్పె*
*తన రాజకీయ నైపుణమును పత్రికా సంపాదకత్వాన చాటిచూపె*
*తన ప్రజాహితమని గ్రంథాలయోద్యమ ప్రసారమ్ము కొరకు ధామమ్ము జేసె*
*మా తెలంగాణమును సంభ్రమముగొల్పె / తనదు సర్వమునొడ్డె ప్రతాపరెడ్డి*

–సినారె.

బోధనా
మాధ్యమం

-రహ్మానుద్దీన్ షేక్
96869 03386


# విద్యాబోధనకు ఆంగ్లమా? విద్యను మాతృభాషా బోధన ఏ విధంగా ప్రభావితం చేస్తుంది?

ఇటీవల కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన జాతీయ విద్యా విధానం మాతృభాషలో విద్యాబోధనకున్న ప్రాధాన్యతను తెలిపింది. ముఖ్యంగా ప్రాథమిక విద్యకు మాధ్యమంగా మాతృభాషను మించిన మాధ్యమం లేదని తెలిపింది. ఈ వ్యాసం ద్వారా దక్షిణ భారతదేశ చారిత్రక సంఘటనల నేపథ్యంలో పాఠశాలల్లో భారతీయ భాషల వాడకం, అక్షరాస్యత సాధనల మధ్యనున్న సంబంధాన్ని నిరూపించే ప్రయత్నం జరిగింది. ఈ విశ్లేషణ ద్వారా మాతృభాషలో విద్య వల్లనే ప్రాథమిక-ఉన్నత పాఠశాల విద్య అక్షరాస్యత శాతాన్ని క్రమంగా పెంచుతూ వచ్చిందని నిర్ధారించగలము.

తొలినాళ్ళ విద్యను మాతృభాషలో చదువుకోవటం ద్వారా ప్రతి ఒక్క విద్యార్థి భవిష్యత్తుకు మంచి పునాది పడుతుందని, ఇది ఎంతో ముఖ్యమని చెబుతూనే జాతీయ విద్యా విధానం మరికొన్ని ఆసక్తికరమైన విషయాలను తెలిపింది. పిల్లలు సహజంగానే మాతృభాషకు, ఇంటిభాషకు అదనంగా ఎన్ని భాషలైనా నేర్చుకునే సామర్థ్యం కలిగి ఉంటారని అంగీకరించింది. అన్ని రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వాలు వారి అనుకూలతననుసరించి ఐదవ తరగతి వరకు, మాతృభాష-స్థానిక భాష-ప్రాంతీయ భాష మాధ్యమాలుగా పాఠశాలల్లో విద్యనందించవచ్చు.

పాఠశాలల్లో విద్యామాధ్యమ భాష ఏది ఉండాలి అన్న ప్రశ్న ఇవాళ కొత్తగా పుట్టుకు రాలేదు. 1938 లో జాకిర్ హుస్సేన్ కమిటీ పాఠశాలల్లో భారతీయ భాషలుండాలని సూచించింది. 1964 నాటి డి.ఎస్. కొఠారి కమిషన్, 1968 నాటి జాతీయ విద్యా విధానం కూడా ఈ సూచనను బలపరిచాయి. ఐనా కానీ పిల్లల మాతృభాష - పాఠశాలల్లో బోధనా మాధ్యమం మధ్య వేరేగానే ఉంటూ వచ్చాయి. ఈ ప్రశ్నకు నేటికీ కచ్చితమైన సమాధానం లేదు. ఇందుకు కొఠారీ గారు కూడా స్పందిస్తూ ఒక విద్యార్థి చదువుతున్న భాష - అతని మాతృభాష ఒకదానితో ఒకటి పరస్పర విరుద్ధంగా ఉండటం (విడాకులు తీసుకోవటం) - భారతదేశం తప్ప ప్రపంచం మొత్తంలో ఇలాంటి సమస్య లేదు అన్నారు.

వలస వెళ్ళిన పెద్దలవెంట ఉన్న పిల్లలు పరాయి భాషలో విద్యనభ్యసించాల్సిన దుస్థితిని పత్రికలు, వార్తా ఛానళ్ళు ఆ ప్రాంత భాష విజయంగా ప్రతిబింబిస్తూ వార్తలు ప్రసారం చేస్తాయి. చిన్నప్పుడే కొత్త భాషలు నేర్చుకునే అలవాటు చేసుకుంటే మాతృభాష సమస్యలు పెద్ద ప్రాధాన్యత కాకపోవచ్చు. ప్రభుత్వాలకు కూడా కొన్ని భాషలలో




బ్రిటిష్ కాలంనాటి
విద్యాబోధన - మాధ్యమ పరిస్థితి

విద్యనందించడం పెద్ద సమస్య కాదు. ఉదాహరణకి మన ఇళ్ళల్లో పిల్లలకి మాటలు నేర్చుకునేప్పుడే హిందీ-ఇంగ్లిష్ భాషలను తెలుగుకు అదనంగా నేర్పించేస్తే. ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో కేవలం ఇంగ్లిష్-హిందీ మాధ్యమాలనే దేశవ్యాప్తంగా ఒకే విధానం అమలు విపరీతంగా మాతృభాష - బోధనమాధ్యమభాష వేరువేరుగా ఉన్న జిల్లాలను విషమ జిల్లాలనుకుందాం. సమ జిల్లాలలోని ప్రగతిని, విషమ జిల్లాలలోని ప్రగతిని బేరీజు వేసుకుంటే సహజ చారిత్రక పరిశోధన ఫలితాలు మన ముందున్నట్టే. జిల్లా స్థాయిలో అక్షరాస్యత శాతం పరిగణిస్తే సమ జిల్లాల్లో స్వాతంత్ర్యం నుండి అది పెరుగుతూ వచ్చింది. ఈ ప్రభావం ప్రాథమిక-ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల కొనసాగింపు మీద కూడా ఉంది. సమ జిల్లాలలో తమ మాతృభాషలోనే విద్యనభ్యసించిన వారు 18% ఎక్కువ అక్షరాస్యులుగా ఉన్నారు. పోల్చి చూస్తే 25.2% ఎక్కువ మంది ఉన్నత విద్యను కొనసాగించారు. కానీ ఈ తేడా విశ్వవిద్యాలయ స్థాయిలో కొద్దిగానే ఉంది. ఇందుకు కారణం ఆ స్థాయికి చేరినవారు అందరూ ఆంగ్లంలోనే విద్యనభ్యసించాలి కాబట్టి.

1956 లో ఫజల్ అలీ కమిషన్ సిఫార్సుల మేరకు భాషా ప్రాతిపదికన రాష్ట్రాల పునర్విభజన జరిగింది. ఆ సమయంలో చెప్పుకోదగ్గ విషయం అన్ని రాష్ట్రాలలో అధికార భాషలే పాఠశాలల్లో బోధన మాధ్యమ భాషలయ్యాయి. అంటే మరింత మంది విద్యార్థులకు వారి మాతృభాషలో చదివే అవకాశం వచ్చింది. ఐతే ఇంతకు ముందు విషమ జిల్లాలు ఇప్పుడు చాలా వరకు సమ జిల్లాలయ్యాయి కదా, అందువల్ల ఏమైనా ప్రయోజనం చేకూరిందా?

ఈ పునర్విభజన వలన అక్షరాస్యత, ప్రాథమిక స్థాయి దాటి ఉన్నత స్థాయి విద్యనందుకుంటున్న వారి సంఖ్య, మెట్రిక్యులేషన్ పూర్తి చేస్తున్న వారి సంఖ్య బాగా పెరిగాయని జిల్లా స్థాయి సెన్సస్ గణాంకాల ద్వారా తెలిసింది. అంతకు ముందు విషమ జిల్లాలనుకున్నవి 37% అక్షరాస్యతను పెంచుకున్నాయి, 56% ఎక్కువ విద్యార్థులు చదువు కొనసాగించారు, 60% ఎక్కువ విద్యార్థులు మెట్రిక్యులేషన్ పూర్తి చేసారు, 51% ఎక్కువ విద్యార్థులు కళాశాల స్థాయి విద్యనభ్యసించారు. అంటే ఆంగ్లం మాధ్యమంగా ఉన్న బ్రిటిష్ కాలం నాటి ఉన్నత విద్యతో పోల్చుకుంటే మాతృభాషా మాధ్యమ స్వాతంత్ర్యానంతర ఉన్నత విద్య ఎన్నో మెరుగైన మార్పులను తెచ్చిపెట్టింది.

**విద్యా విధానం తెచ్చిన సంస్కరణలు**

1968 నాటి త్రిభాషా సూత్రం ప్రతిపాదించిన సందర్భానికి, నేటికి విద్యనభ్యసించే విధానాలలో చాలా మార్పులు వచ్చాయి. ఇటీవలి కాలంలో విద్యా మాధ్యమం ఇంగ్లిష్ ఉండాలనే గళం ఊపందుకుంది. ముఖ్యంగా పేద బడుగు వర్గాలలో, గ్రామీణ ప్రాంతాలలో ఈ పోకడ పెరుగుతూనే ఉంది. అందువల్ల విద్యా బోధన మాధ్యమం, విద్యా సంస్కరణల కోసం నెలకొల్పిన టి.ఎస్.ఆర్. కమిటీ తమ సరికొత్త విద్యా విధాన ప్రతిపాదనల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల బోధన, బోధన మాధ్యమంగా మాతృభాష ఉండాలని పేర్కొనింది. పైగా ఈ సిఫార్సుల్లో సంస్కృతం, ఇంకా ఎన్నో విదేశీ భాషలను పాఠశాల విద్యాప్రణాళికలో చేర్చాలని చెప్పింది. ఈ విధానం యూరప్ లో ప్రాచుర్యం పొందింది. అక్కడ 60.8% విద్యార్థులు వారి మాతృభాషకు అదనంగా రెండు కన్నా ఎక్కువ భాషలను నేర్చుకుంటారు. మనశ్శాస్త్ర నిపుణుల పరిశోధనల ప్రకారం కూడా మూడు ఆపైన భాషలు నేర్చుకున్న విద్యార్థుల సామర్థ్యం ఇతర విద్యార్థులకన్నా ఎక్కువని తేలింది. అలాంటి విద్యార్థులు బోధన సరిగా లేని పరిసరాల్లో కూడా రాణించగలరని తేలింది. ఆ ప్రకారంగా పలు కారణాల వలన నిత్యం రాష్ట్రాల మధ్య వలస వెళుతున్న విద్యార్థులకు బహుభాషలు నేర్పించే విధానాలు తెస్తే కొత్త ప్రదేశానికి వచ్చిన విద్యార్థులు పరాయివారుగా ఉండరు. వారి సాంస్కృతిక అస్తిత్వానికి ఎలాంటి భంగం ఏర్పడదు.

1968 నాటి జాతీయ విద్యా విధానం ప్రకారం "భారతదేశ విద్య–అక్షరాస్యత, సాంస్కృతిక అభివృద్ధి కోసం భారతీయ భాషలు, వాటి సాహిత్యాలు బలోపేతమవ్వాలి, దినదినాభివృద్ధి చెందాలి. అలా జరక్కపోతే జనాల సృజనాత్మకత మరుగున పడిపోతుంది. పాఠశాలల్లో బోధించే విద్య నీరసపడిపోతుంది, విజ్ఞానం జనాలకందదు, పండిత–పామర వ్యత్యాసం మిగిలిపోతుంది (పెరగవచ్చు కూడా!)."

(http://www.ideasforindia.in/article.aspx?article_id =1778 వద్ద తరుణ్ జైన్, రేవతి సూర్యనారాయణల వ్యాసం ఆధారంగా)

# తెలుగులో చదివినవారికి ఇంగ్లీషు రాదా?

**–ఎస్. ఆర్. పరిమి, 9490635346**

ఏప్రిల్ 1 ఆంధ్రజ్యోతిలో అన్నవరపు బ్రహ్మయ్య 'తెలుగు చదివితే ఇంగ్లీషు వస్తుందా?' అన్న వ్యాసంలో వెలిబుచ్చిన అభిప్రాయాలు బడుగు వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య లభించడం లేదనే సమస్యకు పరిష్కారం కాదు. ప్రాథమిక స్థాయి నుంచి ఆంగ్ల మాధ్యమంలో చదవాల్సి రావడం పిల్లల మేధోపరమైన ఎదుగుదలను కుంటుపరు స్తుందన్న సత్యాన్ని పూర్తిగా విస్మరించారు. ఆంగ్ల మాధ్యమంలో చదివిన పిల్లలు మేధోపరమైన వికాసానికి నోచుకోరు. అటువైపు పరుగులెత్తుతున్న తల్లిదండ్రులు మన భావిపౌరులను తమదైన వ్యక్తిత్వం లేని సేవకులుగా మిగిలిపోవడానికి సిద్ధంచేస్తున్నారు. కార్పొరేట్ విద్య మెరుగైన విద్యగా చలామణి అవడమే అసలు సమస్య. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు లేకపోవడం అసలు సమస్య. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమం పెడితే ధనిక పిల్లలు అక్కడ చేరబోరని అందరికీ తెలుసు. ప్రజల భాషలో జీవిస్తూ, ఆంగ్లమాధ్య మంలో మొదటి నుంచి నేర్చుకోవాల్సి రావడంతో ధనిక పిల్లలు ఎక్కువ నష్టపోతున్నారు. విషయ అవగాహనలో మాతృభాషలో నేర్చుకున్న వారికంటే వెనకబడి పోతున్నారనేది బ్రిటిష్ విశ్వవిద్యా లయం సర్వే వెల్లడిస్తోంది. ప్రపంచంలోని సభ్య సమాజాలన్నీ ఆదరిస్తున్న భాషావిధానంలోని విజ్ఞతను మన పాలకులతో సహా ఎంతోకొంత చదువుకున్న విద్యావంతులు కూడా చూడలేక పోవడం ఆశ్చర్యం. ఈ మాధ్యమం సమస్యకు అసలైన పరిష్కారం– కనీసం ప్రాథమిక స్థాయి వరకైనా, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలన్నిటిలోను మాతృభాషా మాధ్యమంలోనే విద్యాబోధన జరగాలి. ఇంగ్లీషుని భాషగా మొదటి తరగతి నుంచి శాస్త్రీయ విధానంలో ఇంగ్లీషు భాషాప్రావీణ్యం గల ఉపాధ్యాయులచే బోధన చేయించాలి. ఇంగ్లీషు ను భాషగా నేర్పే సంకల్పం ప్రభుత్వానికున్నట్లైతే, ఆ దిశలో ఇప్పటికే ఎన్నో అడుగులు పడాల్సింది. ప్రతి ప్రాథమిక పాఠశాలలో అర్హతగల ఇంగ్లీషు ఉపాధ్యాయుడ్ని నియమించి శాస్త్రీయంగా ఆ పరాయి భాషను మాధ్యమంగా వాడగలిగే స్థాయికి తీసుకుని వచ్చేవారు. భాషగా చెప్పగలిగిన ఒక్క టీచరు లేరు. సబ్జెక్టులు ఇంగ్లీషు మాధ్యమం లో, అది కూడా ఆ భాషను అర్థం చేసుకోలేని విద్యార్థులకు నేర్పాలనే ప్రయత్నం విద్యా లక్ష్యాన్ని పూర్తిగా విస్మరించడమే. పిల్లలు మేధోపరంగా వికసించడానికి మాతృభాషా మాధ్యమంలోనే బోధన జరగాలన్న నిబంధనని ప్రైవేటుస్కూళ్లకు కూడా వర్తింపచేయాలి. ధనిక వర్గం అశాస్త్రీయమైన విద్యను అభ్యసిస్తుంటే, పేదలకు అదే కావాలని అడగటం, వాళ్ళను కూడా అజ్ఞానంలోకి నెట్టడమే.

(ఆంధ్రజ్యోతి, ఏప్రిల్ 12)

తెలుగు
మాధ్యమం

# మరి కొన్ని ప్రశ్నలూ సమాధానాలూ

–ఆచార్య గారపాటి
ఉమామహేశ్వరరావు
98661 28846

తెలుగుమాధ్యమం పై చర్చలో ముందుకువస్తున్న కొన్ని ప్రశ్నలకు సమాధానాలను గత రెండు సంచికలలో ఇచ్చాము. ఇక్కడ మరికొన్ని ఇస్తున్నాము. ఇంకా ప్రశ్నలు ఏమైనా మిగిలిఉంటే, పంపండి. –సం॥

**1. తెలుగు నేర్చుకోవాలంటే, ఇంగ్లిష్ మాధ్యమాన్ని వదిలెయ్యాలని పదుగురి అభిప్రాయంగా తెలుస్తోంది. అవునా?**

క్షమించాలి. మనం కోరేది ఏమిటో కొంచెం గమనించండి. తెలుగు నేర్చుకోవడం కాదు, ఉన్నది తెలుగే. తెలుగు మాధ్యమం ఉండాలి, ఇంకా ఇంగ్లీషూ నేర్చుకోవాలి కానీ ఇంగ్లీషు బోధనా మాధ్యమంగా కాదు అని. రెండు భాషలే ఏమిటి, అవసరమైతే అంతకంటే ఎక్కువే నేర్చుకోవాలి.

**2. ఇంగ్లీషు ఎంతో గొప్పగా అభివృద్ధి ఐన అంతర్జాతీయ భాష; వాణిజ్య మాధ్యమ భాష; ఉన్నతవిద్యామాధ్యమ భాష. ఒకప్పుడు ఎంతో ప్రాముఖ్యం లోఉన్న ఫ్రెంచి, జర్మను భాషలను అధిగమించి ముందుకు వెళ్ళి వర్ధిల్లుతున్న భాష. ఇంగ్లీషు ఉంటే తప్పేమిటి?**

ఒక భాష అభివృద్ధి చెందినదా లేదా అనేది భాషా తత్త్వంలో లేదు, ఆ భాషను వాడే రంగాలనుబట్టి ఉంటుంది. అంటే సామాజిక రాజకీయ విధివిధానాలకు సంబంధించినది. అనేక రంగాలలో మాధ్యమంగా వాడుతుంటే భాష అభివృద్ధి చెందుతుంది. అందుకనే తెలుగును అన్నిచోట్లా వాడాలి అంటున్నాం. ఏ భాషను ఎక్కడ వాడాలో అక్కడ వాడాలి. అట్లా వాడనప్పుడు ఆ భాష వాడకం కొంతమందిని భయపెడుతుంది. కొందరు దూరమవుతారు. కొందరికి నిరుప యోగం. మరికొందరికి ప్రాణంమీదికి రావచ్చు.

**3. ఇంగ్లీషు బారినుండి తెలుగుని ఎలా రక్షించుకోవాలి అని ఆలోచించే దానికన్నా దానితో ఎలా సహజీవనం చెయ్యాలో తెలుసుకోవాలి. ఇంగ్లిష్ వస్తే గాని సేల్స్‌గర్ల్ ఉద్యోగం కూడా రాని ఈ రోజుల్లో ఇంగ్లీషు మాధ్యమాన్ని అందరూ కోరుకోవడంలో తప్పేంటి?**

ఔను. మన ఆలోచనకూడా ఎలా రక్షించుకోవాలి అనేదానికంటే తెలుగుకు దాని ఉచిత స్థానాన్ని ఎలా తిరిగి రాబట్టాలనే. ఎంత దౌర్భాగ్యం మనది!. తెలుగుతో సేల్స్ గర్ల్ ఉద్యోగంకూడా తెచ్చుకోలేని పరిస్థితిని కల్పించుకున్నాం! వంకాయలూ ఉప్పూ పప్పూ కొనుక్కోవ టానికి కూడా ఇంగ్లీషు అవసరమనిపించేలా మన విద్యావ్యవస్థను తయారుచేసుకున్న మన బానిస బతుకుల మానసిక స్థితిని గురించి ఏమని చెప్పుకోవాలి! తెలుగు మాధ్యమం మనందరికోసం, మన సమాజంలో అందరికీ సమస్థాయిని కల్పించగల తెలుగును వదిలి ఆంగ్లమాధ్యమమా? ఉన్నత విద్య అనంతరం ఎవరికి అవసరమైతే వాళ్లు ఆంగ్లమాధ్యమంలోకి మారవచ్చు. ఆంగ్లమేకాదు ఇతర భాషల లోకికూడా మారవలసిన అవసరం రావచ్చు. అసలు ఇంగ్లీషు మాధ్యమం ఎందుకు అనే ప్రశ్నను లేవనెత్తాలి. అసలు ఇంగ్లీషు రాని చోట, ఇంగ్లీషు అవసరమే లేని చోట, ఇంగ్లీషును నేర్పేవాళ్లు తగినంతమంది లేని చోట ఇంగ్లీషు మాధ్యమం వల్ల ప్రయోజనం ఏమిటి?

**4. తెలుగును బతికించుకోవడానికి వేరే మార్గాలు వెతకాలి.**

ప్రత్యామ్నాయాలను పరిశీలించవచ్చు. కానీ ఇలాంటివి మళ్లీ ఈ దారే పడతాయి. మాతృభాషలు బతికి ఉండాలంటే బోధనా మాధ్యమంగా కొనసాగటం ఒక్కటే మార్గం.

**5. తెలుగు లిపి ఇంకా కంప్యూటర్ మిత్రం కావాలి.**

ఔను. ఇవన్నీ జరగాలంటే తెలుగును వాడే రంగాలు విస్తరించాలి. అది తెలుగు మాధ్యమంతోనే సాధ్యం. ఎన్నో లిపి సంస్కరణలకు సంబంధించిన సూచనలు వచ్చాయి, వస్తున్నాయి. బుల్లి తెరలపై ఎక్కువ పంక్తులు పట్టేవిధంగా వత్తులను ఒకదానికింద ఒకటి రాయకుండా పక్కపక్కన రాసే విధానం, దానికి కావలసిన తెలుగు ఖతి (ఫాంట్) కూడా వాడుకలోకి వచ్చింది (చూ. తెలుగు భాషా సంగణనం Telugu language computation: ఉమామహే శ్వరరావు, 2012, తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణ). ఇంకా ఎన్నో ఉపకరణాలు అందుబాటులోకి వచ్చాయి, వస్తున్నాయి (సందర్శించండి: caltslab.uohyd.ac.in). మీ సూచన తప్పక పాటించవలసిందే. కానీ మాతృభాషా మాధ్యమమే మన ముందున్న ప్రధాన సమస్య.

**6. తెలుగు పదాలు వున్నచోట సంస్కృతం గాని, ఆంగ్లం గాని వాడవలసిన అవసరం లేదు గదా?**

ఇక ఏ పదం వాడాలి, అరువు పదాలు ఉండాలా లేదా అనేది అసలు సమస్యే కాదు. ప్రతివారికి వారి నేపథ్యం, శిక్షణ, పనిచేసే రంగాన్నిబట్టి వాడుకలో తేడాలు ఉంటాయి. ఎవరు ఎలా రాయాలో మనం నియంత్రించగూడదు. రాయనీయండి, ఎవరికి ఇష్టమైన పద్ధతిలో వారిని. నేటి కంప్యూటరు మనకు ఇష్టమైన రీతిలో మన మాండలికంలో మనం చదువుకొనేందుకు ఒక్కక్షణంలో మార్చి మనముందు ఉంచుతుంది. దీన్ని తయారుచేయడానికి పెద్ద పరిజ్ఞానమూ తెలివీ అవసరం లేదు. ఇది త్వరలో అందరిముందుకూ రానున్నది. ఎవరి మాండలికంలో వారు రాసుకుంటే చదువుకునే వారు తమకు ఇష్టమైన మాండలికంలో చదువుకునే ప్రత్యామ్నాయాలు వచ్చాయి.

**7. ప్రజలు మాట్లాడేదే భాషగానీ పండితులు రాసేది మాత్రమే కాదు గదా!**

భాషనుగురించిన చేసిన ఈ సూచన అక్షరాలా నిజం. మన భాషా తత్త్వం గురించి చాలామంది చాలా చెప్పారు. ఇప్పుడు మన తక్షణ కర్తవ్యం, మన జన బలమూ, తెలివీ, సమయమూ అన్నింటినీ కలిపి తెలుగు మాధ్యమాన్ని నిలుపుకొనేందుకు కృషిచేయడమే. మనందరం తెలుగు మాధ్యమంలో చదువుకొని ఇంగ్లీషు నేర్చుకున్నవాళ్లమే. ఇప్పుడు విదేశాల్లో ఉన్నవారిలో 90% తెలుగుమాధ్యమంలో చదువుకున్నవారే. ఇంతమంది తెలుగుమాధ్యమంలో చదువుకున్నవారు జీవితంలో గెలిచి వెలుగుతున్నప్పుడు మనం భాషను బలిపెట్టవలసిన అవసరం లేదు.

**8. సంస్కృతం విశ్వభాష. దాన్ని పలకడమంటే ప్రపంచంలో ఏ భాషనైనా మనం పలకగలమనే గదా అర్థం?**

అది మీరు సంస్కృతం మీద ఉన్న ప్రేమతో లేక ఇష్టంతో అన్నమాటే కానీ నిజం కాదు. సంస్కృతంలో లేని ధ్వనులు డజన్లకొద్దీ ఇతర భాషలలో

ఉన్నాయి. ఉదా. తమిళంలోనూ, ప్రాచీన తెలుగులోనూ ఉన్న ? కారం, హ్రస్వ ఎ, ఒ, లు, సంస్కృతంలో లేవు. ప్రతి భాషకూ దాని ప్రత్యేక వర్ణమాల ఉంటుంది. సంస్కృతం గొప్పతనం భాషది కాదు ఆ భాషలో ఉన్న సాహిత్యానిది, ఆ భాషను వర్ణించిన వ్యాకరణానిది.

**9. మహాప్రాణ అక్షరాలు ఉన్న పదాల అర్థాల విశిష్టతను తెలియజేయడానికే ఈ మహాప్రాణాల సృజన జరిగిందనిపిస్తుంది. ఉదాహరణకు వ్యాఘ్రం అంటే పెద్ద పులి అని మనకు తెలుసు. అది భయంకరమైనదని శబ్దంలోనే అర్థం అయిపోతుంది కదా! అలాగే "బాధ". "ద"కు బదులు "ధ" వాడటం వలన ఆ నొప్పి ఎంత అనేది బహుశా ఆ పదం అర్థం కాకపోయినా పలుకులోనే కొంత అర్థం అయిపోతుంది.**

అది నిజంకాదు. అట్లా అయితే భాద అనికూడా అనవచ్చు కదా. భార్యాభర్తలు భయంకరమైనవాళ్లు కాదుగదా. మైధునంలో ఆ ఒత్తు ఎందుకు? బరువుకు వత్తు ఉంటే బావుండేదేమో! ఐతే సంస్కృత మహాప్రాణాల వాడుకకూ తెలుగులో మహాప్రాణాల వాడుకకూ చాలా తేడా ఉంది. తెలుగులో తత్సమ తద్భవాలలోని మహాప్రాణాలని సాధారణంగా తేల్చి పలుకుతాం. తెలుగులో వాటిని అర్థాన్ని నొక్కి చెప్పడానికి వాడతాం. ఉదా. గట్టిగా, ధారం, ఘాలి, మొదలైనవి. ప్రకృతిలోని శబ్దాలను అనుకరించగా వచ్చిన పదాలు అన్ని భాషలలోనూ ఉంటాయి, ఉదా, గడగడ, లొడలొడ, జరజర, గరగర, సలసల, భగ్గుమను, ఢామ్మను లాంటివి. భళ్లున, ఇలాంటి ధ్వని అనుకరణ శబ్దాలు మామూలు పదాలతో పోల్చితే చాలా తక్కువ.

**10. తెలుగు భాషలో లేని కొన్ని అక్షరాలు తెలుగు లిపిలో ఉన్నాయి గదా, వాటిని తీసివేసి లిపిని సంస్కరించవచ్చుగదా?**

" ఙ, ఞ, ళ, శ, ష వంటివి, ఖ, ఘ, ఛ, ఝ, ఠ, ఢ, థ, ధ, ఫ, భ, లాంటివాటి వాడకం చాలా తక్కువగా, కొన్నింటి అవసరం అసలే లేకపోయినా అవి లిపికి సంబంధించినవి. ఇతర భాష పదాలను రాయడానికీ నేర్చుకోవడానికి తప్పనిసరిగా ఉపయోగ పడతాయి. వీటిని పనిగట్టుకొని తీసివేయాల్సిన అవసరం లేదు గానీ అవసరం మేరకు వాడుకోవచ్చు. లిపి చారిత్రక ఆనవాలు. కంప్యూటరు యుగంలో లిపిలో పెద్దపెద్ద మార్పులు అవసరం లేదు. నేటి అవసరాలకు దీటుగా మార్పులు అవసరం.

ఇతర భాషలను నేర్చుకోవడానికి మనభాషలో అవసరం లేకపోయిన కొన్ని శబ్దాలు ఉండాల్సిన అవసరం లేదు. తెలుగులో ఉన్న కొన్ని ధ్వనులు చారిత్రకంగా లిపి ద్వారా వచ్చినవే. మన తెలుగు లిపి ఇతర లిపులలాగా భారతదేశ పశ్చిమోత్తర భాగం నుండి రావడం వలన ఆ భాషలలో ఉన్న ధ్వని చిహ్నాలు మనకు అవసరం లేకపోయినా వర్ణమాలలో నిలిచివున్నాయి. తెలుగు లిపిని సంస్కృతం, ప్రాకృతం, ఒడియా, భాషలను రాయడానికి వాడేవారు. అట్లాగే, అసలు ఏ భాషనైనా ఏ లిపిలోనైనా రాసే వీలుంది.

**11. అయితే ఇలాంటివి ఎంత తక్కువ ఉంటే అంత తక్కువ గురుప్రమేయంతో భాషను నేర్చుకోవడం సాధ్యమవుతుంది గదా.**

తక్కువ అక్షరాలు ఉంటే తక్కువ సమయం, తక్కువ ప్రయాసతో నేర్చుకోవడం అనేది నిజంకాదు. భాషలో వర్ణాలు (అక్షరాలు అనుకుందాం) తక్కువైతే వాటిని వాడే పద్ధతి కష్టమౌతుంది. ఉదా. తమిళంలో చాలా తక్కువ అక్షరాలు ఉన్నాయి. అయితే దానివలన ఎన్నో కష్టాలు. అక్షరాన్ని ఏ సందర్భంలో ఎలా పలకాలో తెలుసుకోవాలి. ఇక్కడ ప్రయాస ఎక్కువ. లిపి పరిమాణాన్ని బట్టి ఒక భాషకన్నా ఇంకో భాష కష్టమైనదనీ ఇంకొకటి తేలికైనదనీ అనుకోవడంలో శాస్త్రీయత లేదు. లిపిని వాడేవిధానం వలన భాషను నేర్చుకోవడం కొంత కష్టం కావచ్చు. భాషలలోని వివిధ వ్యవస్థలమధ్య సాపేక్షత ఉంటుంది.

**12. స్థూలంగా చూస్తే తెలుగు లిపి, పదాల అల్లిక శాస్త్రీయంగా ఉన్నట్లనిపిస్తుంది గదా?**

తెలుగు లిపిలోగానీ లేక ఏ లిపిలోనైనా శాస్త్రీయత కంటే వరవడీ, పద్ధతులే ఎక్కువ ఉంటాయి. ఇవి చారిత్రకంగా ఏర్పడినవి. ప్రతిలిపిలోనూ కావలసినంత అశాస్త్రీయతా, పద్ధతులూ కూడా ఉంటాయి. తెలుగులిపిలో అక్షరాలను రాసే వరస పలికే వరుసకు భిన్నంగా ఉంటుంది. ఒక రకంగా ఇది అశాస్త్రీయం. మన రాత ఎడం నుండి కుడికి, పైనుండి కిందికి అనుకుంటాం. కానీ ఎడమనుండి కుడికీ, ఆపైన కిందికీ, మళ్లీ పైకి రాస్తాం. ఉదా. త్రాగు (తా+ర్+గు) రాసే వరస అయితే పలికే వరస ఇట్లా (త్ +రా +గ్+ఉ). ర మీద ఇవ్వాల్సిన దీర్ఘం త మీద ఇస్తున్నాం. ఇది అంతా అశాస్త్రీయం. కానీ ఇదొక పద్ధతి. చారిత్రక వికాసంలో వచ్చిన వరవడులు. అంతే.

**13. ఈరోజు ప్రపంచంలో అత్యధికులకు అర్థమయ్యేదీ మాట్లాడేదీ ఇంగ్లీషే. అది వావి వరసలు లేని భాష అని మనకు తెలుసు...**

ఇదీ నిజం కాదు. ప్రపంచ జనాభా లెక్కలు తీయండి. ఎక్కువమంది మాట్లాడేవి వ్యవహారం నడిపేవాటిలో వరుసగా చైనీసు, హిందీ, స్పానిషు, ఇంగ్లీషు, అరబిక్, బెంగాలీ ..... ఈ వరుసను మార్చి రకరకాలుగా ప్రాముఖ్యతను బట్టి కొందరు వేరుగా ఇవ్వవచ్చు. పేరుకు హిందీ, ఉర్దూ రెండు భాషలైనా ఉన్నది ఒకటే. లిపి తేడాతోనూ సంస్కృతం, అరబికు నుండి అరువు తెచ్చుకున్న పదాలచేత అవి రెండు భాషలని అనిపించవచ్చు. ఢిల్లీ రోడ్డుమీదో, అలహాబాదు రోడ్లమీదో ఒకేభాషలో మాట్లాడుకొంటున్న ఇద్దరిని మీది ఏ భాష అని అడిగితే ఒకరు హిందీ అని మరొకరు ఉర్దూ అని చెబుతారు. ఇక భాషలకి వావివరసలు ఉండటం, లేకపోవటం అని ఏమీ ఉండదు.

**14. అరకొర సౌకర్యాలున్నందున తెలుగు బడులకు ఎవరు వస్తారు? ఐనా, అన్నీ ఉన్నా తెలుగు బడులకు ఎవరు వస్తారు?**

అరకొర సౌకర్యాలు ఉంటే మరి ఎవరు మాత్రం పిల్లల్ని అలాంటి స్కూళ్లకు పంపిస్తారు! ఐతే ఒకటి నిజం. మంచి సౌకర్యాలు కల్పించినా తెలుగు బడులకు పిల్లలు రారని. ఎందుకంటే తెలుగు చదువుకుంటే ఉద్యోగ భద్రత లేకపోవటమే. మన వాదన అంతా దీని చుట్టూతానే తిరుగుతోంది. తెలుగు మాధ్యమంలో చదువుకున్నవారికే ఉద్యోగాలు అని చట్టం చేయండి. తెలుగు బడులకు విద్యార్థులు వస్తారో లేదో చూడండి. తెలుగు మాతృభాషగా ఉన్నవారు 85-90% ఉన్నచోట తెలుగు మాధ్యమంలో విద్యాబోధన లేకపోవడం మన మానసిక దౌర్బల్యమూ, హేతుబద్ధంకాని నిర్ణయాలే కారణం. ఇది కొత్త వలసవాదం (neocolonialism) లో భాగమే. వీటి వల్లనే రోజూ మనం వింటున్న హత్యలూ ఆత్మహత్యలూ, మనుషులమధ్య అసహనమూ, మానవతా విలువల హననమూను. ఇవే - రేపటి సమాజ దుర్గతికి నేటి బాటలు. ఇంగ్లీషు చదువులద్వారా ఎంత మందికి ఇతర దేశాలలో ఉద్యోగాలు వస్తున్నయ్యో తెలుసుకుంటే మనం ఇంగ్లీషు కోసం ఇంత వెంపర్లాడడం, తాపత్రయపడడం ఉండదేమో. ఇంగ్లీషును ఒక భాషగా నేర్చుకోవడం వేరు, దాన్ని బోధనా మాధ్యమంగా ఎంచుకోవడం వేరు.

బోధనా మాధ్యమం

-ఆచార్య చందు సుబ్బారావు

# తెలుగు తెలియని తరం వస్తోంది, జాగ్రత్త!


ఈవేళ సమస్య అభిమాన దురభిమానాల గురించి కాదు. తెలుగు రాజకీయ శక్తుల భవిష్యత్తు మీద. తెలుగురానితనం ఆవిర్భవిస్తే, పత్రికలు చదివేవారు ఎవరు? మీ దూరదర్శన విశ్లేషణలు వినేవారు ఎవరు? మీ 'సినిమాలను' చూసేవారు ఎవరు? మీ కోట్ల రూపాయల పెట్టుబడి భవిష్యత్తు ఏమిటి? మీ సినిమాలు ఇంగ్లీషులో తీస్తారా? శాసనసభల్లో ఇంగ్లీషులో ప్రసంగిస్తారా?

రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌ను 'నవ్యాంధ్ర' అనీ, 'సీమాంధ్ర' అనీ, 'స్వర్ణాంధ్ర' అనీ అభిమానులు పిలుచుకుంటున్నారు. పైగా 'శాతవాహన తెలుగు చక్రవర్తుల శౌర్యాని'కీ, 'బుద్ధదేవుని బోధముద్రల'కూ కేంద్రమైన అమరావతిని రాజధానిగా ఎంచుకుని అభివృద్ధి చేసుకుంటున్నారు. అష్టదిగ్గజాలూ, వారి భువనవిజయ నాయకుడూ తెలుగు కవీంద్రులు, కవిత్రయం సీమాంధ్రవాసులు. వేమన, అన్నమయ్య, క్షేత్రయ్యాది ప్రజాకవులూ, పదకవులూ యిక్కడివారే. ఆధునిక యుగం పుట్టిపెరిగిందీ నేలపైనే. అటువంటి నేలపై తెలుగు తెలియని యువత పెరిగిపోతోందని చెబితే, ఇదేదో మాతృభాషా సంరక్షకుల నినాదమనో, తెలుగు మాధ్యమవాదుల వివాదమనో త్రోసిపారేయటానికి వీల్లేదు. కారణం, తెలుగురానితనం వలన జరగబోయే ప్రమాదం ప్రజల కన్నా ప్రభుత్వానికెక్కువ. సాహితీ రసికుల కన్నా రాజకీయ నాయకులకెక్కువ. సాంస్కృతిక సభావేదికల కన్నా శాసన సభలకెక్కువ.

1970ల దాకా ఎస్.ఎస్.ఎల్.సి (11వ తరగతి) వరకూ పాఠశాలల్లో తెలుగు మాధ్యమం వుండి, ఇంటర్మీడియట్‌లో ఇంగ్లీషు మాధ్యమంలోనికి పిల్లలు దూకేవారు. తెలుగు మాధ్యమంతో పాటు బోధించే ఇంగ్లీషు బోధన (వ్యాకరణం, వాక్య నిర్మాణం, సాహిత్యం) ఎంత పకడ్బందీగా సాగేదంటే, ఇంటర్మీడియట్ ఇంగ్లీషు మాధ్యమాన్ని పిల్లలు అవలీలగా అందుకునేవాళ్ళు. అప్పుడు కూడా ఇంటర్మీడియట్‌లో, బి.ఎ., బి.ఎస్సీ., బి.కామ్ డిగ్రీలలో పార్ట్-1 తెలుగూ, పార్ట్-2 ఇంగ్లీషూ, పార్ట్-3లో ఎంచుకున్న సబ్జక్టులూ చదివేవాళ్ళు (చరిత్రా, రాజకీయం, ఆర్థికశాస్త్రం, భౌతికశాస్త్రం, గణితం, రసాయనశాస్త్రం, జీవశాస్త్రం, వాణిజ్యం), డిగ్రీ విద్యల్లో రెండవ సంవత్సరం దాకా తెలుగు భాషను అధ్యయనం చేయించటానికి కారణమేమిటి? అనంతరం పీజీ కోర్సులు కేవలం ఇంగ్లీషు మాధ్యమంలో వుండేవి. ఈ విధానాలు వారి వృత్తులకూ, యిటు తెలుగు భాషాశక్తి గ్రహించి ఉత్తమ వ్యక్తులుగా తయారు కావటానికీ ఉపయోగపడేవి. ఇది వాళ్ళు మాతృభాషామూర్తిపై అధిక ప్రేమతో చేసింది కాదు. తెలుగు రానిదే తెలుగు సంస్కృతి, రాజకీయం, సమాజ జీవనం అర్థం కావు అని వారి నిర్ణయం మేరకే. వేమన్న పద్యాలు. పోతన్న భాగవతం, మాయాబజార్ సినిమా, తిరుపతి వేంకట కవుల 'పాండవోద్యోగ విజయాలు', విశ్వనాథ 'పద్యాలు', శ్రీశ్రీ గేయాలూ, గురజాడ, కందుకూరి గార్ల యుగం తెలుగులో ప్రవేశించటానికి దోహదం చేశాయి. రాష్ట్ర అవతరణ, అనంతరం విశాలాంధ్ర అవతరణ తర్వాత తెలుగు సంస్కృతీ వైభవం ఢిల్లీకి చేరటానికి (ఒక ప్రధాని, ఇద్దరు రాష్ట్రపతులూ తెలుగువారు) దోహదపడింది. తెలుగు సంస్కృతీ సామాజిక ఉన్నతీ కేవలం చైతన్యోత్సాహాలు కావు. పచ్చి ప్రజాజీవన అవసరాలు. తెలుగు మాట్లాడటం ప్రజలకు నేర్పనవసరం లేదు. మరికొన్ని వందల ఏళ్ళు వాళ్ళు మాట్లాడుతూనే వుంటారు. కాని, పత్రికల్లో పాత్రికేయులూ, కవులూ, రచయితలూ, నటులూ, నాటకకర్తలూ, రేడియో, టీవీల్లో రచయితలూ, సినిమా స్క్రిప్టు రచయితలూ, పాటల కర్తలూ, వాణిజ్య నిర్వాహకులూ బ్రతికి బట్టకట్టడానికి తెలుగు కావాలి. అది అవసరమా, అలంకారమా ప్రభుత్వ బాధ్యతా... తెలుగు ప్రేమికుల కర్తవ్యమా అన్నది ఆలోచించగలం.

**మనమే ఇలా బాధపడిపోతే యెలా? శాసన కర్తల్లో, రాజకీయ నాయకుల్లో మార్పు రావాలి. ఓట్లు..కోట్లు నమ్ముకున్న నాయకులకు తెలుగు మాతృ భాషాభిమానం ఎలా వుంటుంది? ఆంగ్ల విద్య వ్యాపారం అయింది. ఇందులోనుండే ఎమ్మెల్లేలు వస్తావున్నారు. రెండు తెలుగు నాడుల్లో మాతృనాడి కొట్టుకోవడం లేదు. ఉద్యమ నేతలు అధికారాల్లో ఉండి ఆంటీ ముట్టక చోద్యం చూస్తున్నారు. వారు త్యాగబుద్ధి చూపి మాతృభాషకి పునర్వైభవము తేవాలి.**

నేటికీ దేశంలో 30శాతం నిరక్షరాస్యులూ (కేవలం సంతకం చేయటం, దినపత్రిక పేరును కూడబలుక్కుని చదవటం అక్షరాస్యత కాదు), పది శాతం సామాన్య అక్షరాస్యులూ ఉన్నారు. గ్రాడ్యుయేట్లు పదిహేను శాతం, పీజీలు పది శాతం, వృత్తి విద్యా నిపుణులైన (ఇంజనీర్లు, డాక్టర్లు, వ్యవసాయ, జీవ శాస్త్రజ్ఞులు) వారు 20 శాతం ఉన్నారు. మిగతా 15 శాతం యువత ఉన్నత పరిశోధన, పోటీ పరీక్షలు, యాజమాన్య విద్య, అంతర్జాతీయ ప్రమాణాలు సంతరించుకున్నవారూ వున్నారు. మన విద్యావిధానంలోని "ఇంగ్లీషు మాధ్యమం గొప్పది, మంచిది, బ్రతుకు తెరువు కల్పించేది" అన్న ప్రచారం మేరకు తెలుగును చదివి, రాసి, మాట్లాడగల యువత ఇరవై శాతం దాటడం లేదు. నిరక్షరాస్యులు, అక్షరాస్యులు సరేసరి. గ్రాడ్యుయేట్లు, పీజీలు తెలుగును ప్రాణప్రదాయిని అని భావించటం లేదు. కారణం, "వీరికి ఇంగ్లీషు రాదు. ఉద్యోగాలకు పనికి రారు" అంటారేమోనని. నిజమే ఆధునిక సాంకేతిక, ప్రాపంచిక మార్కెట్‌లో బ్రతుకు తెరువుకు ఆంగ్లం అవసరమే. కాదన్నదెవరు? అర్హులైన వారిలో పదింట ఒకరు కూడా ఇంగ్లీషు సరిగ్గా మాట్లాడలేకపోతున్నారు. కారణం -మాతృభాష సరిగ్గా రాకపోతే 'పితృభాష' కూడా సరిగ్గా రాదు. ఇది కేవలం చమత్కారం కాదు. సాంకేతిక సత్యం!!




జర్మనీ, జపాన్, రష్యా, ఫ్రాన్స్, చైనాలు మాతృభాషలోనే ఉన్నత విద్య దాకా బోధిస్తారు. అనంతరం ఒక్క సంవత్సరం (లేక రెండు) ఇంగ్లీషు నేర్పించి వ్యాపార ప్రపంచం మీదకు వదులుతారు. వారి ఇంగ్లీషు నామ మాత్రమే అయినా అమెరికా, ఆస్ట్రేలియా, కెనడాలలో జపాన్, చైనీయులు ప్రథమ స్థానంలో ఆహ్వానితులు: భారతీయులు తర్వాత శ్రేణి. నిజానికి భారతీయుల ఇంగ్లీషు వారి కంటే చాలా మెరుగైందని తెలుసు. కానీ... మాతృభాషలో వారు నేర్చిన సాంకేతిక పాండిత్య సామాగ్రి, నైపుణ్యం మనకంటే పదునుగా, మెరుగ్గా ఉంటుందన్నది సత్యం. ఉద్యోగాలనిచ్చేవారు నిజమే చెబుతారు కదా! వారికది వాణిజ్య అవసరం కదా?

నిజమే. అనేక కారణాల వలన భారతీయుల ఆంగ్లభాషా ప్రవేశం చాలా శక్తివంతమైనదని ప్రపంచానికి తెలుసు. కాని సాంకేతిక నైపుణ్యానికి కూడా మాతృభాషా ప్రావీణ్యం అవసరమన్న మాట. జర్మన్లు, ఫ్రెంచివారు, చైనీయులు, రష్యనులు, జపానీయులు వారి మాతృభాషకు ఎంత గౌరవమిస్తారో ఒకసారి మాట్లాడితే తెలుస్తుంది. వారి భాషా జాతీయత ఎంత గట్టిదో పలకరిస్తే గ్రహించగలరు. సంక్లిష్ట జాతీయ పరిణామాల వలన, భారతీయులు పలు భాషల్లో పుట్టిపెరగటం వలన, ఇంగ్లీషు ప్రాణాధారంగా పరిణమించటం వలన, రాష్ట్రాలలో విద్యావిధానం 'మాధ్యమం'లో కొట్టుమిట్టాడటం వలన, యువత త్రిశంకు స్వర్గంలో పడిపోయింది.

ఈ పరిణామాల వలన తెలుగు నాట (ప్రజలు తెలుగువారు... రాష్ట్రం పేరు తెలుగు... పాలించే పార్టీ తెలుగు దేశం.. రాజధాని తెలుగువారి పుణ్యభూమి) యువత తెలుగురాని తరంగా ఆవిర్భవిస్తోంది. మాట్లాడటం తప్ప, తెలుగు రాయలేరు, చదవలేరు (నాలుగు దశాబ్దాలు ఉన్నత విద్యార్థుల మధ్య వున్న ఉపాధ్యాయుడిగా నా సాక్ష్యం చెల్లుతుందనుకుంటాను) 'లాహిరి లాహిరి లాహిరిలో' అన్న పాటను వదిలి 'కెవ్వు కేక' అన్న పాటను ఆనందిస్తున్నారు. 'మాయాబజార్' సినిమాను ఆనందించలేని అశక్తులుగా తయారవుతున్నారు. టీవీలో దృశ్యాలను, సీరియళ్ళను, సినిమాలను "చూసి" ఆనందిస్తూ, క్రింద వచ్చే "స్క్రోల్స్" చదవకుండా వదిలేస్తున్నారు. ఒబామా భారత రిపబ్లిక్ దినోత్సవ అతిథి అని పత్రికలలో కాదు, టీవీ న్యూస్ రీడర్ చెప్పగా విని తెలుసుకుంటున్నారు. సినిమా నటీనటుల జీవన గాథలు, ప్రేమాయణాలు ట్విట్టర్లో చూసి ఆనందిస్తున్నారు. ఫేస్‌బుక్, యూట్యూబ్‌లలో భావ వినిమయాలను గావించి సంతోషిస్తున్నారు.

తెలుగురాని, ఇంగ్లీషు రాని స్థితిలో ఇరుక్కుపోయారు. వారి బుద్ధికుశలతనూ, కృషినీ, చిత్తశుద్ధినీ చూస్తే ఆశ్చర్యపోతాం. వారి ప్రాపంచిక అవగాహనకు ఆనందపడతాం. కానీ గురజాడ 'దేశమును ప్రేమించుమన్నా' గీతం పాడలేని అశక్తతకు ఆగ్రహించి లాభం ఏముంది. ప్రిన్సిపాల్‌గా నేను ఒక కాలేజీలో ఆగ్రహిస్తే "పాడతాం సార్, క్షమించండి, ఇంగ్లీషులో రాసివ్వండి" అని కోరారు. "Desamunu preminchu manna... Manchi annadi..." ఇలా రాసిచ్చాను. ఈవేళ సమస్య అభిమాన దురభిమానాల గురించి కాదు. తెలుగు రాజకీయశక్తుల భవిష్యత్తు మీద. తెలుగు రానితనం ఆవిర్భవిస్తే, పత్రికలు చదివేవారు ఎవరు? మీ దూరదర్శన విశ్లేషణలు వినేవారు ఎవరు? మీ 'సినిమాలను' చూసేవారు ఎవరు? మీ కోట్ల రూపాయల పెట్టుబడి భవిష్యత్తు ఏమిటి? మీ సినిమాలు ఇంగ్లీషులో తీస్తారా? మీ శాసన సభల్లో ఇంగ్లీషులో ప్రసంగిస్తారా? ఈవేళ గంటసేపు ఆంగ్లంలో పోలవరం మీద, రాజధాని అవసరాల మీద, కులాల రిజర్వేషన్ల మీద శాసనసభలో మాట్లాడగలవారెందరున్నారు? వారు తెలుగులో కూడా అర్థవంతంగా మాట్లాడలేకపోవటానికి కారణం భాషాశక్తి లేకపోవటం.

ఈ నేపథ్యంలో ఇంతటి మహత్తర పరిణామాలు పొంచివున్న తరుణంలో, తెలుగు ఎలా నేర్పుతారు? తెలుగు మాధ్యమమా, ఇంగ్లీషు మాధ్యమమా ప్రభుత్వం తేల్చుకోవాలి. రెండూ కలిపిన వివేకవిన్యాసమా... జాతీయ అవసరమా వారే తేల్చుకోవాలి. మనం ఊపిరాడకుండా ఊదరగొట్టవలసిన అవసరమేముంది? కారణం ఈ ప్రక్రియ ఫలితం ప్రభుత్వానిది, ప్రజలది, అధికారులది, శాసనకర్తలది. కోట్లరూపాయల వాణిజ్య అవసరాలు కల్గిన దూరదర్శనం, చలనచిత్ర నిర్మాతలది. ఆయా నటులదీ, రచయితలదీ. తెలుగు భాషా జ్ఞానం యువతలో అవసరమో, కాదో వారే తెలుసుకోవాలి. మేల్కొని, ప్రభుత్వం మీద ఒత్తిడి తేవాలి.

(ఆంధ్రజ్యోతి, 30-03-2017నుండి)

బుద్ధజయంతి ప్రత్యేకం

# ఆంధ్రులకొక అంతర్జాతీయ నగరం!

- వావిలాల సుబ్బారావు
అమరావతి
98664 02973

**ఆం**ధ్రులకు ఇంకొక అంతర్జాతీయ నగరం వస్తున్నదంటే ఆనందం కాదా మరి! అమరావతి గ్రామస్తులకు ఇంకానూ! ఆంధ్రులు -అంతర్జాతీయం-అమరావతి-ఇదొక శబ్దాలంకారంగా మిగిలిపోకుండా ఉండాలిగదా! కొత్త కొత్త విషయాలు... స్మార్ట్‌సిటీ, హెరిటేజ్ టౌను - పేర్లు పత్రికలద్వారా పరిచయం అవుతున్నాయి. అర్థవంతంగా అనువాదం చెయ్యలేక పత్రికలవాళ్ళు జుట్టు పీక్కుంటున్నారేమో-పోనీలెమ్మని ఆ ఇంగ్లీషుమాటే వాడేస్తే, 'అమ్మనుడి' ఊరుకోదు. స.వెం.రమేశ్‌గారు మరీను. ఏ కోయం బత్తూరు మాటో, హోసూరు మాటో తెచ్చి ఇది మరచిపోతే ఎట్టా అంటాడు. మా అమరావతి వాళ్ళకు అంతర్జాతీయ నగరం అంటే ఇంకా అర్థమయినట్లు లేదు. మనం అంతర్జాతీయానికి వెళ్ళటమా? అంతర్జాతీయం మన దగ్గరకు రావటమా?

ఇప్పుడు కొత్త అమరావతి (రాజధాని) అంతర్జాతీయ నగరం అవుతున్నది. పాత అమరావతి (శాతవాహన నగరం) వారసత్వ నగరం కాబోతున్నది. ఏది వారసత్వం? దేన్ని నిలుపుకోవాలి? అన్నదొక మీమాంస. పరిష్కారాలు చూపటానికి, ఈ విషయంలో అంతర్జాతీయ నిపుణుడు, ఆంధ్రుడు, తత్రాపి, అమరావతిలో పుట్టి కళ్ళు తెరిచిన ప్రొ॥గల్లా అమరేశ్వర్ గారిని నియమించారు. పాపం ఆయన వచ్చారు. వారసత్వం ఇంకా ఎక్కడ మిగిలివుందా అని మూల మూలలు వెతుకుతున్నారు. నేను తారసపడ్డాను.

ఎవరెన్నిచెప్పినా మన వారసత్వం మనం నిలబెట్టుకుంటాం కదా! పొద్దుటే చెంబు చేతపట్టి వెళ్ళేవారు, గోడప్రక్క నిలబడి పాంటు జిప్పు లాగేవారు-కనిపించగా, "ఇట్టా అయితే ఎట్టాగండీ?" అని తెగ బాధపడిపోయారు ప్రొ॥గల్లా. ఇదీ మన వారసత్వమేకదా!

ఈ అలవాటును ప్రోత్సహించటం మన బాధ్యత కాదా అన్నది నా అజ్ఞానపు సందేహం. ఎద్దు బండ్లను, అరకల వ్యవసాయాన్ని, వంటల్లో తప్పేల చక్కల్ని, పులి బొంగరాలను, తాటి ముంజల్ని, సీమ చింతకాయలను ఆదరించినట్లే - ఈ గోడప్రక్క, చెంబు అలవాటుగూడాను - మన జీవన వారసత్వం గదా! అన్నాను. పాపం ప్రొఫెసర్ గల్లా గారికి దిమ్మతిరిగింది.

కొంచెం కోలుకొని చెప్పారు గత కాలంలోని ఔన్నత్యాలను, జీవన రీతులలోని విలువలను, నేటికి జరిగిన క్రమ పరిణామాన్ని ప్రదర్శనామాత్రంగా నిలుపుకొనటం, గత వైభవాన్ని, ప్రకృతి సన్నిహిత జీవనాన్ని, పరిసరాల వైవిధ్యాన్ని, ప్రజాసంబంధాల రుచిని, సృజనాత్మక వినోదాలను, కొంతసేపయినా, కొద్దిగానయినా అనుభవంలో మిగుల్చుకొనటం, అందుకోసం ప్రయత్నించటమే వారసత్వ నగర సంకల్పం. అనారోగ్యకరం, అనాగరికం, అసభ్య మయిన వాటిని నిలపటం కాదు- అని, వారసత్వోపనిషత్తు బోధించారు.

మరి అంతర్జాతీయ నగరం సంగతేమిటి? వివిధ దేశాల సుందర నిర్మాణాలను, విలాసాలను, అనూహ్య సౌనర్యాలను, దిగుమతి చేసుకొని, తళుకు బెళుకులతో కన్నులు చెదరగొట్టే ధనిక జీవితాన్ని సృష్టించి "ఇక్కడ లేనిది ఎక్కడా లేదు, ఎక్కడ ఉన్నదయినా సరే ఇక్కడ ఉన్నది" అనిపించటంకూడా అంతర్జాతీ యతే. ఇది ఎంతో కష్టమన్నమాట కూడా నిజం.,-కానీ-

అంతర్జాతీయ సమాజానికి, రాజకీయ సాంస్కృతిక రాయబారులకు, ప్రజాసంబంధాలూ, పాలక పాలిత శ్రేయో సంరక్షణలో "మన లక్షణం ఇది" అని చెప్పుకోదగ్గ ఒక్క సుగుణాన్న యినా అందించగలమా?ఫలానా నగరంలో తలుపులకు తాళాలే వేయరని, ఎక్కడో మరిచిపోయిన మన లగేజి క్షేమంగా అదే ఇంటికి చేరుతుందని, ఫలానా నగరంలో దానం చేదామంటే తీసుకొనే వారేలేరని, మరో నగరంలో వృద్ధులందరు పరమ సంతోషంగా మైదానాల్లో తిరుగుతుంటారని, వేరొక చోట పసిపిల్లల కేరింతలు తప్ప, ఏడుపులే వినిపించవని, మరొక చోట బిడ్డల బాధ్యతకోసం తల్లితండ్రుల తాపత్రయమే అక్కరలేదని- పళ్ళు పులిసిపోయే కబుర్లు వింటాం. ఆ నైతిక శీలం, ఆ కారుణ్యం, లాఠీకర్రలతో ఖాకీయుని పాఠాలతో వచ్చేది కాదు అనిమాత్రం అందరికీ తెలుసు. ఎట్టా వస్తుందో కొందరికైనా తెలుసా? 'రామరాజ్యం' అన్నమాట మొదలు 'సమ సమాజం' అన్న మాటదాకా మార్గాలు, ఆచరణలు, నిర్వచనాలు, ఎన్ని ఉన్నా వాళ్ళందరి కలల లోకం, స్వప్నసీమ మాత్రం ఒకటే. ఇంతవరకు ఎక్కడా రూపొందకపోయినా స్వప్నాలుమాత్రం సమసిపోలేదు. ఆ శ్రేయోస్వప్నం నుండి ఒకరిద్దరు అశోకునిలా దిగివచ్చినా విఫలమై వెళ్ళిపోయారు. అయినా మనుషుల మస్తిష్కాలలో కలలు ఘూర్ణిల్లుతూనే ఉన్నాయి.

"వాటి సంగతి ఇప్పుడెందుకు!" అంటే అమరావతిలో మహాచైత్యం వద్ద గాని, బక్కచిక్కిన కృష్ణాఒడ్డున గాని, ఒక రాకా పూర్ణిమ నాడు ఏకాంతంగా కూర్చుంటే ఎండిన ఆకుల గలగలల్లో ఆ స్వప్న భాషలు వినబడతాయి. నవ్య నగర నిర్మాణానికి నడుం కట్టిన మన పాలకులు, ప్రజలను ప్రేరేపించే నాయకులు ఒక్కసారి కళ్ళు, చెవులు అటు తిప్పితే కొంతయినా ఫలితం ఉండకపోదు.

ఎట్టాంటి రేపును నిర్మించాలో-అందులో తనపాత్ర ఏమిటో తెలియని అస్పష్టమైన ఆరాటంతో ఒకరి మడమలు మరొకరు తొక్కుకుంటూ కల్లోల పడుతున్నారు. గుడ్డి ప్రయాణం చేస్తున్నారు అనిపిస్తుంది-పత్రికలు తిరగవేస్తుంటే . వారిని ఆక్షేపించటం కాదుగాని- భారతదేశ రుగ్మతలకు పరిష్కారాలు భారతీయ చింతనలోనే వెతకాలి-అని భావించి 'అంబేద్కరు' బౌద్ధాన్ని శోధించినట్లు, అమరావతి అంతర్జాతీయతకు అమరావతి పూర్వచరిత్రలోనే మార్గాలు వెతకాలి.

ఏవిధమైన పూర్వ సంస్కృతీ ఔన్నత్యం లేనిచోట కట్టే నగరాలకు అనుకరణలు - భవన నిర్మాణ సౌందర్యాలు- ఐకానిక్ ప్రతిమలు సరిపోవచ్చు. అమరావతి అంటే అందమయిన పేరు మాత్రమేకాదు- ఉత్తమ పాలనా సంస్కృతికి వాచకాలు సిద్ధంచేసిన పాఠశాల గూడ.



చరిత్ర ప్రసిద్ధిగాంచిన అమరావతి మహాస్థూపం

వాటిని విస్మరించరాదని మనవి చేస్తున్నాను.

మహారాజులను నడిపించిన మహామనీషులున్నారు. అశోకునికి పూర్వం చాణక్యుడూ - అశోకుని తర్వాత ఆచార్య నాగార్జునుడూ... చాణక్యుడు యుక్తిపరుడు, తంత్రజ్ఞుడు. ఆచార్యుడు తాత్వికుడు, ధర్మాచార్యుడు. అమరావతి నేలపై నడచి బౌద్ధం పండించినవాడు ఆయన.

'బౌద్ధం' అనగానే ధర్మబోధను పండిత సంస్కృతం నుండి ప్రజల పాళీభాషకు నడిపించిన బుద్ధుని ప్రజాస్వామ్యత గుర్తుకు వస్తుంది. ప్రజల భాషకు దూరంకావటం అంటే ప్రజల ఆలోచనకు, ప్రజల జీవనానికి దూరం కావటంగా పరిణమిస్తుంది. చివరగా ప్రజలకే దూరంగా జరగటం(ఎన్నికల సమయం తప్ప) దగ్గర తేలుతుంది. మనం మాట్లాడే భాష మన మనసులను ప్రభావితం చేస్తుంది. ప్రజల భాషకు-పాలకుల భాషాభిరుచికి వ్యత్యాసం ఉన్నపుడు, వారి మధ్య దూరం పెరుగుతుంది. ఆ అగాధాన్ని పూడ్చడానికి జనాకర్షక పథకాల వంతెన అవసరమవుతుంది. అంతఃకరణలేని ఆకర్షణ వాగ్దానాలలో నిజాయితీ లోపిస్తుంది.

ప్రజలను పాలనకు సన్నిహితం చేసేది భాషమాత్రమే. బౌద్ధం ప్రజలమధ్య ఆదరణ పొందటానికి భాషాబంధమే ముఖ్యమయింది. ఇతరుల కాళ్ళతో మనం నడవలేము. ఎక్కడో చతికిల పడతాము. రాజుకు ప్రజలతో సంబంధాన్ని అమరావతిలో వివరంగా బోధించిన ఆచార్య నాగార్జునుని మాటలు కొన్ని జ్ఞాపకం చేసుకుందాం.

***"రాజ్యమందు బడులు ఉన్నచోట్ల ఒజ్జలకు భుక్తికై భూములను దానమిమ్ము. దేశమంతటా జ్ఞానము విస్తరించు మార్గమిది"*** (239) జ్ఞానము, ఆరోగ్యము డబ్బుతో ముడిపడి ఉండటం రాజ్యానికి క్షేమంకాదు.

***"రోగులను, రక్షణ కరవయిన వార్ని, బాధోపహతులను, దీనుల, బీదల నాదరింపుము. అధిక శ్రద్ధతోడ కారుణ్యము తోడ పోషింపుము వారి"*** (243). వైద్యం ప్రయివేటు పరమయిన చోట, వృద్ధాశ్రమాలు కూడ వ్యాపారమయిన కాలంలో ఈ మాటలకు విలువ ఉంటుందా?

***"ఆయా రుతువులకనువగు అన్నపానములు, పంటలు, ఫలములు, ధాన్యము యాచకులకు, భిక్షువులకు ఇచ్చుదాక వానియందు భాగము నీవు గైకొనరాదు"***(244). ప్రజలకు అన్ని కనీసావసరాలు తీరేవరకు పాలకులు, అధికారులు వాటిని వాడరాదు. అనుభవించరాదు అన్న నియమం పాటిస్తే అది ఒక్కటి చాలు మన పాలనకు అంతర్జాతీయ గౌరవం తేవటానికి. అందరికి మంచినీళ్ళు దొరికేదాక మంత్రిగారు మంచినీళ్ళు త్రాగరాదు, అందరు త్రాగేనీరే మంత్రులు త్రాగాలి- ఏ మంత్రి అయినా ఇట్లాంటి వ్యక్తిగత నియమం తీసుకుంటే ప్రజలు బ్రహ్మరథం పట్టరా!

***"దీనులు, హీనులు, వికలాంగులు, పతితులు, అంధులు, వ్యాధి పీడితులు, అనాథలకు దానవసతులు నిల్పుము రాజశేఖరా!"***(329) సమర్థులు, సంపన్నులు, బలవంతులు- వీరే ప్రభుత్వ ప్రథమశ్రేణిలో ఉంటున్న నేటి పద్ధతిని మార్చుకొమ్మని ఆచార్యుని సూచన.

అడిగితే ఇవ్వటం సాధారణ ధర్మం. కాని ఆచార్యుని మాట వినండి ***"అర్థించకున్ననేమి ధార్మికులు, పరరాజ్యభాగమం దున్ననేమి? సత్పురుషుల ననుగ్రహించవలయు భేదమేమిలేక"*** (321). యోగ్యులు, సత్పురుషులు ఏదేశంలో ఉన్నా వెతికి వెతికి గౌరవించి నీదేశంలో నిలుపుకుంటే -వారివల్ల నీ దేశప్రజలలో ధార్మిక ప్రవృత్తులలో ఐచ్ఛికంగానే మార్పువస్తుంది-పాలకుడు ఎట్లాంటివారిని దగ్గరకు తీస్తుంటే-ప్రజలుకూడ వారినే చూచి అనుసరిస్తారు. ఇందులోని నిజాన్ని నిత్యం చూస్తూనే ఉన్నాం.

రాజనీతి మంత్రాంగంలో జ్ఞానవృద్ధులను, న్యాయ కోవిదులను, పాప భీరువులను రాజు సన్నిహితం చేసుకోవాలి. కఠిన శిక్షలు క్రౌర్యాన్ని పెంచుతాయి. కారుణ్యం చూపితే పరివర్తనకు దారితీస్తుంది. ***"తీవ్ర పాపము చేసినా గాని, సర్వ దేహధరులపై కారుణ్యభావ***

***ముంచవలయు, మైత్రితో హితమునే సదా తలపవలయు. ఉదార హృదయుల అపార కృపకు పతనమయిన వారె మిక్కిలి పాత్రులు" "ఎంతకాలము ఖైదీలను విడుదల చేయకున్న అంతకాలము సుఖముగా చూడవలయు" "అయోగ్యుడయినట్టి పుత్రుని యోగ్యునిగా జేయ తండ్రి దండించునట్లు కారుణ్య బుద్ధితోడ శిక్షింపవలయు"***

అధికార యత్నంతో దుఃఖపెట్టి ప్రభుత్వ కోశం నింపరాదు. పంటలు పోతే భత్యము నిచ్చి ఆదుకోవాలి. సుంకాలు తొలగించాలి. ***" నీ సంపద నాశించు అవస్థ పేదలకు తొలగింపుము. గుమ్మముల కడ సుంకరలు నిలచు బాధ తొలగింపుము."*** ఇట్లా ఎన్ని ఉత్తమ శ్రేయోరాజ్య ధర్మాలను బోధించాడో! ఇవన్నీ అమరావతిలోని శాతవాహనునికి, అమరావతిలోనే ఉన్న ఆచార్యుడు బోధించాడు.

ఎందుకు ఇంత చెప్పటం అంటే–ఇది ఈస్టానిక్ వారసత్వం– రాజ్యధర్మ వారసత్వం. దీన్ని పాటించి అమరావతి రాజనీతి నైపుణ్యాన్ని అంతర్జాతీయం చేస్తే అపుడుకూడ అమరావతి అంతర్జాతీయ నగరమే అవుతుంది.

ఇది సాధ్యమా అని మనకు వచ్చే శంక ఆచార్యునికి కూడా వచ్చింది. గౌతమీపుత్రయజ్ఞశ్రీకి మాత్రమే కాదు – సర్వ పరిపాలకులకు ఆచార్యుడు చెప్పిన ముఖ్యమయిన మాటను గట్టిగా జ్ఞాపకం ఉంచుకుంటే ఆంధ్రపాలకులకు అంతర్జాతీయకీర్తి ఆట్టే దూరంలో లేదు.

***"ధర్మము కొరకే నీ రాజ్యము! కీర్తికొరకు కాదు. కామ్యములకు కాదు. అట్లగుటచే కలుగు పూర్ణ ఫలము అన్యవిధములయిలచో అన్నీ అనర్థములే"***(327). "లోకమంతా ధర్మరహితమై, ధర్మపాలన దుష్కరమైతే రాజ్యపాలన వీడి ప్రవజ్యగొనుము. (పరివ్రాజకత్వం) కలుగును. యశము, ధర్మము, అర్థము"(400). పాలకులకు – ఈ వాక్యాలు విని ఆచరించగల ధైర్యం ఉండాలి. అంతే.

ఇవన్నీ నిన్ను చెప్పమని ఎవడు అడిగాడు అనవచ్చు రాజు. అందుకని ***"నీమీద మిక్కిలి స్నేహము వలన జగతిపై నాకున్న అనుకంప వలన అప్రియమయినను హితవాక్యములు కొన్ని చెప్పెద సంకోచము లేక"*** (302)అన్నాడు.

అట్లాగే అమరావతి సంస్కృతి మీద ప్రేమచేత, తెలుగుజాతి పొందదగు అంతర్జాతీయ ధర్మకీర్తిపై అపేక్ష చేత ఇవన్నీ ఇక్కడ జ్ఞాపకం చేస్తున్నాను. –ఆచార్యుని "రత్నావళి"–"అశోకుని శాసనాలు"–(పుస్తకం తెలుగులోకూడ వచ్చింది). పాలకులు, ప్రజాప్రతినిధులు అందరు– సర్పంచి దగ్గరనుండి ప్రధానమంత్రి వరకు తప్పక చదివి మననం చేయదగిన గ్రంథాలు. ఆచరించలేకపోయినా, కనీసం నైతిక శ్రేయోపాలనపై శ్రద్ధను కలిగిస్తాయి.


ఇంతకూ ఈ వాక్యాలు అంతదూరం వెడతాయా? తక్షణ ప్రయోజనాల రణగొణ ధ్వనిలో వినబడతాయా? నా కంఠస్వరం చిన్నది. "అమ్మనుడి" మైకునుండి వినబడే ధ్వనులు తగిన చోటికి చేరతాయా?

---

UNESCO

'**ఒక** భాషను మాట్లాడే ప్రజలు తమపైన ఎక్కువ దాష్టీకం చెలాయించగల, లేదా ఆర్థికంగా బలిసిన సంస్కృతితో సంబంధం కలిగినపుడు కూడా ఆ భాష తన ఉనికిని కోల్పోవచ్చు. ఆ సమయంలో ఆ జాతి పెద్దలు లేదా వయోజనులు తమ పిల్లల ఉపాధికోసం జరిపే వెంపర్లాటలో పెత్తనం చెలాయించే సంస్కృతికి చెందిన భాషను (అన్యభాషను) నేర్చుకొమ్మని తమ ప్రజలను ప్రోత్సహిస్తారు. ఇక స్థానిక ప్రభుత్వాలు స్కూళ్ళలోనూ, ప్రచారసాధనాల్లోనూ స్థానిక మాతృభాషలను ఒక క్రమపద్ధతిలో నిరుత్సాహ పరచడంతో మాతృభాషల ఉనికి మరింత అధ్వాన మవుతుంది.'

– యునెస్కో



ప్రత్యేక వ్యాసం

- సన్నిధానం నరసింహశర్మ
9292055531

# సంఘసంస్కరణరంగంలో స్ఫూర్తిమూర్తిత్రయం

*మతవిశ్వాసాలవల్ల కావచ్చు, ఆచారవ్యవహారాల వారసత్వాల వల్ల కావచ్చు - మానవకల్యాణ విఘాతాలైన వాటిని కూడా వీడలేని తత్త్వం జనంలో వుంటూ వుంటుంది. ఆ తత్త్వాలను మార్చడానికి సంఘసంస్కర్తలు, వారిని అనుసరించేవారూ పడిన శ్రమ అంతా ఇంతా కాదు, కాలం వెనుక సాగడం సులభం, కాలానికి ఎదురీది ప్రజల్ని ఆలోచింపజేసి ఆచరింపజేయడానికి ఎంతమందో పాటుపడ్డారు. ఎందరో మహానుభావులు. అందరికీ వందనసమర్పణ మాత్రమే చేస్తే సరిపోదు. వారి కార్యాచరణల విస్మరణలు లేకుండా స్మరణలు జరిగి వారి భావపరంపరలు నిత్యప్రవాహాల్లా చేసే కృషి అవసరం.*

*తెలుగునాట సంఘసంస్కరణ రంగంలో ఒక స్ఫూర్తి మూర్తిత్రయాన్ని శాశ్వతంగా గుర్తుంచుకోవాలి. ఎర్రన, తిక్కన, నన్నయ్య అంటున్నామా? నన్నయతిక్కనెర్రనలంటాం. ఎందుకు? చరిత్రలో కాలప్రాధాన్యత వుంటుంది కాబట్టి. అలా స్మరణీయులు- స్వామినీని ముద్దు నరసింహంనాయుడు, కందుకూరి వీరేశలింగం, రఘుపతి వేంకటరత్నం నాయుడు. భావసారూప్యాలు భాషాజీవన సంస్కరణాభిమానాలు కార్యక్షేత్రాలు ఎక్కడో- అక్కడి వారికి తెలిసీ తెలియక అనుసంధానింపబడడం వల్ల ఈత్రయం సేవలు బేరీజువేసుకోవాలి.*

## స్వామినీని ముద్దునరసింహం

1792-1856 / 1810-1856

అని రెండు కాల నిర్ణయా లున్నాయి. 'వైతాళికులు' సంకలనకర్త ముద్దుకృష్ణకు ముత్తాత. వీరేశలింగం కంటే పూర్వవ్యక్తి. అపూర్వ శక్తిమంతమైన 'హితసూచని' గ్రంథకర్త. గిడుగురామ మూర్తిచే శ్లాఘింపబడిన వాడుకభాషోద్యమ గ్రంథం హితసూచని. ప్రముఖ హేతువాది, పరిశోధక రచ యిత శ్రీ రావిపూడి వేంకటాద్రి మాటలలో "యావత్ భారత సమాజసమస్యల్నీ చదివిన తెలుగువాడు స్వామినీన ముద్దునరసింహం: 1862లో తొలి అచ్చు చూసిన హితసూచని 1986లో రాజమహేంద్రవర ఆంధ్రకేసరి యువజన సమితి పుణ్యమా అని దానిని భద్రపరచిన శ్రీ గౌతమీ ప్రాంతీయ గ్రంథాలయం సహకారంతో ఆరుద్ర ప్రవేశిక పీఠికతో తిరిగి అచ్చుకు నోచుకుంది. తరువాత రావిపూడి వెంకటాద్రి 'స్వామినేని హిత సూచని : పర్యాలోకనం అనేక నహేతుక చర్చ నీయాంశాలతో వచ్చిన పుస్తకం. స్వామినీనికి జరి గిన అన్యాయం, ఆ గ్రంథ అపురూప విశేషాలు ప్రజ లకు తెలపడంలో సత్య సంధతను చాటుకుంది. ముద్దునరసింహం గారు వెలమ సామాజిక వర్గానికి చెందినవారు. బెంగాలు ప్రభావం పడకుండానే స్వంతంగా స్త్రీ పునర్వి వాహాలు, స్త్రీల సమస్యలు



వంటివాని గురించి ఆలోచించారు. దెయ్యాలను విశ్వసించడం, భ్రమలు కలిగించే మహత్మ్యాలను విశ్వసించడం వంటివానితో అసలు సిసలు వాడుకభాసతో ప్రమేయాలు పేరిట రచనలు సాగించారు. ప్రమేయం అంటే తెలుగులో ప్రథమ వ్యాసస్వరూపమన్నమాట. వాడుకభాషలో హితసూచనిలో కొన్ని కథలు ఉండడం గమనార్హం. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు భద్రపరచుకున్న గ్రంథాల్లో హితసూచని 1862 ది. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిపై పరిశోధన చేసిన కనకప్రవాసి ఇంట చేరగా ఈ వ్యాసరచయిత గౌతమీ హితసూచని ప్రతిలో లేని 8 పుటలను ఆ ప్రతి నుండి సేకరించి సంపూర్ణ పుస్తక ముద్రణకు ఉడుత అయ్యాడు. సరే, దానికేం...

వీరేశలింగంగారు తనకన్నా పూర్వుడు, మీదుమిక్కిలి రాజ మహేంద్ర పురవాసి అయిన ముద్దునరసింహం రాసిన హితసూచనిని చూడనే లేదా? చూసే నిర్లక్ష్యం చేశారా? అనే అంశాలు కేవల వివాదాంశాలేకావు, సాహిత్యచారిత్రక అంశాలు. మనస్తత్వాలకు సంబంధించినవి. ఈ అంశాలపై మతం శ్రీనివాసరావు, ఎ.రజా హుస్సేన్, కందుకూరిపై వీరేశలింగం పంతులు -సమగ్ర పరిశీలన, వీరేశలింగం లేఖలు, డైరీలు వంటి గ్రంథాలు రాసిన అక్కిరాజు రమాపతిరావు వంటివారు ఆంధ్రభూమి వంటి పత్రికలలో వారివారి వాదనాదాల్ని మ్రోగించారు. శక్తిమంత చర్చలు సాగించారు. 155 ఏళ్ళ క్రితం వాడుకభాష జెండాని సంఘసంస్కరణ విభిన్నకోణాల ఎజెండానీ ముద్రితగ్రంథం ద్వారా ప్రజాపరం చేసిన ముద్దునరసింహ గ్రంథ ప్రచారం విషయంలో మనది మొద్దునిద్దరే అనిపిస్తోంది. వీరేశలింగం ఇంచుమించు చివరిదాకా గ్రాంథికరచనా దురంధరులే అనేది చారిత్రక సత్యం. దయ్యాల గురించి స్వామినీని రాసిన హితసూచని వాక్యాలు వీరేశలింగం గారి దయ్యాల వాక్యరచనకు తుల్యాంశాలు కనబడుతున్నాయి. వీరారాధన కొందరిదీ, వేరే ఆరాధన కొందరిదీ. సత్యదృష్టి ప్రామాణికతని సంతరిస్తుంది. బంగారాన్ని తయారుచేయవచ్చని ధనాన్ని ఖర్చుపెట్టుకునేవారిని హితసూచని విమర్శించింది. నాటువైద్యాన్ని విమర్శించింది. సాహిత్యరచనల్లో లేదా

గ్రంథరచనల్లో అరసున్నాలు వద్దు బాబూ బండిరాలు వద్దు బాబూ అని ఏనాడో స్వామినీని సహేతుకంగా ప్రబోధించాడు. అరసున్నా అత్తగారూ బండిరా బావగారూ ఇంకానా మీరు ఇంకానా మీరు అని దాశరధి ఆధునికకాలంలో కవితలో ప్రబోధించారు. కృష్ణాపత్రిక పాతసంపుటాలను గంధంచెక్కల బీరువాలో భద్రపరచాలి అన్నాడు శ్రీశ్రీ. సంఘసంస్కరణ ప్రియులకు హితసూచని గ్రంథాన్ని గంధం చెక్కల బీరువాలో భద్రపరచాలని అనిపించినా అచ్చెరువక్కరలేదు.



## కందుకూరి వీరేశలింగంపంతులు

(1848-1919) : అటు సంఘసంస్కరణరంగంలో, ఇటు సాహిత్యరంగంలో విస్తృత కార్యాచరణ భూమికలున్న యుగపురుషుడు. బాల్య వివాహాలవ్యతిరేకి, వితంతు వివాహాల సమరశీలి, స్త్రీ విద్యాప్రబోధకుడు తన ఉద్యమానికి వివేకవర్ధని వంటి విశిష్ట పత్రికాయుధాలతో యుద్ధం చేసిన వీరుడు. పట్టుదల, కార్యాచరణల్లో మొండితనం కలవాడు. రాజమహేంద్రిలో ప్రథమ పురమందిర నిర్మాత, హితకారిణీ సమాజం వంటి విశిష్ట సంస్థల ద్వారా కార్యకలాపాల ఆచరణశీలి. ఆంధ్రకవుల చరిత్ర, అనేక ప్రహసనాలు, నాటకానురాగాలు, స్వీయచరిత్ర వంటి ఎన్నో గ్రంథాల రచయిత. దక్షిణభారతదేశం అనగానే గుర్తుకొచ్చే సంఘసంస్కర్త. బ్రహ్మసమాజికుడు. అవినీతి, లంచగొండితనం, అబద్ధసాక్ష్యాలు వంటివాటికి వ్యతిరేకంగా సంపాదకీయాలు రాసిన ధిషణాశీలి. ఈయన వీధుల్లో వెడుతూవుంటే ఛాందసులు కొందరా నాడు 'ఓరోరీ జంగమా! వీరేశలింగమా!' అని వేళాకోళం చేస్తూ ఈయనపై దుమ్మెత్తి పోసేవారట. కందుకూరి వీరేశలింగంపై కెనడి యన్ జాన్‌లియోనార్డు వ్రాసిన ఆంగ్లగ్రంథం అనేక సూక్ష్మాంశాలను వెల్లడిచేసిన గ్రంథం. రాయసం వెంకటశివుడు రాసిన 'వీరేశలింగం- వెలుగునీడలు' పంతులుగారిపై కొన్ని విమర్శలను కలిగిన గ్రంథం. ఎన్నిటిలోనో ఆద్యుడు, సంస్కారప్రియులకు ఆరాధ్యుడు ఆధునిక ఆంధ్రదేశం అఖండ గోదావరి అయితే వీరేశలింగం దానికి నాసికాత్రయంబకం వంటివారు అని ప్రశంసించబడ్డ వ్యక్తి. ఆంధ్ర దేశంలో తొలినాళ్ళలో వీరేశలింగం పేరుజి కొన్ని గ్రంథాలయాలు స్థాపించబడడం వీరి ప్రభావానికి ఒక ఉదాహరణ. వీరిభార్య శ్రీమతి రాజ్యలక్ష్మి పాటలు రాసిన కవయిత్రి. రాజమహేంద్రవరంలో పుట్టిన కందుకూరి చెన్నపురిలో కీర్తిశేషులయినప్పుడు దక్షిణభారతదేశం విలపించింది. పరిశోధక పత్రికా రచనకువివేకవర్ధని వంటి వీరేశ లింగ పత్రికలు చేసిన దోహదం అంతాఇంతా కాదు. వక్తగా, రాజశేఖర నవలా రచయితగా, శాస్త్రీయ జ్ఞాన పుస్తకాల వెలువరింత కారుడుగా 'సాంఘిక సారస్వత నైతికోద్యమముల కేకీభావ' మునకై పోరాడిన యోధుడు కందుకూరి. మల్లంపల్లి శరభయ్య -'వీరేశలింగ సంస్మృతి' వ్యాసంలో "బ్రతికిఉన్న దినములలో ఎంతటి భయం కరుడో! కన్నులు చింతనిప్పులు! పట్టినది కలమే యైనను ఆ కలము మహాఖడ్గమువలె భయంకరము! అది వీరేశ్వరావతారము! ఆ చుట్టతలపాగ ఒక్కటి చాలదూ సింహస్వప్నమువలె గుండెదడ పుట్టిం చుటకు" అని వ్రాస్తూ దేహానికీ, గేహానికీ అనుదిన సంస్కారం లేకపోతే రోతపుడుతుందని, స్నానంవంటివాటివల్ల దేహాన్ని శుభ్రపరచుకోవడం వల్ల, గృహానికి సంస్కారం కలిగినట్టే - ఎప్పటినుంచో వచ్చిన మూఢాచారాల దుమ్మువల్ల సంఘం సంస్కారరహితమై లక్ష్మీకళ లేకుండా వుంటుందని అంటూ 'ప్రతియుగారంభమునందు మడుగువేలుపులై సంస్కర్తలుదయించి, ధూళి తుడిచి, బూజుదులిపి, నీరుచిలికి, ముగ్గువెట్టి సంఘజీవిత భవనప్రాంగణమునకు నూతన శోభనలరించి లక్ష్మికి నెలవు కల్పింతురు' అలా కల్పించినవారు వీరేశలింగం అనే భావంతో రాశారు. పురమందిరం ట్రస్టుబోర్డులో సెక్యులర్‌దృష్టి కనబరచారు కందుకూరి. జయంతి, వర్ధంతుల వల్ల, సంబంధిత సంస్థల కార్యకలాపాలవల్ల, ముద్రిత బహుగ్రంథ ఆకరాలవల్ల, పరిశోధనలవల్ల కందుకూరి సకారణ సుప్రసిద్ధుడైనాడు. ఈ స్ఫూర్తిమూర్తిత్రయంలో మనం వివేచించి పరిశోధించి వెలికి చూపుకోవలసింది ముద్దు నరసింహ నాయుడు గురించీ, రఘుపతి వేంకట రత్నంనాయుడు గురించీ అనిపిస్తుంది. ముద్దువారు ఆదివెలమ సామాజిక వర్గానికి చెందినవారు. కాగా రఘుపతి వేంకట రత్నం నాయుడుగారు కాపుసామాజిక వర్గానికి చెందినవారు.

## రఘుపతి వెంకటరత్నం నాయుడు

**(1862-1939)**

ఆధునిక ఆంధ్ర మహా పురుషులలో అగ్రశ్రేణికి చెందిన నామ స్ఫురణలో పంతులుగారు - నాయుడు గారనేవి వచ్చితీరేవి. మచిలీపట్టణంలో 1862 అక్టోబరు 1వ తేదీన పుట్టారు. చిత్రమేమంటే స్వామినీని వారి హితసూచని అచ్చయి వచ్చిన 1862లో రఘుపతి జన్మించడం ఏదో ఒక అవ్యక్త అనుబంధబంధంగా అనిపిస్తోంది. వీరేశలింగంగారు 1919 మే నెలలో



కీర్తిశేషులయితే నాయుడుగారు వీరేశలింగ మరణానంతరం 20 సంవత్సరాల తర్వాత 1939 సంవత్సరంలో మే 26న కీర్తిశేషులయ్యారు. సంవత్సరం వేరయినా మేనెలలోనే 26న నాయుడుగారి వర్ధంతి, 27న పంతులుగారి వర్ధంతి రావడం ఇద్దరివీ ఉన్నమార్గాలూ చనిన మార్గాలూ ఒకటేననడానికి వీలుగా వుంది.

రాజమహేంద్రవరంలో హితకారిణీ సమాజం, నా చిన్నప్పుడు రఘుపతి – వీరేశలింగం గార్ల వర్ధంతులు ఒకే కరపత్రంపై రెండుసభల కార్యక్రమాలు ప్రకటించి చేసేవారు. మామిడిపళ్ళు, గారెలతో ఖరీదైన భోజనాలు పెట్టేవారు. ఒక మనిషికి విస్తర్లో రెండు మామిడిపళ్ళ చొప్పున వడ్డించేవారు. ఇప్పుడనిపిస్తోంది ఒక మామిడిపండు నాయుడిగారి స్మరణఫలం, రెండవ మామిడిపండు వీరేశలింగం స్మరణఫలం అన్నట్లుగా. తరువాత హితకారిణీ సమాజం ఇతరులకు భోజనాలు పెట్టడం మానేశారు. భోజనాల విషయమెందుకుగాని, జనాలకు ఎంతో సేవచేసిన నాయుడు జీవితం చాలా ఆదర్శమైనది, సంయమనం, హుందాతనం, గంభీరత్వం, చాతుర్యం, సాత్త్విక ప్రవృత్తి, గుప్తదానగుణం, పరోపకారపారీణత, గంభీర అర్థవిలసిత ఆంగ్లప్రసంగాలతో శ్రోతలను ఆకట్టుకోవడం, కీర్తికై వెంపరలాటలు లేకపోవడం – ఇటువంటి సుగంధాల ప్రోవు ఆయన. ఆమధ్యదాకా వేంకటరత్న జీవితం పాఠ్యగ్రంథాలలో తగినంతగా వుండేదిమరి. తండ్రి సుబేదార్ అప్పయ్యానాయుడు, తల్లి శేషమ్మ విష్ణుభక్తురాలు. వీరి తమ్ముడు ఛాయాగ్రహణ కళాకారుడు వెంకయ్యానాయుడు. బెంగాల్ ప్రముఖులతో రఘుపతికి పరిచయాలుండేవి. హైదరాబాద్‌లో మెట్రిక్ ప్యాసయ్యాడు. రామమోహనరాయ్ స్ఫూర్తిపొంది ప్రభావితుడయ్యాడు. 1885లో చెన్నపురి క్రైస్తవ కళాశాలలో పట్టభద్రులై 1891లో ఎం.ఏ, 1897లో ఎల్.టి. డిగ్రీ పొందారు. భార్య శేషమాంబ. వీరికి ఓ మగపిల్లాడు పుట్టి రెండవ నెలలోనే చనిపోతే ఇలా జరగడానికి నాయుడుగారి బ్రహ్మసమాజ మతావలంబనమే కారణం అని రఘుపతి తండ్రి విశ్వసించారు. బ్రహ్మసమాజానికి వెళ్ళవద్దన్నారు. తల్లి గూడా అబ్బాయీ కొన్నివారాలపాటైనా బ్రహ్మసమాజానికి వెళ్ళొద్దన్నారు. వెళ్ళడం తప్పదన్నారు. రఘుపతి సతి భర్తతో లీగీదిరి మానేసినా నేను బ్రహ్మసమాజానికి వెళ్ళడం మాననంది. నా హృదయభావమూ అదేనన్నారు. నమ్మినభావానికి నాయుడుగారి కట్టుబాటుతనానికి ఇది ఒక మెట్టు. భార్యాప్రేమికుడైన ఆయనకి 27వ ఏటనే పత్నీవియోగ మైనా ఏకపత్నీవ్రత దీక్షా కంకణులైనారు. వీరేశలింగం పత్రికా సంపాదకులైతే, వీరు చెన్నైలో ఆనాడున్న పీపుల్స్‌ఫ్రంట్, బ్రహ్మప్రకాశిక, ది ఫెలోవర్కర్ అనే ఆంగ్లపత్రికల సంపాదకవర్గాలలో ఉద్యోగించారు.

వీరేశలింగం తన స్వీయచరిత్రను తన శ్రీమతి రాజ్యలక్ష్మి కంకితం చేశారు. రఘుపతి తాను మరణించినప్పుడు తన శవంపై కూడా గుండెలపై తన శ్రీమతి పటం వుండేలా చెప్పుకున్నాడు.

ఏలూరు, రాజమండ్రి, బందరు, సికింద్రాబాదు వంటివి ఆయన ఉద్యోగస్థానాలు. ఆయన ఇంగ్లీషులో పాఠాలు చెప్పడాన్నిచూసి ఆంగ్లేయులే ఆశ్చర్యం వ్యక్తం చేసేవారు. విద్యార్థులతో మమేకం కావడం వల్ల చుట్టూవారు చేరుతుండడం వల్ల పిల్లలకోడి అని ఆయన్ని అనేవారు. మహమ్మదీయ వనితలు ఆయన్ను జనకతుల్యునిగా భావించేవారు. 1905 నుండి 1919 వరకూ కాకినాడ పిఠాపుర కళాశాలలో ప్రధానాచార్య పదవి ప్రశంసనీయంగా నిర్వహించారు. నా హృదయంలో క్రింద అర అంగుళం చీలిస్తే అక్కడ 'పిఠాపుర రాజుగారి కళాశాల' అని వ్రాసి వుంటుందనడం ఆయన అంకితభావకాంతిని తెలిపేది. చెన్నపురిలో విశ్వవిద్యాలయ ఉపకులపతిగా ఉన్నప్పుడు ద్రవిడభాషలకు ప్రాధాన్యమివ్వడంలో ఆయన భాషాభిమానాన్ని గ్రహించగలం. ఆయన బాధ్యతాయుత పదవులు ఏకరువుపెడితే ఓ పట్టికే అవుతుంది. పిఠాపురం రాజావారిచే కొన్ని సంస్థలు నెలకొల్పిన ఘనత ఆయనది. అనాథశరణాలయం అని ఉచ్చరించగానే ఆయన కళ్ళు నీళ్ళతో నిండేవంటే ఆయన మానవతాపరిమళం ఇంకేమని చెప్పగలం? ఎవరికి పెళ్ళిళ్ళు చేసి పుణ్యం కట్టుకున్నారో ఎవరికి పురుడుపుణ్యాల బాధ్యతలు నిర్వహించారో అది 'గుప్తకాల' చరిత్రాంశాలయ్యాయి. నాయుడుగారు చనిపోయినప్పుడు వివిధకులాల వివిధమతాలవారు వేలకొలది ఊరేగింపుగా శ్మశానవాటికకు వచ్చారంటే అది ఎంత సామాజికసేవా నిదర్శనమో భావించుకోవాలి. టీపార్టీ వద్దు బీదలకు అన్నదానాలు చేయండనేది ఆయన బోధ. ఆయనకు మిగిలిన ఆస్తి వేలాది రూపాయల మనియార్డరుల రశీదులు మాత్రమే. కృష్ణాపత్రిక సంపాదకులు నాయుడుగారిని 'మహాత్ముడన్నా' పట్టించుకున్న మహాత్ములు లేరు. పొన్నేరి స్టేషనులో నలుగురు అనాథ బాలికలు కనబడితే తీసుకొచ్చి పెంచి పెద్దల్ని చేసిన పెద్దమనిషి ఆయన. పరస్త్రీలను, పతిత, అనాథ స్త్రీలను తల్లుల్లా చూసుకోవడం ఆయనకే చెల్లింది. కాంగ్రెసుపార్టీ కన్నా యాభైఏళ్ళ ముందే హరిజన ఉద్ధరణ, మద్యపాన నిషేధ కార్యక్రమాలు చేపట్టిన క్రియాశీలి ఆయన. ప్రేమ, సాత్త్వికత, సేవ ఆయన గుణత్రయం. ఆయన ఉపన్యాసాలను మహాకవి కృష్ణశాస్త్రి అనువదించారు.

వీరేశలింగం హితకారిణీ సమాజానికి ట్రస్టు సభ్యులలో స్థానికేతర నివాస సభ్యులలో రఘుపతివారు ఒక సభ్యులు. సంఘ సంస్కరణరంగంలో ఎంతోమంది విద్యార్థులు ప్రవేశించడానికి చుక్కాని నాయుడుగారు.

''ఆంధ్రదేశంలో సంఘసంస్కరణ ఉద్యమమన్నా, బ్రహ్మసమాజోద్యమమన్నా రఘుపతి వెంకటరత్నంనాయుడు, వీరేశ లింగంపంతులు వీరిరువురిపేర్లు చెప్పకపోతే ఆ చరిత్ర విలువ లేనిదవుతుంది. అందులో వీరేశలింగము 'అంధకారములో ప్రళయభేరి' 'ఝంఝామారుతము' కాగా నాయుడుగారు 'బృందావ నములో వేణువు', 'మలయవీచిక' అని పెద్దలు చేసిన అభివర్ణనల్ని అర్థం చేసుకోవడానికి చారిత్రక భావుకత మనకు అవసరం.

నాయుడుగారి ప్రసన్న గంభీర ఉపన్యాససూక్తులను కృష్ణశాస్త్రి 'ఋగ్వీథి' కవిత్వంగా అందించడం జనాదృష్టం. ప్రార్థనను గూర్చి "ప్రార్థనము లౌకికారణ్య పదములందు / పథములం జేర్చు దీపము; బ్రతుకులోని / విడని వ్యూహమ్ము విప్పితప్పించు మంత్ర / మనుచు రతనాలపీట బ్రహ్మర్షిమాట. ఈ పద్యరత్నాలు వేంకటరత్న ప్రభల్ని చాటుతున్నాయి.

పిఠాపురం రాజావారికి వాడుకభాషంటే ఇష్టం లేదు. అది తెలిసినా నాయుడుగారు రాజమండ్రిలో వాడుకభాషావాది గిడుగు సన్మానసభకు వెళ్ళి తన వ్యక్తిత్వాన్ని చాటుకుంటూ గిడుగు పట్ల

గౌరవాన్ని చూపడం అందర్నీ ఆశ్చర్యపరచింది.

మైసూరులో నాయుడుగారి స్నేహితుని భార్య వుండేది. ఆమె పెనిమిటి చనిపోయాక ఆమెకు మనియార్డర్లు చేసిస్తూ సహాయమందిస్తూ, ఆమె భర్త చనిపోయేముందు కొంత ధనాన్ని నాయుడుగారి వద్ద దాచారని చెప్పడాన్ని ఆయన సమర్థించే సంస్కారమాయనది.

సంఘసంస్కరణ అనేది వితంతు వివాహాలు వంటివాటిలోనే వుండదు. ఎన్నిటిలోనో వుంటుంది. వాటిలో మన సంస్కారం చూపాలి అనేది ఆయన స్వభావం. భోగంమేళాలను ఆయన వ్యతిరేకించేవారు. 1895లో పర్లాకిమిడిలో ఆయనను గిడుగువారే సభవారికి పరిచయం చేశారు. జస్టిస్‌పార్టీవారు బ్రాహ్మణేతర సంఘాన్ని స్థాపించి అందులోకి ఆయనను చేర్చారు. ఆయన నైతిక ప్రవర్తనలో నిజాయితీ, సంఘ సేవాసక్తి, స్త్రీజనోద్ధరణ భావాలు కాకినాడ వచ్చి చదువుకున్న చలాన్ని ప్రభావితం చేశాయి. కృష్ణశాస్త్రి, ముట్నూరి కృష్ణారావు, చలం, ముద్దుకృష్ణ, ప్రఖ్యాతి చెందిన శిష్యుల్లో కొందరు.

1853లో రాజమహేంద్రవరంలో సంఘపారిశుద్ధ్యంపై చేసిన ప్రసంగం ద్వారా మహోపన్యాసవర్షాన్ని కురిపించారు. మెట్కాఫ్ దొర అధ్యక్షతన చేసిన ప్రసంగంలో "వేశ్యాంగనలను కులటలుగ జేసి సంఘాన్ని అపవిత్రం చేయడం మంచిదికాదు. వారికి వివాహాలు జరిపించాలి. పెళ్ళిళ్ళు, దేవతోత్సవాల్లో వారి నృత్యగానాలు అనుచితం అంటూ చేసిన ఉపన్యాసానికి చిలకమర్తి ఉత్తేజితులయ్యారు. "ఆ భావ గాంభీర్యమేమని కొనియాడుదుము! ఆ శబ్ద సౌష్టవమేమని వర్ణింతును! ఆ వాగ్వేగము ఏమని సన్నుతింతును!" అని నిజాయితీకి మారుపేరైన చిలకమర్తి తమ స్వీయచరిత్రలో ప్రశంసించారు.

1904లో కాకినాడలో పిఠాపురం రాజావారి కళాశాలలో ప్రధానాచార్యుల పదవి ఖాళీ అయినప్పుడు నాయుడుగారు దరఖాస్తు చేస్తే ఇవ్వడానికి పాలకవర్గం వ్యతిరేకంగా ఉన్నప్పుడు వీరేశలింగం ప్రత్యేకంగా రాజమండ్రి నుంచి వచ్చి నాయుడుగారికై కృషిచేశారు. న్యాపతి సుబ్బారావుగారు కూడా ఇందుకు ప్రయత్నించారు.

ఈ విధంగా సర్వజనప్రియులుగా పేరుగాంచారు. 'సర్' వంటి బిరుదులు వంటవి ఆయనకు వచ్చినప్పటికీ 'బ్రహ్మర్షి' అనే బిరుదు సర్వవిధాలా తగివుంది. ఆయన సంఘసేవలో బహు సామాజికవర్గాల వారు లబ్ధిపొందడం గమనార్హం.

సంఘసంస్కరణ, వాడుకభాష వంటి విషయాలలో సేవలు చేసి ప్రసిద్ధిపొందవలసినంత ప్రసిద్ధిపొందని హితసూచనికర్త స్వామినీన ముద్దు నరసింహనాయుడుగారూ...

సుప్రసిద్ధ చరిత్రమూర్తి, సంఘసంస్కర్త, కవి, రచయిత, పత్రికా సంపాదకుడుగా విశేషఖ్యాతి గడించినవారు కందుకూరి వారూ...

గుప్తదాత అయి, బ్రహ్మసమాజసేవా దురంధరులై నిష్కళంక సంఘసంస్కరణాశీలి అయిన మహావక్త, మానవతావాది రఘుపతి వేంకటరత్నంనాయుడు సుప్రసిద్ధుడే అయినా ఇంకా పరిశోధించి త్రవ్వకొని చరిత్రగనుల నుండి ఘనుల దర్శనం చేసుకునే మార్గంలో ఇంకా ప్రదీప్తం చేసుకోవలసిన నాయుడుగారూ.

ఈ ముగ్గురూ తెలుగునాట సంఘసంస్కరణరంగంలో ఒక స్ఫూర్తి మూర్తిత్రయంగా భావించుకొందాం.

అ

కవిత

# స్మృతిగీతం


-మందరపు హైమవతి
94410 62732


ఇక
మిగిలావు నీవు
కేవలం ఒక స్మృతిగీతంలా
ఇప్పటి కాలానికి పనికిరాని చిత్రంలా
-- --
నీ రాతి తలపై
ప్రతిరోజు అబద్ధాల రెట్టల టోపీ పెట్టి
భుజాలు ఎగరేస్తాయి
రాజకీయ విహంగాలు
-- --
మద్యపాన నిషేధం
సత్యపాలన సిద్ధాంతాలు
వ్యాపార సంస్కృతిలో
చెల్లని నోట్లు.
ప్రజలకోసమే ప్రజలచేత సిద్ధాంతాలు
ఎండి రాలిన ఆకులు.
అగ్రరాజ్య సంస్కృతే
అందర్నీ శాసిస్తున్నపుడు
గుడీ బడీ లేకున్నా
సందు సందులో వెలసిన బార్లు
నేలమీద కొలువు తీరిన
ఇంద్రధనుసు ముక్కల్లా
గాజు తలుపుల్లోనుంచి
ఆకర్షించే అందమైన సీసాలు
-- --
బొమ్మల కొలువులో నిన్నొక బొమ్మగా
నాలుగు వీధుల కూడలిలో విగ్రహంగా మలచి
నీతినీరు అడుగంటిన కుండల్లో
నీరు తాగలేని మేము
స్వార్థపు ఊబిలో ఒక్కొక్క అడుగూ కిందకి జారి
కరెన్సీ నోటుపై మాత్రం నిన్ను ముద్రించి
మా భక్తికి మేమే మురిసిపోతున్నాం.
మాచేతి చెమట మరకలు నీకు పూసి,
మా పిచ్చిరాతలు నీపై రాసి!
-- --

# మెలట్టూరు భాగవతమేళా

-డా॥మధురాంతకం నరేంద్ర
98662 43659

ఏప్రిల్‌నెల 8వ తేదీన చెన్నయిలో బ్రహ్మజ్ఞాన సభ శ్రీమతి శివగామి పేట్టాచ్చి ఆడిటోరియంలో జరిగిన 'మార్కండేయ చరిత్రం' అనే భాగవతమేళా నాటకం ఆవిష్కరణ సభకు ముఖ్యఅతిథిగా వెళదాం రమ్మని మిత్రులు నాగసూరి వేణుగోపాల్ గారు పిలిచారు. చాలారోజులుగా మేలట్టూరునాటక మేళాల గురించి వింటూన్నాను. వోసారైనా చూడాలని చాలారోజులుగా కోరికగా వుంది. పుస్తకావిష్కరణ సభ తర్వాత 'మార్కండేయ చరిత్ర' నాటక ప్రదర్శన గూడా వుంది. కోరిన కోనలో వర్షం కురిసినట్టుగా వచ్చిన ఆహ్వానం. సంభ్రమానందాలతో చెన్నయికి బయలుదేరాం.

నాగసూరి వేణుగోపాల్ దంపతులతోబాటూ ఆనాటి సభకు ముఖ్య అతిథి గూడా అయిన మిత్రుడు ఆర్.యం.వుమామహేశ్వరరావూ, పాత్రికేయ మిత్రుడు రాఘవశర్మగారూ కలిసి చెన్నయికి వెళ్ళాం. నెలనెలా కలుస్తున్న మదరాసు తెలుగురచయితల సంఘం వాళ్ళు మాకోసమని ఆ శనివారం రోజున, ఆదివారానికి మారుగా ఆంధ్రమహిళాసభలో కలిశారు.

త్యాగరాయ నగరూ, శ్రీబాగ్‌పాలెస్, కాశీనాథుని నాగేశ్వరరావు పార్కుల మీదుగా ఆంధ్ర మహిళాసభకు వెళ్తూంటే గత చరిత్రంతా గుర్తుకొచ్చి వొళ్ళు పులకిస్తూంది. ముళ్ళపూడి వెంకటరమణగారి శ్రీమతి శ్రీదేవిగారూ, తిరుమల రామచంద్రగారి అమ్మాయి ఆముక్తమాల్యదా, గత ముప్పయేళ్ళుగా తత్త్వజ్ఞాన సమాజంలో వుద్యోగిగా వుంటూనే విరివిగా కథలు రాస్తున్న శ్రీవిరించిగారూ ఆంధ్రమహిళాసభలో కనిపించినప్పుడు మళ్లీ వోసారి మదరాసు మన వూరేనన్న సత్యం స్ఫురించింది. సభానంతరం అక్కడికి అయిదారు యిండ్లకవతల బ్రహ్మజ్ఞానసభ ఆవరణలో, ముఖ్యరహదారికి కాస్త దూరంలో, ఆకులందున దాక్కున్న పూలగుత్తిలాగున్న శివగామి పేట్టాచ్చి సభా భవనానికి చేరుకున్నాం.

ముందుగా మాకు ఆహ్వానం చెప్పిన యువకుడ్ని వేణుగోపాల్‌గారు "యీ అబ్బాయి మహాలింగంగారి కొడుకు. టీసియెస్‌లో ఐటీ యింజనీరు. రాత్రికాడబోయే నాటకంలో యితనే మార్కండేయుడు'' అని పరిచయం చేశారు. ఆ వెంటనే మార్కండేయుడి తండ్రి మృకండ మహర్షి వేషంలోనే మహాలింగంగారు ఆత్మీయంగా ఆహ్వానించారు. మాలాగే ఆనాటిసభకు ముఖ్య అతిథిగా హైదరాబాదునుంచి ప్రముఖ జానపద పరిశోధకులు ఆచార్య జయధీర్ తిరుమలరావుగారు గూడా వచ్చారు. మల్లెపూవులాంటి తెల్లటి దుస్తుల్లో ప్రముఖ వస్త్రవ్యాపారి నల్లి కుప్పుసామి చెట్టిగారు వచ్చారు. అప్పుడే వెండితెరలోంచీ నేలపైకి దిగినట్టుగా ప్రముఖ సినీతార శారదగారు సభాసదనంలోకి వచ్చారు. సభలోకి ప్రేక్షకులు వొక్కరొక్కరుగా రాసాగారు. మేలట్టూరు మేళా నాటకాల గురించి అతిథులంతా ముచ్చటించుకోవడం మొదలుపెట్టారు.

తంజావూరు భాగవతమేళాకు దాదాపు అయిదు వందల సంవత్సరాల చరిత్ర వుంది. క్రీ.శ. 1550లో విజయనగర చక్రవర్తి అచ్యుతరాయలు చెన్నప్ప నాయకుడ్ని తంజావూరు పాలకుడిగా నియమించారు. నాయకరాజుల తర్వాత మహారాష్ట్ర రాజులు తంజావూరును పాలించారు. రఘునాథ నాయకుడు, విజయరాఘవ నాయకుడు, శాహజీల కాలంలో భాగవత మేళా నాటకాలు బాగా ఆదరణ పొందాయి. చెన్నప్పనాయకుడి కొడుకు అచ్యుతరాయలు అయిదువందలమంది తెలుగు బ్రాహ్మణ భాగవతులకు తంజావూరు సమీపంలోని మేలట్టూరు ప్రాంతంలో భూదానం చేసి, వసతిగృహాలు నిర్మించియిచ్చారు. మేళాల వూరు కాబట్టి ఆ వూరికి మేలట్టూరు అనీ, అచ్యుతరాయలు దానం చేసిన వూరు కాబట్టి 'అచ్యుతపురం', 'అచ్యుతాబ్ధీ' అనీ, ఆ వూరి దేవుడిపేరుతో 'ఉన్నతపురి' అని పేర్లు వచ్చాయి. ఆ ప్రాచీనకాలంలోనే అనేకమంది తెలుగు భాగవతులూ, రాజులూ, కవులూ చాలా యక్షగానాలను రాశారు.



నుదురుమాటి వెంకట దేవీప్రసాద్‌గారూ, విద్వాన్ ఎన్.శ్రీనివాసన్‌గార్లను సత్కరిస్తున్న 'ఊర్వశి' శారద

ఆంధ్రదేశం నుంచీ తంజావూరి కెళ్ళి స్థిరపడినవాడిగా భావిస్తున్న నారాయణ తీర్థులు సంస్కృతంలో 'కృష్ణలీలా తరంగిణి', తెలుగులో 'పారిజాతాపహరణం' అనే యక్షగానాలు రాశాడు. కూచిపూడి నాట్య కళకు మూలపురుషుడైన సిద్ధేంద్రయోగి నారాయణతీర్థుల శిష్యులేనట!

తంజావూరు భాగవతుల వంశంలో పుట్టిన మెలట్టూరు వెంకట రామశాస్త్రి మేలట్టూరు భాగవతుల కోసం చాలా నాటకాలు రాశారు. ఆయన కీర్తనలు,

స్వరజతులు, చిందులు, భక్తికీర్తనలు, యక్షగానాలు రాశాడట. అయితే యిప్పుడు యక్షగానాలనే నాట్యనాటకాలు తప్ప మిగిలినవేవీ దొరకటం లేదు. చిత్రమైన విషయమేమిటంటే ఆయన రాసిన పదకొండు నాటకాలు కేవలం తమిళం, గ్రంథలిపుల్లో మాత్రమే వున్నాయి. తెలుగులో రాసిన లిఖితప్రతులు యింతవరకూ దొరకలేదు.



అచ్చమైన 'దేశీ' సంప్రదాయానికి చెందిన మెలట్టూరు భాగవత నాటకాలు గొప్ప సంగీత నాట్యరీతులలో వెలువడ్డాయి. రాజులు పోయారు. ప్రభుత్వాలు మారాయి. భాషపేరుతో దేశం రాష్ట్రాలుగా విభజించబడిపోయింది. జీవనవిధానాలు మారాయి. మెలట్టూరు భాగవతులు గూడా కాలానుగుణంగా మారారు. యింగ్లీషు చదువులు చదువుకున్నారు. వుద్యోగాలు చేస్తున్నారు. అయితే తమ సంప్రదాయాల్ని విడిచిపెట్టకుండా, యేడాదికోసారి జరిగే వుత్సవాల పేరుతో, తమ వూరి గుడి ప్రాంగణంలో, మెలట్టూరు నాటకాల్ని ప్రదర్శిస్తూనే వస్తున్నారు. అది వాళ్ళ సంప్రదాయం. జీవనమార్గం. వాళ్ళ భక్తి, పూజ గూడా! యిప్పుడు ఆ నాటకాల్ని ప్రదర్శిస్తున్నవాళ్ళల్లో చాలామందికి తెలుగు రాదు. అయితే కష్టపడి తమిళలిపిలో వున్న ఆ తెలుగు నాటకాల్ని బట్టీపెట్టి, ఆ పద్యనాటకాల్ని అదొక పూజలా దీక్షగా కొనసాగిస్తున్నారు.

మెలట్టూరు భాగవతులకు నాటకం కేవలం వినోద ప్రదర్శనంగాదు. "కళ కళ కోసమే" నంటూ వాళ్ళు నేలబారు వినోదానికీ, అపహాస్యానికీ పూనుకోరు. వీలయినంత సాంకేతిక నైపుణ్యంతో, రసప్లావితంగా నాటకం ప్రదర్శించాలని కోరుకుంటారు. వాళ్ళకు నాటకం అంటే భక్తీ, సంగీతం, నాటకం, నాట్యాల సంగమం. అదీ భక్తీ, రసనల సంగమం.

మెలట్టూరు నాటకాలెలా వుంటాయో తెలుసుకుందామని 'యూట్యూబ్'ను ఆశ్రయించాను. 2013లో జరిగిన మెలట్టూరు మేళాలోని 'ప్రహ్లాద చరిత్రం'లోని కొంత భాగం వీడియో దొరికింది. సాధారణంగా మెలట్టూరు మేళా చివరిరోజున యీ నాటకాన్ని ప్రదర్శిస్తారట! ఆ వూరి ఆలయం పూజలందుకుంటూ వుండే' నరసింహుడి ముఖం తొడుగును ఆ నాటకంలో నరసింహుడి పాత్ర పోషించే వ్యక్తి వుపయోగిస్తాడట! ఆ నరసింహుడి ముఖం తొడుగును తొడుక్కున్న నటుడు పూర్తిగా నరసింహుడే ఆవహించినట్టుగా వుగ్రమూర్తై కదను తొక్కేస్తాడు. ఆరేడు మంది భక్తులు అతడ్ని దారాల్తో కట్టి ముందుకురకకుండా పట్టుకుంటారు. హిరణ్యకశపుడి పాత్రధారి గూడా అంతే భీతావహంగా విష్ణువుపైన యుద్ధానికి వుపక్రమిస్తారు. వదిలితే ఆ యిద్దరూ అక్కడ నిజమైన యుద్ధాన్నే చేసేస్తారన్న భయం కలుగుతుంది. ప్రేక్షకులంతా భక్తితాదాత్మ్యంలో మునిగిపోయి వుంటారు.

మెలట్టూరు భాగవత నాటకాల్లో గూడా చిందులు, దరువులూ వుంటాయి. స్త్రీ పాత్రల్ని గూడా పురుషులే వేస్తారు. పద్యాలూ, వచనమూ కలగాపులగంగా వుంటాయి. గ్రీకు నాటకాల్లో చెప్పే 'అద్భుతం" యిక్కడా వుంటుంది. యీ నాటకాల్ని చూస్తున్నప్పుడూ, ఆ పాత్రధారుల నటనను చూసినప్పుడూ నాకు వెంటనే చిత్తూరుజిల్లాలో, అంటే పాత తొండనాడులో యిప్పటికీ ప్రాచుర్యంలోవుండే మహాభారత నాటకాలు గుర్తుకొచ్చాయి. తొండనాడు మహాభారత నాటకాల్ని ''ఆట'' అంటారు. యీ ఆటని యేడాదికొకసారి జరిగే మహాభారత యజ్ఞమని పిలువబడే 18 రోజుల కార్యక్రమంలో రాత్రిపూట జరుపుతారు. పగలు మధ్యాహ్నం భోజనానంతరం, దాదాపు 1 గంట లేకపోతే 2 గంటల నుంచీ సాయంత్రం 6 గంటల వరకూ మహాభారతాన్ని హరికథగా హరిదాసు చేత నిర్వహింపజేస్తారు. దాదాపుగా అదే కథాభాగాన్ని రాత్రి 8 గంటల నుంచీ తెల్లవారుఝాము వరకూ నాటకరూపంలో ప్రదర్శిస్తారు.

తొండనాడులో ప్రదర్శించబడే ఆ 'మహాభారతం' ఆటను కుప్పం దగ్గరి 'కంగుంది' అనే గ్రామానికి చెందిన గ్రామీణులు నాటకాలుగా ప్రదర్శిస్తారు. మహాభారత యజ్ఞాన్ని నిర్వహించే వూరివాళ్ళు, కంగుంది నాటకాలవాళ్ళతో వొప్పందం కుదుర్చుకుని పద్దెనిమిది రోజులపాటూ 'భారతంమిట్ట'లో నాటకాలు నిర్వహిస్తారు. అప్పుడు కంగుంది నుంచీ కొన్ని కుటుంబాల వాళ్ళు ఆయా గ్రామాలకొచ్చి, 18 రోజులపాటూ అక్కడే వుండి, రాత్రుల్లో నాటకాలు ప్రదర్శిస్తారు. పద్యాలూ, దరువులూ, చిందులూ, వచనాలూ నిండిన ఆ నాటకాల రచయితలెవరో తెలియదు. కేవలం వంశాచారంలా సంక్రమించిన నాటకాల రచనల్ని మౌఖికంగానే నేర్చుకుంటూ కంగుందివాళ్ళు నాటకాల్ని, గ్రామీణులు తన్మయులయ్యేలా, అద్భుతంగా ప్రదర్శిస్తారు. నటులు చిత్రవిచిత్రమైన వేషధారణతో మెప్పిస్తారు. దుర్యోధనుడు గూడా, ఆ రాత్రిపూట, చలువకళ్లద్దాలతో, చేతి గడియారాలతో చిత్రంగా రంగప్రవేశం చేస్తారు. స్త్రీలపాత్రల్ని చాలావరకూ పురుషులే ధరిస్తారు. అయితే కుటుంబాలకు కుటుంబాలే నటులైన 'కంగుంది' వాళ్ళు, అప్పుడప్పుడూ స్త్రీలకు గూడా అవకాశమిస్తారు. అది కేవలం అవకాశం మాత్రమేగాదు, అవసరం గూడా!


మెలట్టూరు భాగవతుల్లాగా కాకుండా కంగుంది నాటకాల వాళ్ళకు నాటకాలే వృత్తీ, ప్రవృత్తీ గూడా! వాళ్ళింకా చదువులు చదివి, పెద్ద వుద్యోగాలకెగబాకలేదు. కేవలం నాటకాల్నే నమ్ముకుని బతుకుతున్నారు. నాటకాలులేని కాలాల్లో 'కంగుంది'లో తమకున్న కొద్దిపాటి భూముల్లో వ్యవసాయాలు చేసుకుంటూ జీవికను వెల్లబోస్తున్నారు. మెలట్టూరు భాగవతులకూ, కంగుంది నాటకాల వాళ్ళకూ మధ్యవుండే ప్రధానమైన తేడా: మెలట్టూరు భాగవతులు బ్రాహ్మణులు. కంగుంది నాటకాలవాళ్ళు శూద్రులు. కేవలం వొక వూరిలో వుండే ఆలయంలోనే ప్రదర్శనలు జరపడమూ, కాలాను గుణంగా మారుతూ ఆయా కాలానికి తగినట్టుగా చదువుకోవడమూ, జీవికకు అనుకూలమైన వృత్తుల్ని చేపడుతూ రావడమూ – యీ కారణాల వల్ల మెలట్టూరు భాగవతమేళా వాళ్ళు తమ నాటకాలను కేవలం భక్తిమార్గంలోనే నిలపడానికి అవకాశాన్ని కలిగించాయి. అయితే ఆయా నాటకాల్లో అక్కడక్కడ కొన్ని కల్పితపాత్రలూ,

హాస్యప్రధాన పాత్రలూ వినోదం కోసం తయారుచేయడం స్పష్టంగా కనబడుతుంది.

మెలట్టూరు భాగవతమేళాలకూ, కంగుంది కువ్వం భారతనాటకాలకూ చాలా పోలికలున్నాయి. పౌరాణిక పాత్రలకు సరిపోయే వేషధారణ (మేకప్), వాళ్ళు వాడే ఆభరణాలూ, కిరీటాలు, ముఖానికి పూసుకునే అద్దకమూ, దుస్తులూ, తలలకు తగిలించుకునే జుట్లూ, పూలూ, పూలమాలల్ని అలంకరించుకునే తీరూ దాదాపుగా వొకేరీతిలో వుంటాయి. పద్యాలు చదివే తీరులోనూ, వచనాల్ని పలికే పద్ధతిలోనూ గూడా పోలికలున్నాయి. అయితే కంగుంది నాటకాల వాళ్ల ప్రేక్షకులు అచ్చమైన గ్రామీణులూ, జానపదులు గావడంతో, వాళ్లను అలరించడం కోసం ప్రాచుర్యముందే విధానాలలో ప్రదర్శనలుంటాయి. అందుకే కంగుంది వాళ్ళ నాటకాల్లో అక్కడక్కడ హాస్యం అపహాస్యంగావడమూ, కొంత బూతు కూడా చోటుచేసుకున్నాయి. యీ కొన్ని మినహాయింపులు తప్పితే, మిగిలిన చాలా విషయాల్లో యీ రెండు నాటకధోరణుల్లో సామ్యాలున్నాయి.

**యీ సామ్యాలూ, యీ రెండు ప్రదర్శనలూ తమిళమూ, తెలుగూ కలగలసిన ప్రాంతాల్లో నివాసం పొందడమూ గమనించినప్పుడు కొన్ని ప్రధానమైన అంశాలను గుర్తించాల్సిన అవసరం వుంది. మెలట్టూరు భాగవతమేళా కంగుంది నాటకాలూ, త్యాగరాజు సంగీతమూ, తమిళనాడులో కన్యాకుమారి నుంచీ వేలూరు వరకూ వ్యాపించిన తెలుగు జానపదరూపాలూ తెలుగు తమిళ సంప్రదాయాల మేలుకలయికలలో తెలుగు భాషా రూపకాల ప్రాదుర్భావాన్ని నిరూపిస్తున్నాయి. భాషాప్రయుక్త రాష్ట్రాలు యేర్పడిన తర్వాత పుట్టిన భాషాదురభిమానాలు అంతకు మునుపసలు లేవనీ, తమిళనాడు రాష్ట్రంలో యిప్పుడు గూడా మూడువంతులకు పైగా తెలుగువాళ్ళే వున్నారనీ, భాష పేరుతో ప్రత్యేక రాష్ట్రపోరాటం చేసినవాళ్ళు తెలుగువాళ్ళేననీ మనం స్పష్టంగా గుర్తించితీరాలి. దేశాన్ని భాషప్రాతిపదికగాకుండా, వేరే విభాగాల్లో రాష్ట్రాలుగా విభజించివుంటే తెలుగుభాషకు చాలా మేలు జరిగివుండేది.** యిప్పుడు కూడా పాతనాటకాలు తెలుగు ప్రతులు తయారు చేయడమన్న పని మెలట్టూరులోనే ప్రారంభమయిందనీ, కంగుంది వాళ్ళ నాటకాల రాతప్రతులు లేవనీ తెలుసుకోవాలి. భారతదేశం వంటి దేశంలో వొకే కుటుంబానికి చెందిన వివిధ భాషలు పరస్పరం మేలుచేసుకుంటూ యెదగగలుగుతాయని యీ సమాచారమంతా నిరూపిస్తోంది.

తంజావూరు మెలట్టూరు భాగవత నాటకాలను తెలుగు లిపిలోకి తీసుకొచ్చి, పరిష్కరించి ప్రచురించే పని గత సంవత్సరమే ప్రారంభమయ్యింది. మెలట్టూరు వెంకటరామశాస్త్రి రాసిన యీ నాటకాలలో "ప్రహ్లాద చరిత్రము" ను సంస్కృతాంధ్ర పండితులు డా. నుదురుమాటి వెంకట దేవీప్రసాద్‌గారూ, విద్వాన్ ఎన్.శ్రీనివాసన్‌గారూ పరిష్కరించి ప్రచురణకు సిద్ధం చేస్తున్నారు. దీనికి వాళ్ళు డా. ఉ.వే.స్వామినాథ అయ్యర్ గ్రంథాలయంలో గ్రంథలిపిలో వున్న తాళపత్ర గ్రంథాన్ని, శ్రీమతి కళ్యాణి అమ్మాళ్ తమిళంలో రాసి భద్రపరచిన ప్రతినీ, భాగవత మేళా సంఘం తమిళ దేవనాగరి లిపులలో తీసుకొచ్చిన పుస్తకాల్నీ ఆధారంగా




తీసుకున్నారు.

యీ వనికి భాగవతమేళా నాట్యనాటకట్రస్టు నిర్వాహకులు భారతం మహాలింగంగారి పూనికకు తోడుగా వస్త్రవ్యాపారులు నల్లి కుప్పుస్వామిచెట్టిగారి సహాయ సహకారాలు తోడయ్యాయి. చాలారోజుల క్రితం తన స్వగ్రామం వెళ్ళివస్తూ చెట్టిగారు ఆ పక్కనేవున్న మెలట్టూరు నాటకాల కెళ్ళమన్న మిత్రుడి మాట ప్రకారం వెళ్ళారట! అప్పుడక్కడ తెలుగులో జరిగిన ప్రదర్శనను చూసి విస్మయపడ్డారట! ఆయన మాతృభాష కూడా తెలుగు గావడమే అందుకు కారణం. అప్పటినుంచీ తాను మెలట్టూరు భాగవతమేళాకు కావల్సిన ఆర్థిక సహాయాలు రెండుచేతులా చేస్తున్నానని చెట్టిగారు సభలో స్వచ్ఛమైన తమిళంలో ప్రసంగించారు. (తన తెలుగును వింటే యితరులు నవ్వుతారేమోనని సంకోచిస్తూ)

మెలట్టూరు మేళా వాళ్ళు ప్రచురించిన రెండవ పుస్తకం 'మార్కండేయ చరిత్రము'కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషాసాంస్కృతికశాఖ వాళ్ళు ఆర్థిక సహాయం చేయడమూ, దాని ఆవిష్కరణకు ప్రభుత్వ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్‌గారు పనిగట్టుకుని రావడమూ, యికపైన మెలట్టూరు వాళ్ళు పరిష్కరించి ప్రచురించబోయే అన్ని నాటకాలకూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆర్థిక సహకారాన్ని అందిస్తుందని ఆయన ప్రకటించడమూ ఆలస్యంగానైనా, తెలుగువాళ్ళూ, తెలుగు ప్రభుత్వమూ మంచి పనులు చేయడం మొదలుపెట్టిందనడానికి సాక్ష్యాలుగా నిలుస్తాయి.

చిన్న చిన్న వుపన్యాసాలతోనే రెండు గంటల దాకా సాగిన సభానంతరం మహాలింగం బృందం 'మార్కండేయ చరిత్ర'ను సంక్షిప్తరూపంలో ప్రదర్శించారు. దాదాపుగా రాత్రంతా కొనసాగే నాటకాన్ని గంటన్నరకు కుదించడంతో రసవత్తరంగా ప్రదర్శించే అవకాశం కోల్పోయినా, అసలు నాటకమెంత గొప్పగా వుండేదో రుచిచూసి తెలుసుకోగలిగే అవకాశం దొరికింది. తెలుగుపాటలూ, ద్విపదలూ సంగీతంతో కలిసి తమిళయాసలో వినడం కొత్తరకం అనుభవం. మధ్యలో వచ్చే వచనాలను తమిళలిపిలోనే నేర్చుకుని, బట్టీయం చేసి, వాళ్ళు వల్లించే తీరు గూడా వింతగా వుంది. అయితే తెలుగులోనే ఆ నాటకాలను ప్రదర్శించాలనే వాళ్ళ పట్టుదలా, తమదైన సంప్రదాయాన్ని అనవరతంగా ముందుకు తీసుకెళ్ళాలనే వాళ్ళ తపనా ముచ్చటగొలుపుతాయి. వాళ్ళపైన గౌరవాన్ని పెంచుతాయి.

'కంటిగ తెనుగు పదమాల
నాటకమగ జేసి నేను నయమొప్పనిలన్
పాటించెద నచ్యుతపురి
మేటిమి గల జనులు పొగడ మీసరముగన్×" –

అనే పద్యంలో వెంకటరామశాస్త్రి గారు "మార్కండేయ చరిత్ర"ను ప్రారంభిస్తారు.

జూన్‌నెలలో వారం రోజులపాటూ మెలట్టూరులో భాగవతమేళా నాటకాల్ని ప్రదర్శిస్తారు. ఆ నాటకాలకు రమ్మనీ, వచ్చినవాళ్ళందరికీ ఆతిథ్య మర్యాదలు చేసే అవకాశాన్నివ్వమనీ భరతం మహాలింగం గారు ఆహ్వానించారు. తమిళ శరీరంలో తెలుగు హృదయమెంత అద్భుతంగా యిమిడిపోయిందో తెలుసుకోవడం కోసమైనా మనమంతా మెలట్టూరుకు వెళ్ళిరావాలి.

స్పందన

## ద్వారబంధాల చంద్రయ్య నాయుడు

ఏప్రిల్ 'అమ్మనుడి' సంచికలో పద్మారావు రాయలు వ్రాసిన 'ద్వారబంధాల చంద్రయ్య నాయుడు' వ్యాసం స్ఫూర్తిదాయకంగా ఉంది. అల్లూరి సీతారామరాజు కంటే ముందుగానే, బ్రిటీషు వారిని ఎదిరించి యుద్ధంచేయడం అంటే అద్భుతమైన చారిత్రక సంఘటన. అయితే, పాలకులు, పెత్తందార్లు, చరిత్ర రచయితల నిర్లక్ష్యం ఫలితంగా ఆయన చరిత్ర మరుగున పడింది అని వ్యాసకర్త అభిప్రాయపడడం సరియైనది కాదు.

ప్రముఖ చరిత్రకారిణి - ఆకాశవాణి తొలి తెలుగు న్యూస్ రీడర్ అయిన జోళెపాలెం మంగమ్మగారు చాలాకాలం క్రితం అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్రను ఆంగ్లంలో వ్రాయగా - హైదరాబాద్ - తార్నాకలోని ఎ.పి. స్టేట్ ఆర్కైవ్స్ సంస్థవారు ప్రచురించారు. ఈ గ్రంథం అందరి ప్రశంసలను అందుకొన్నది. మంగమ్మగారు ఈ గ్రంథాన్ని వ్రాసే సమయానికి కూడ చంద్రయ్య నాయుడు ను గురించి ఆమెకు తెలియదు. లేకుంటే ఆమె చంద్రయ్యనాయుడును గురించి తప్పకుండా ఆ గ్రంథంలో వ్రాసి ఉండేది.

మరో విషయం-ఆం.ప్ర. హిస్టరీ కాంగ్రెస్ 1976లో డా॥మలిరెడ్డి పట్టాభిరామిరెడ్డి గారిచే కావలిలో స్థాపించబడింది. ఇప్పటికి 4 సదస్సులను ఈ సంస్థ జరిపినది. ఈ సదస్సుల్లో ఏ పరిశోధకుడు కూడా ద్వారబంధాల చంద్రయ్యనాయుడు సాహస కృత్యాల గురించి తెలియజేసే పరిశోధక వ్యాసాన్ని సమర్పించలేదు. బహుశ చంద్రయ్య నాయుడు గురించి వారికి సమాచారం తెలియక పోయినందున ఈ విధంగా జరిగివుడవచ్చు. ఈ సంస్థ ఆంధ్రదేశ సమగ్ర చరిత్రను 8 సంపుటాలుగా ముద్రించింది. ఆ సమయంలో కూడా చంద్రయ్య నాయుడును గురించిన విషయాలు తెలియనందున ఆ సమాచారం అందులో చోటుచేసుకొని వుండకపోవచ్చు.

గోదావరి జిల్లాలోని పి.ఎస్.శర్మగారి "స్వాతంత్ర్య సమరయోధుల గాథలు" అనే గ్రంథంలో చంద్రయ్యనాయుడును గురించిన ప్రస్తావన లేదు. ఉన్నదని వ్యాసకర్త పేర్కొన్నారు. తొలినాళ్ళలోని 'హిందూ' పత్రిక కూడా చంద్రయ్య స్వాతంత్రోద్యమంలో పాల్గొన్న విషయాలను ప్రస్తావించినట్లుగా పేర్కొన్నారు. నిజం చెప్పాలంటే, పి.ఎస్.శర్మ వివరించిన విషయాలు, హిందూ పత్రికలో వచ్చిన విషయాలు ఎందువల్లనో చరిత్ర పరిశోధకుల దృష్టిలో పడలేదు. ఈ విధంగా చంద్రయ్యనాయుడు చరిత్ర మరుగున పడిపోయింది.

మొత్తానికి పద్మారావురాయలు-అల్లూరి సీతారామరాజుకు ముందే చంద్రయ్యనాయుడు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని అమరుడయ్యాడని వ్రాశారు. చరిత్ర విద్యార్థులకు, పరిశోధకులకు అమూల్యమైన విషయాలు తెలియజేసి చరితార్థులైనారు. ఈ విషయా లను -ఎ కాంప్రెహెన్సివ్ ఆఫ్ ఆంధ్ర హిస్టరీ (8 గ్రంథములు ముద్రింపబడినవి) జనరల్ ఎడిటర్ ఆచార్య వకుళాభరణం రామకృష్ణ గారికి(సెల్-9866841409) తెలియజేసి, రాబోయే ముద్రణలో చంద్రయ్యనాయుని స్వాతంత్ర్య పోరాట ఘట్టములను ఆ గ్రంథంలో చేర్చమని కోరండి.

– డా॥జి.వెంకటేశ్వరరావు,ఆం.ప్ర.హిస్టరీ కాంగ్రెస్, వ్యవస్థాపక సభ్యులు, నెల్లూరు.

కవిత

## ఢిల్లీ

-డా॥ఎన్.గోపి

అనగనగా ఒక ఢిల్లీ
కాలం సిగలో నాగమల్లి
అప్పుడప్పుడు ఢిల్లీకి వెళ్ళొస్తుంటాను
వెళ్ళినప్పుడల్లా
నా అస్తిత్వాన్ని కాస్త కాస్త కోల్పోతుంటాను.
పరాయీకరణానికి
తురాయిలా వెలుగుతుంది ఢిల్లీ.

చరిత్రలో చదివిన పేర్లు
ఇక్కడ శిలాఫలకాలుగా దర్శనమిస్తాయి.
పార్లమెంటు ఆవరణలో
రాజకీయాలు
సుడిగాలిలా వీస్తుంటాయి.
ఎటు చూసినా
దగ్ధమైపోయిన మాటల బూడిద
వ్యర్థమైపోయిన
న్యూస్‌ప్రింట్ కుప్పలు కనిపిస్తాయి.

ఎక్కడన్నా మన ఊరి ఆనవాళ్ళు
కనబడతాయేమోనని చూస్తాను
ఇక్కడి సమాధులను దర్శించినప్పుడల్లా
మనసులు వినమ్రమౌతాయి గాని
వెంటనే మన పల్లెల్లోని
అలనాటి స్వాతంత్ర్య సమరయోధుల
త్యాగాలు గుర్తుకొస్తాయి.

కరోల్‌బాగ్, బెంగాలీ మార్కెట్లలో
తప్పిపోయిన సీతాకోకలా పరిభ్రమిస్తాను.
ఒక స్వెట్టరూ రెండు మఫ్లర్లను కొనుక్కొని
త్రివర్ణ పతాకం చేతికొచ్చినంతగా
సంబరపడతాను.

ఢిల్లీకి ఏ భాషా సరిగ్గా రాదు
మొరపెట్టుకోవాలన్నా
గర్జిస్తేనే దాని కర్థమౌతుంది.

రాష్ట్రపతి భవన్‌లో
ప్రతివారూ రోబోల్లాగే కదుల్తుంటారు
మొఘల్ గార్డెన్‌లో గులాబీలు
విదేశీ వాసన వేస్తాయి.

ఇండియా గేటు ద్వారా ప్రవేశించినా
మన వూరి దారిని చేరుకోలేం
ఢిల్లీని చూసినప్పుడల్లా నాకు
సముద్రాల మీద పర్వతాలు
పెత్తనం చేస్తున్నట్టుగా అనిపిస్తుంది.
ఢిల్లీకి వెళ్ళిన మరుక్షణం
మళ్ళీ తిరుగు విమానం కోసమే
ఆరాటపడతాను.
ఎయిర్‌పోర్టు దారి ఒక్కటే
పరమ ఆత్మీయంగా కనిపిస్తుంది నాకు.

దశాబ్దాలుగా
ఢిల్లీకి వెళ్ళి వస్తున్నాను గాని
నిజం చెప్తున్నాను
దానితో పరిచయం
నాకింకా కలగనే లేదు

బుద్ధజయంతి ప్రత్యేకం

-డి. చంద్రశేఖర్
9290091932

# బుద్ధుని చిత్తభావనా అభ్యాసం

సాధారణంగా ధ్యానం అని పిలవబడే మానసిక అభ్యాసాన్ని సూచించటానికి బుద్ధుడు తరచూ "భావనా" అనే పదాన్ని ఉపయోగించాడు. ఈనాటి రోజువారీ భాషలో యీ పదం కనిపించదు. కాని, సంప్రదాయ వైద్యపరిభాషలో యిది నేటికీ వాడుకలో ఉంది. ఒక ఔషధాన్ని భావన చెయ్యటం అంటే, దానిలోని మలినాలను తొలగించి దాని సుగుణాలను వృద్ధిచెయ్యటం. ఉదాహరణకు, భావన అల్లం అంటే 'శుద్ధిచేయబడి, ఔషధగుణాలు పెంపొందించబడిన అల్లం' అని అర్థం. ఇదేరీతిలో, 'మనసులో పేరుకున్న మలినాలను తొలగించి, దాని సహజ గుణాలను అభివృద్ధి చెయ్యటం' అనే అర్థంలో బుద్ధుడు భావనా అనే పదాన్ని ఉపయోగించాడు.

బుద్ధుడు ప్రతిపాదించిన చిత్తభావనా అభ్యాసానికి ఒక సమగ్రమైన, లోతైన మనోవిజ్ఞాన పునాది ఉంది. ఆ మనోవిశ్లేషణ మరియు సదరు విశ్లేషణపై ఆధారపడిన చిత్తభావనా లేక ధ్యాన విధానాన్ని సమగ్రంగా తెలుసుకోకుండా, దాన్ని సాధన చెయ్యటం, అటువంటి సాధన ద్వారా సరైన ఫలితాలను పొందటం సాధ్యం కాదు. కనుక బౌద్ధ మనోవిజ్ఞానం గురించి క్లుప్తంగానైనా తెలుసుకోవటం అవసరం.

బుద్ధుడు, మనసును స్థూలంగా నాలుగు స్కంధాలుగా (రాశులుగా) విశ్లేషించాడు. అవి: వేదనా, సంజ్ఞా, సంఖార మరియు విజ్ఞాన లేక చేతన. అలాగే, మానవ అస్తిత్వం మొత్తాన్ని (ఎ) ఆరు ఇంద్రియాలు – కన్ను, చెవి, ముక్కు, నాలుక, శరీరం, మనసు (బి) వాటికి సంబంధించిన ఆరు బాహ్య విషయాలు – రూపం, శబ్దం, వాసన, రుచి, స్పర్శ, భావాలు (సి) ఆరు రకాల విజ్ఞాన ధాతువులుగా – దృష్టి జ్ఞానం, వినికిడి జ్ఞానం, స్పర్శ జ్ఞానం మొదలైనవి – విశ్లేషించటం జరిగింది.

జ్ఞానేంద్రియాలు, బాహ్య విషయాలు మరియు వాటికి సంబంధించిన చేతన (విజ్ఞాన) సంపర్కంతో, మనసుపై నిరంతరం మూకుమ్మడి దాడి జరుగుతుంటుంది. అవిద్య కారణంగా అదుపులేకుండా నిరంతరం పునరావృతమయ్యే యీ ప్రక్రియ అనుక్షణం మనలో ఆరాటాన్ని, అసంతృప్తిని, అశాంతిని రేకెత్తిస్తుంది. వీటన్నిటిని క్లుప్తంగా దుఃఖం అని అంటున్నాం. అదుపులేని ఇంద్రియ అనుభవం, మనసుకు తనను తాను గమనించే అవకాశం యివ్వదు. ఈ స్థితి సుదీర్ఘకాలం కొనసాగిన ఫలితంగా రాగం ద్వేషం మోహం అనే మలినాలు మనసులో గూడుకట్టుకుని దుఃఖాన్ని ఉత్పన్నం చేస్తుంటాయి. కనుక, దుఃఖాన్ని నివారించటం కోసం ఎరుకతో ఇంద్రియాలను కాపుకాయటం, వాటిపై అదుపు సాధించటం తప్పనిసరి.

దుఃఖాన్ని ఉత్పన్నంచేసే కారణాలతోపాటు, దుఃఖ నివారణకు అవసరమైన మానసిక శక్తులు కూడా మనిషిలో సహజంగానే ఉన్నాయని బుద్ధుడు గుర్తించాడు. అవి: శ్రద్ధ, వీర్య, సతి, సమాధి, ప్రజ్ఞ. మనసు అత్యున్నత సామర్థ్యాన్ని పొందాలంటే, యీ ఐదు



మనోబలాలను వృద్ధిచెయ్యటం ఎంత అవసరమో, వాటి తీవ్రతలో సమతుల్యతను సాధించటం కూడా అంతే అవసరం. ఉదాహరణకు, శరీరంలో ఒక కాలు రెండవదాని కంటే పొడవుగా (లేక పొట్టిగా) ఎదిగిన వ్యక్తి, పూర్తి సామర్థ్యంతో నడవలేడు. అలాగే, మనోబలాల్లో సమతుల్యత లేనప్పుడు, ఆ మేరకు మానసిక సామర్థ్యం కుంటుపడుతుంది. కనుక, సహజాతమైన ఐదు మనోబలాలను వృద్ధిచెయ్యటంతోపాటు, వాటిమధ్య సఖ్యత, సమతుల్యత సాధించటం ఎంతైనా అవసరం.

ఐదు మనోబలాలను మాత్రమే గాక, వాటిని పెంపొందించటం కోసం చేసే చిత్తభావనా అభ్యాసంలో అంతర్గతంగా ఎదురయ్యే ఐదు ఆటంకాలను కూడా బుద్ధుడు కనుగొన్నాడు. పంచనీవరణలు అనబడే అవి: కామఛంద, ద్వేషం, ఆందోళన, చికాకు, మందగొడితనం, జడత్వం మరియు కుశంక. ఈ ఐదు ఆటంకాలను అధిగమించకుండా ఇంద్రియ సంయమనాన్ని, మనోబలాల పరిపూర్ణ వికాసాన్ని సాధించలేమని బౌద్ధం చెబుతుంది. అంతేకాదు, ధ్యానంలో ఎదురయ్యే యీ ఆటంకాలను అధిగమించటానికి నిర్దుష్టమైన సాధనా ప్రక్రియలను కూడా బుద్ధుడు వివరించాడు. ఉదాహరణకు, సాధకుని మనసులో ద్వేషం తలెత్తినప్పుడు మైత్రీ భావనను సాధన చెయ్యటం ద్వారా దాన్ని నిరోధించవచ్చు.

పైన వివరించిన విధంగా ఇంద్రియ సంయమనాన్ని, ఐదు మనోబలాలను భావనా చెయ్యటం ద్వారా శారీరక మానసిక సమథ (ప్రశాంతత) నెలకొన్న సాధకుడు, అంతిమంగా పొందగలిగే ఫలితాలను కూడా బుద్ధుడు వివరించాడు. వీటిలో, బ్రహ్మవిహారాలని పిలవబడే మైత్రి, కరుణ, ముదితా, ఉపేక్ష అనే నాలుగు సమున్నత మానసిక స్థితులు ఒక భాగం; కాగా చిత్తవిముక్తికి, అత్యున్నత జ్ఞానానికి (సంబోధి) సోపానాలైన ఏడు సంబోధిఅంగాలు మరొక భాగం. సంబోధిఅంగాల్లో సతి, సమాధి వంటి గుణాలతో పాటు ధర్మవివేచన, ధార్మిక ప్రీతి, అచంచలమైన మానసిక ప్రశాంతత అనేవి ఉన్నాయి. వీటన్నిటిని సవివరంగా చర్చించటం ఈ వ్యాసం

(...తరువాయి 32వ పుటలో)

బుద్ధజయంతి ప్రత్యేకం

# అక్కడా బౌద్ధమే.. ఇక్కడా బౌద్ధమే.. కానీ..

- అనూరాధ భట్ట
9010016555

**బుద్ధ** జయంతి... అనగానే మనసంతా పండుగలా అన్పిస్తుంది. బౌద్ధంతో ఏదో బంధం ఉండి ఉంటుందని నా నమ్మకం. నా పేరు అనూరాధ కావడం కూడా దానికి ఓ కారణం. శ్రీలంకలో బౌద్ధం వ్యాప్తి అయ్యేలా చేసిన భిక్కుని అనురాధ. తెలిసో తెలియకో ఆమె ప్రభావం నామీద ఉంది. బుద్ధుడి జీవితంతో ముడిపడిన ప్రధాన ప్రదేశాలన్నిటినీ దర్శించాను. బుద్ధుడు జన్మించిననేపాల్లోని లుంబిని, సిద్ధార్థుడు బుద్ధుడిగా మారిన బుద్ధగయ... మొట్టమొదటి సందేశం అందించిన సారనాథ్.. ఎక్కువ రోజులు గడిపిన రాజగృహ... శరీరాన్ని త్యజించిన కుషీనగరం ఇలా ప్రతి క్షేత్రాన్ని దర్శిస్తూ తథాగతుడికి దగ్గర అయ్యేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నాను.

అయితే నాగార్జునకొండలోని బుద్ధ విగ్రహాన్ని చూసినప్పుడు మాత్రం ఒకవైపు దు:ఖం.. మరో వైపు సంతోషం మనసుని ఆవహిస్తాయి. భారతదేశంలో బౌద్ధానికి మరేచోటా వేయనంత పెద్దపీట మన తెలుగు నేల వేసింది. మరే రాష్ట్రాల్లో లేనన్ని బౌద్ధ స్థూపాలు ఇక్కడ బయటపడ్డాయి. రెండో శతాబ్దినాటికే అమరావతి, నాగార్జున కొండ దేశంలోనే అతి ముఖ్య బౌద్ధ కేంద్రాలుగా పేరు తెచ్చుకున్నాయి. అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలుగా ప్రసిద్ధి చెందాయి. ఆనాడు క్రిష్ణ, గోదావరి ముఖద్వారాల్లోంచి సముద్ర జలాల్లోకి అడుగుపెట్టిన ప్రతి నౌకా, బౌద్ధాన్ని సుదూర తీరాల్లో వ్యాప్తి చేయడానికి దోహదం చేసింది అని చాలా పుస్తకాల్లో విశ్లేషించారు. అది నూటికి నూరు శాతం వాస్తవం అని ఇటీవల నేను వెళ్లిన వియత్నాం యాత్ర ద్వారా అనుభవం లోకి వచ్చింది.

ప్రాచీన తెలుగు రాజ్యాల్లో ఒకటైన చంపారాజ్యం గురించి పరిశోధన చేయడానికి వియత్నాం వెళ్లాను. వియత్నాంలో రెండో అతి పెద్ద నగరం హొచిమిన్ సిటీ. ఆకాశ హర్మ్యాలు.. పెద్ద పెద్ద పార్కులు.. రోడ్డుకిరువైపులా కాఫీ షాపులు.. కార్లకంటే ఎక్కువగా కన్పించే టూవీలర్లు.. ప్రతి కార్నర్లో విదేశీ టూరిస్టులతో కిటకిటలాడుతూ ఉంటుంది హొచిమిన్ సిటీ.

హొచిమిన్ సిటీలో ముందుగా నేను వెళ్లింది నేషనల్ హిస్టరీ మ్యూజియం. ఇక్కడ ప్రత్యేకంగా చంపా గ్యాలరీ అని ఏర్పాటు చేశారు. చంపా రాజ్యంలో పురావస్తు తవ్వకాల్లో బయటపడిన శిల్పాలను ఇక్కడ ప్రదర్శనలో పెట్టారు. ఆ గ్యాలరీ మెట్లు ఎక్కుతుంటే ఎదురుగా బుద్ధుడి నిలువెత్తు విగ్రహం స్వాగతం పలికింది. దగ్గరగా వెళ్లిచూస్తే నా ఆశ్చర్యానికి అంతులేదు. ఆ బుద్ధవిగ్రహం అచ్చం మన నాగార్జునకొండలో ప్రస్తుతం ఉన్న బుద్ధుడి నిలువెత్తు శిల్పానికి నకలుగా అన్పించింది. ముడివేసిన రింగురింగుల జుట్టు.. నుదుటి పై పెద్ద బొట్టు.. అరవిప్పిన కన్నులు.. చిరు మందహాసం..ఎడమ భుజం వైపు వేసుకున్న ఉత్తరీయం.. ఎడమ చేతి మీదుగా అది జారు వారడం..ఉత్తరీయం కంటే కాస్త పొడవైన పంచె.. రెండు అరచేతులూ ముద్రాస్థితిలో ఉన్నాయి, నాగార్జున కొండ బుద్ధ శిల్పంలో కుడి చేయి శిథిలమై అరచేయి లోపించింది. ఎడమ చేతి వేళ్లన్నీ వెనక్కి ముడుచుకుని ఉన్నాయి. ఈ తేడా తప్పిస్తే మిగతా అంతా ఒకేలా ఉండడం విశేషం.

వియత్నాంలోని ఈ బుద్ధుడి కంచు విగ్రహం దంగ్ దౌంగ్ బుద్ధుడిగా ప్రసిద్ధి చెందింది. **దంగ్‌దౌంగ్ అనే ప్రాంతంలో జరిపిన పురావస్తు పరిశోధనలలో ఈ విగ్రహం బయటపడడంతో ఆ పేరు వచ్చింది. దంగ్ దౌంగ్ ఉన్న రాష్ట్రం పేరు క్వాంగ్ నామ్. ఇదంతా ఒకప్పటి చంపారాజ్యం. ఈ క్వాంగ్ నామ్ నిన్న మొన్నటి పేరు అమరావతి. వియత్నాం ఏకీకరణ తరవాత కమ్యూనిస్టు పాలనలో పాత నగరాల పేర్లన్నిటినీ మార్చేశారు. అలా ఎప్పటి నుంచో అక్కడ ప్రసిద్ధిచెందిన అమరావతి నగరం పేరును కూడా క్యాంగ్ నామ్ గా మార్చారు.**

**దంగ్ దౌంగ్ బుద్ధ విగ్రహం ఎత్తు 1.2 మీటర్లు. 8 లేదా 9 వ శతాబ్దిలో రూపొందించిన ఈ బుద్ధవిగ్రహం ప్రపంచంలోనే అత్యంత విశిష్టమైనదిగా పేర్కొంటున్నారు. అమరావతి శిల్ప రీతికి చెందిన విగ్రహంగా అక్కడ పేర్కొనడం విశేషం. ఈ విగ్రహానికి 6 మిలియన్ అమెరికన్ డాలర్లకు అక్కడి ప్రభుత్వం ఇన్సురెన్స్ కూడా చేయించిందట. అంతేకాకుండా ప్రత్యేకమైన గాజు అల్మారాలో భద్రపరచి శ్రద్ధతో సంరక్షిస్తున్నారు. కాలుష్య కోరలకు చిక్కకుండా పదికాలాల పాటు సంరక్షించుకుంటున్నారు. మన నాగార్జున కొండ బుద్ధ విగ్రహాన్ని ఎండకు ఎండేలా.. వానకు తడిసేలా.. చలికి వణికేలా ఆరుబయట కొన్ని వందల సంవత్సరాల నుంచి అలాగే గాలికి వదిలేశాం.**


ఒకే పోలికతో ఉన్న రెండు బుద్ధ విగ్రహాలు 1. నాగార్జున కొండలో, 2. వియత్నాంలోని క్యాంగ్‌నామ్‌లో ఒకప్పుడు క్యాంగ్‌నామ్ పేరుకూడా అమరావతే!

బుద్ధవిగ్రహాలే కాదు బౌద్ధ స్థూపాలను

వివిధ దేశాలలో ఎంత జాగ్రత్తగా చూసుకుంటున్నారో మాటల్లో చెప్పలేం. ఎంతో భక్తితో శ్రద్ధతో తమ జీవితంలో బుద్ధుడిని మమేకం చేసుకుంటున్నారు. మన దగ్గర పరిస్థితి దీనికి పూర్తిగా భిన్నం. భట్టిప్రోలు, అమరావతి, నాగార్జునకొండ, జగ్గయ్యపేట, శాంకరం.. ఇలా పేర్లు చెబుతూ పోతే కొండవీటి చాంతాడంత అవుతుంది. అడుగడుగునా ఎన్నో స్థూపాలు. ప్రతి స్థూపం దగ్గర పురావస్తు శాఖకు సంబంధించిన స్థలాలుగా పేర్కొంటూ ఓ బోర్డు పెట్టి వదిలేశాం. స్థూపం శిథిలం కాకుండా కప్పు వేయించడం కానీ చుట్టూ రెయిలింగ్ కానీ లేదు. దాదాపు అన్నీ కూడా 1500 సంవత్సరాల కంటే ముందువే. కాలానికి ఎదురీదుతూ ఎవరూ పట్టించుకోకపోయినా ఈ నేల మీద మమకారంతో అలాగే ఉన్నాయి. ఒకప్పటి మన బౌద్ధ ఘనకీర్తికి ఆనవాళ్లుగా ఇంకా నిలచి ఉన్నాయి.

సాధారణంగా బుద్ధుడి అస్థికలపై స్థూప నిర్మాణం చేస్తారు. అందుకే వాటికి ఎంతో ప్రాశస్త్యం ఉంది, అశోకుడి సమయం నుంచి దేశవ్యాప్తంగా స్థూప నిర్మాణం మొదలైనట్టుగా చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. భట్టిప్రోలు, అమరావతి స్థూపాలు

అశోకుడి సమయం నుంచే ఉన్నట్టుగా పేర్కొంటారు. తెలుగు నేల ద్వారానే శ్రీలంకకు బౌద్ధం వ్యాప్తిచెందింది, అక్కడ చాలా చాలా స్థూపాలు కన్పిస్తాయి. వాటిలో ముఖ్యమైనదిగా అనురాధపురాలో ని రువనవేలీసయ స్థూపం. ఇక్కడ ఏ సమయంలో వెళ్లినా పండగ వాతావరణం నెలకొని ఉంటుంది. 55 మీటర్ల ఎత్తైన స్థూపం అది. ఎన్నో దాడుల తరవాత మిగిలిన రూపం ఇది అని స్థానికులు చెబుతారు. స్థూపానికంతా సున్నం వేసి తెల్లగా మార్చారు. శ్రీలంకకు వెళ్లే టూరిస్టులు తప్పనిసరిగా వెళ్ళిచూసే స్థూపం ఇది.

శ్రీలంక నుంచే బౌద్ధం మయన్మార్ కు వ్యాపించిందని చారిత్రక ఆధారాలు తెలియజేస్తున్నాయి. మయన్మార్ లో కూడా అడుగడుగునా స్థూపాలు కన్పిస్తాయి. ఈ దేశంలో స్థూపాలను పగోడాలుగా పిలుస్తారు. మన దేశంలో ప్రతి ఊరిలో గుడులు ఎలా కన్పిస్తాయో మయన్మార్ లో అలా స్థూపాలు కన్పిస్తాయి. క్రీస్తు పూర్వం నుంచి మయన్మార్‌కు సువర్ణభూమి అని పేరు. పగోడాకంతా బంగారు పూత పూయడం ఇక్కడ ఆనవాయితీ. సూర్యోదయ, సూర్యాస్తమయ వేళల్లో ఈ బంగారు రంగు పగోడాలు వింతైన వెలుగులతో కనువిందుచేస్తాయి.

మయన్మార్ లోని పగోడాలన్నిటిలో ప్రసిద్ధిచెందినదిగా యాంగాన్ లోని స్వేడగాన్ పగోడా పేరుతెచ్చుకుంది. ఈ పగోడా ఎత్తు 105






మీటర్లు. పగోడాకంతా వందల కిలోల బంగారంతో తాపడం వేయించారు. రత్నాలు పొదిగారు. పగోడా దిగువ భాగంలో బుద్ధుడి వెంట్రుకలను భద్రపరచారట. అందుకే మత పరంగా ఈ స్థూపానికి ఎంతో మహత్యం ఉందని భక్తుల విశ్వాసం. అనునిత్యం ఇక్కడ ఎన్నో రకాల పూజలు చేస్తుంటారు. ముఖ్యంగా పౌర్ణమి రోజుల్లో విశేష పూజలు. బుద్ధజయంతి రోజు చెప్పక్కర్లేదు. మయన్మార్ కు వలస వెళ్లి రాజ్యాలు స్థాపించిన తెలుగు రాజులే స్వేడగాన్ పగోడాను నిర్మించారని అక్కడ చరిత్ర చెబుతోంది. ఎత్తైన కొండ మీద నిర్మించడం వల్ల యాంగాన్లో ఎక్కడ నుంచి చూసినా స్వేడగాన్ పగోడా కన్పించడం విశేషం. విదేశీ యాత్రికులే కాదు, దేశాధినేతలు వచ్చినా తప్పనిసరిగా దర్శించుకునే ప్రదేశం స్వేడగాన్ పగోడా.

శ్రీలంక, మయన్మార్ మతపరంగా బౌద్ధాన్ని అవలంబించే దేశాలు. మన పక్కనే ఉన్న నేపాల్ హిందూ దేశమైనప్పటికీ బౌద్ధ స్థూపాలను అత్యద్భుతంగా పరిరక్షిస్తున్నారు. దాంతో పాటు టూరిజాన్నీ పెంపొందించుకుంటున్నారు.

నేపాల్ రాజధాని ఖాట్మండూలో ఎంతో ప్రసిద్ధిచెందినవి స్వయంభునాథ్, బౌద్ధనాథ్ స్థూపాలు. ఇక్కడ స్థూపం పైన చతురస్రాకార ఆకారంలో చేసిన మండపానికి కళ్లూ ముక్కూ ఆకారంలో గీతలు గీసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతారు.

వీటన్నిటి కంటే భిన్నమైన కథ ఇండోనేషియాలో ఉంది. ఇండోనేషియా అధికారికంగా ఇస్లామిక్ దేశం. కానీ బుద్ధజయంతి నాడు నేషనల్ హాలీడే. ఈరోజుని అక్కడ వైశాక్‌గా జరుపు కుంటారు. జావాలోని బొరొబుదూర్ లో ప్రపంచంలోనే అతి పెద్ద రాతి స్థూపం ఉంది. ఓ కొండనంతా తొలచి స్థూపంగా మార్చారు. ఇక్కడ బుద్ధ జయంతి నాడు ఉత్సవాలు అంబరాన్నంటుతాయి. బొరొబుదూర్ తొమ్మిది అంతస్తుల స్థూపం. 118 మీటర్ల ఎత్తున్న స్థూపం ఇది. కింద నుంచి పై అంతస్థు వరకూ చేరాలంటే అయిదు



శ్రీలంకలోని అనూరాధపురంలోని స్థూపం



మయన్మార్‌లోని స్థూపం

గంటలు పడుతుందట. బుద్ధజయంతి రోజు బొరొబుదూర్‌కు 3 కిలోమీటర్ల దూరం నుంచే పెద్ద ఉత్సవంలా ప్రజలంతా కాలినడకన బయల్దేరుతారు, ముందు వరసంతా బౌద్ధభిక్షువులు ఉంటారు. దారి పొడవునా వాళ్లకి నీళ్లూ ఫలాలను అందించేవారు, నేలంతా నీరు చల్లి వారి కాళ్లకు ఉపశమనాన్ని కల్గించేవాళ్లు ఎందరో. బొరొబుదూర్ చేరుకున్న బౌద్ధ భిక్షువులు మంత్రోచ్చారణ చేస్తూ ఒక్కో అంతస్తూ దీపాలు వెలిగిస్తూ అర్ధరాత్రి సమయానికి శిఖరాగ్రాన్ని చేరుకుంటారు, ఆకాశంలోని నిండుచంద్రుడితో పోటీపడుతున్నట్టుగా నేల మీది బొరొబుదూర్ రాతి స్థూపం దీప కాంతిలో మెరిసిపోతుంటుంది, ఈ ఉత్సవానికి దేశాధ్యక్షుడు ముఖ్యఅతిధిగా విచ్చేయడం విశేషం.

**బొరొబుదూర్ కూ తెలుగు నేలతో దగ్గరి సంబంధం లేకపోలేదు. బొరొబుదూర్ నిర్మించిన రాజులు శైలేంద్ర వంశానికి చెందినవారు. వీళ్లు శ్రీశైలం నుంచి వలస వెళ్ళిన వారుగా చరిత్రకారులు తేల్చిచెప్పారు, బొరొబుదూర్ స్థూపం మీదంతా రాతి ఫలకాలపై బుద్ధుడి జాతక కథలను తీర్చిదిద్దారు. ఆ ఫలకాలపై బుద్ధుడితో పాటు సుధన అనే యువకుడి జీవితం గురించిన కథలు కూడా ఉన్నాయి. తన జీవితకాలంలో 52 గురువులను కలుసుకుని సుధనకుమారుడు జ్ఞానసిద్ధిని పొందాడని గండవ్యూహ అనే మహాయాన బౌద్ధ గ్రంథం తెలియజేస్తోంది. ఈ కథలన్నిటినీ బొరొబుదూర్ లో రాతిఫలకాలలో చూడవచ్చు. ధాన్యకటకానికి చెందిన వ్యాపారి కొడుకు సుధనుడు అని గండవ్యూహంలో పేర్కొనడం విశేషం. ధాన్యకటకానికి మరో పేరు అమరావతి అన్నది మనందరికీ తెలిసిందే. బొరొబుదూర్‌ను 9వ శతాబ్దిలో నిర్మించారు.**

ఇలా తెలుగు నేల నుంచి ఆగ్నేయాసియా, తూర్పు ఆసియా దేశాలకు వ్యాప్తి చెందిన బౌద్ధ శిల్పాలు, బౌద్ధ స్థూపాలు ఎన్నో. హిందూ దేశమైనా బౌద్ధ దేశమైనా ఇస్లామిక్ దేశమైనా కూడా తమ చరిత్రకు ప్రాధాన్యం ఇస్తున్నారు. చారిత్రక కట్టడాలను, వాటితో ముడి వేసుకున్న మత విశ్వాసాలను గౌరవిస్తున్నాయి. తమ పూర్వికుల వారసత్వ సంపదగా పదిలపర్చుకుంటున్నాయి. ఈ దేశాలన్నిటికీ ఆనాడు చుక్కానిగా నిలచింది అమరావతి. మతపరంగా, నిర్మాణపరంగా, శిల్పపరంగా, రాజ్యపరంగా మార్గ నిర్దేశం చేసింది. స్ఫూర్తిగా నిలచింది. ఆయా దేశాలు నేడు మన అమరావతిని చూస్తే ఏమనుకుంటాయి?! వైభవం అంతా గతమేనా ... రాబోయే కాలాలు ఘనకీర్తిని పునరు జ్జీవింపచేస్తాయా... వేచి చూడాల్సిందే.

---

(...29వ పుట తరువాయి)

పరిధికి మించిన విషయం. ఇందుకు అవసరమైన తెలుగు రచనలు, అనువాదాలు యిప్పుడు లభిస్తున్నాయి.

సంక్షిప్తంగా చెప్పాలంటే, సుదీర్ఘకాలం అవిద్యలో కొనసాగి సంఖతమైన (conditioned) మనసును యథాతథంగా అర్థంచేసుకోటానికి, ఆ సంఖతస్థితి నుండి మనసును విముక్తి చెయ్యటానికి క్రమబద్ధమైన అభ్యాసం తప్పదని బుద్ధుడు చెప్పటానికి, పైన పేర్కొన్న మనోవిశ్లేషణే కారణం. సశాస్త్రీయమైన యీ మనోవిశ్లేషణ ఆధారంగానే బుద్ధుని చిత్తభావనా అభ్యాసం లేక ధ్యానపద్ధతి రూపొందించబడింది. బుద్ధునికంటే ముందు, మానవ జీవితం గురించి యింతటి లోతైన, సమగ్రమైన విశ్లేషణ జరిగిన దాఖలాలు లేవనేది ప్రముఖ పండితుల అభిప్రాయం. అటుతరువాత గడచిన 2,550 సంవత్సరాల చరిత్రలో కూడా, యింతకంటే మెరుగైన మనోవిశ్లేషణ వెలుగుచూడలేదని చెప్పటం అతిశయోక్తి కాదు.

ఇటువంటి సమగ్రమైన, సశాస్త్రీయమైన మనోవిజ్ఞాన ఆవిష్కరణపై ఆధారపడి, అత్యంత ప్రభావశీలమైన మరియు ఆచరణాత్మకమైన చిత్తభావనా అభ్యాసాన్ని బుద్ధుడు బోధించాడు. ఈ విధానం బుద్ధవచనంలోని సతిపట్ఠాన సుత్తం మరియు ఆనాపానసతి సుత్తంలో వివరించబడింది. బుద్ధుడు బోధించిన ధ్యానంలో-శ్వాసను గమనించే అభ్యాసం కీలకమైనదని వేరుగా చెప్పనవసరం లేదు. అనునిత్యం మనిషి పొందే సహజ అనుభవంలో దీనికి సంబంధించిన మూలాలను మనం చూడవచ్చు. ఉదాహరణకు, మనం ఆవేశానికి, కోపానికి లేదా ఆందోళనకు గురైనప్పుడు, అప్రయత్నంగానే మన శ్వాస ఒడిదుడుకులకు లోనవుతుంది, వేగం పుంజుకుంటుంది. నిజానికి, శ్వాస ద్వారా శరీరం, తద్వారా మనసు పూర్వపు నిలకడ స్థితిని పొందటానికి చేసే ప్రయత్నమే యిది. ఈ సరళమైన ప్రకృతి సూత్రాన్ని జీవితపు అనుభావాలన్నిటికి ప్రయత్నపూర్వకంగా అన్వయించే ప్రభావశీలమైన అభ్యాసమే బుద్ధుడు సూచించిన చిత్తభావనా అభ్యాసం.




# 1. మచ్చుతునక

**స్వ**చ్ఛమైన నీటిని తేర్చాల్సిన పనిలేదు. వార్చాల్సిన పనీ లేదు. అలాగే....

ఒక స్పష్టత ఉన్న వ్యక్తి ఒక విషయాన్ని చెప్పాడంటే అదీ అంతే స్పష్టతగా ఉంటుంది.

ఒక స్వచ్ఛమైన హృదయం కలవాడు ఒక మాట పలికాడంటే అందులోనూ అంతే స్వచ్ఛత తొణికిసలాడుతుంది.

ఒక శాస్త్రీయవాది ఒక సిద్ధాంతాన్ని ప్రకటించాడంటే ..... అందులోనూ అంతే శాస్త్రీయత అడుగడుగునా అగుపిస్తుంది.

బుద్ధుడు చెప్పిన బౌద్ధధర్మం కూడా అంత స్వచ్ఛమైందే. స్పష్టమైందే. శాస్త్రీయమైందే.

శాస్త్రీయత అంటే హేతువుకి నిలబడేది. పంచేంద్రియ జ్ఞానాలకి అందేది . నమ్మకాలమీద నిలబడేది కాదు.

ఎక్కడైనా, ఎప్పుడైనా, ఎవరికైనా ఋజువుగా నిలబడే సత్యం ఏదైతే ఉందో...ఏదైతే ఉంటుందో అదే శాస్త్రీయం. ఊహలకి, కల్పనలకి, అనుకోడాలకీ ఆస్కారాలు లేనిది.

దీన్నే మనం ఈరోజున విజ్ఞానశాస్త్రం లేదా సైన్సు అంటున్నాం.

ఋజువులకి అందనిది ఏదీ శాస్త్రీయం కాదు.

అసలైన జ్ఞానం అంటే ఏమిటో బుద్ధుడు చెప్పిన ఒక సంఘటన చూద్దాం.

**ఎవరు చెప్పింది నిజం? ఏది సరైన జ్ఞానం?**

ఒకసారి బుద్ధుడు కోసలదేశంలో కాలాములు అనేవారు నివసించే కేశముత్తం అనే గ్రామానికి వెళ్ళాడు. ఆ గ్రామం పెద్ద వ్యాపారకేంద్రం. అక్కడి పెద్దలు బుద్ధుని ప్రబోధం వినడానికి వచ్చి–

"భగవాన్! ఇక్కడికి అనేకమంది శ్రమణులు, బ్రాహ్మణులు వస్తూ ఉంటారు. ప్రతివారు వారివారి సిద్ధాంతాల్ని ప్రభోధిస్తారు. తమ సిద్ధాంతాలే గొప్పవంటారు. మిగిలిన సిద్ధాంతాల్ని విమర్శిస్తారు. నిందిస్తారు. తిట్టిపోస్తారు. తిరస్కరిస్తారు. ఛీకొడతారు. ప్రతివాళ్ళు ఇలానే చేస్తూ ఉంటారు. వీటిలో దేన్ని నమ్మాలో మాకు పాలుపోవడం లేదు. అంతా గందరగోళంగా ఉంది. వీటిలో ఏది సరైనదో మేము ఎలా తేల్చుకోగలం?" అని అడిగారు.

అప్పుడు బుద్ధుడు...

"కాలాములారా! మీకు నిజంగా ఏ విషయంలో సందేహం కలగాలో ఆ విషయంలోనే కలిగింది. మంచిది. ఎవరో చెప్పిన మాటలు వినడంవల్ల, వాటిని నమ్మడం వల్ల కలిగేదాన్ని "జ్ఞానం" అనరు. జ్ఞానం అనేది సొంత అనుభవం వల్ల ప్రత్యక్షంగా కలిగే సాక్షాత్కారం. ఏ విషయాన్నైనా సరే 'ఇది మన సంప్రదాయంగా వస్తుంది కాబట్టి నమ్మాలి' అని నమ్మకండి. 'ఇది ఎన్నో తరాలుగా గురుపరంపరగా ఉపదేశించబడుతోంది కాబట్టి నమ్మితీరాలి' అని నమ్మకండి. 'ఇది చెప్పినవాడు గొప్పవాడు, గౌరవనీయుడు కాబట్టి విశ్వసించాలి' అని విశ్వసించకండి. 'ఈ విషయం ఒక గొప్ప గ్రంథంలో ఉంది, ఒక మత గ్రంథంలో ఉంది కాబట్టి ఒప్పుకోవాలి' అని ఒప్పుకోకండి. 'ఈ విషయం చెప్పినవాడు మహాజ్ఞాని, గొప్పవక్త, కంచుకంఠంతో అనర్గళంగా చెప్పాడు కాబట్టి' విశ్వసించకండి. 'ఈ విషయం చెప్పినవాడు అందగాడు, ఒడ్డు పొడుగు ఉన్నవాడు కాబట్టి నమ్మాలి' అని నమ్మకండి. ఆమోదించకండి. జ్ఞానం అనేది మీకు మీరు మీ జీవితానుభవాల నుండి నిగ్గు తేల్చుకోవల్సిన అంశం" అన్నాడు.

అప్పుడు వారు–

"ఐతే, భగవాన్! మరి మీరు చెప్పిన సందేశాలు?" అని అడిగారు.

"నేను చెప్పినా... అది మీ జీవిత అనుభవానికి అందకపోతే విశ్వసించకండి. మీ అనుభవానికి అందేదే జ్ఞానం" అని చెప్పాడు.

ఈ రోజుల్లో ఇలా అనుభవానికి అందేదాన్ని 'సైన్సు' అంటాం. అందని దాన్ని 'నమ్మకం'అంటాం. బౌద్ధంగానీ, బుద్ధప్రబోధాలు కానీ నమ్మకాలు కాదు. నిజాలు. వైజ్ఞానిక అంశాలే.

ఈమధ్య ఒక బి.బి.సి విలేఖరి దలైలామాను ఇలా అడిగాడు–

"మీరుచెప్పే బౌద్ధంలో కొన్ని విషయాలు ఆధునిక సైన్సు నిరూపణకు రావు. వాటి విషయంలో మీ అభిప్రాయం?" అని–

"అలాంటివి ఉంటే సరిదిద్దుకుంటాం, మార్చుకుంటాం" అన్నాడు.

అంటే....

బౌద్ధం నమ్మకం కాదు.

మూఢనమ్మకమూ కాదు.

పిడివాదం అంతకంటే కాదు. శాస్త్రీయం. కాబట్టి దానిలో చెప్పే భౌతిక విషయాలైనా, నైతిక విషయమైనా, సామాజిక విషయమైనా అది శాస్త్రీయంగానే ఉంటుంది.

**శాస్త్రీయ అష్టాంగ మార్గం:**

బుద్ధుడు చూపిన మార్గం అష్టాంగమార్గం. దానిలో ఎనిమిది అంశాలు ఉన్నాయి. ఈ ఎనిమిది అంశాల్ని అందుకుంటూ నడిచే వ్యక్తి పరిపూర్ణుడవుతాడు. ఈ ఎనిమిది అంశాల్ని బుద్ధుడు ప్రధానంగా మూడు భాగాలుగా విభజించాడు.

ఒకటి : ప్రజ్ఞ (జ్ఞానం)

రెండు : శీలం (నైతికత)

మూడు: ధ్యానం (ఏకాగ్రత)

ఈ మూడూ సాధించినవాడు సర్వజ్ఞుడు కాగలడు. బౌద్ధం అంతిమ లక్ష్యం అయిన నిర్వాణపథాన్ని చేరుకోగలడు.

అంటే .....

ప్రజ్ఞ లేకపోతే....జ్ఞాని కాలేడు. మానవుడే కాలేడు. ప్రజ్ఞ అనేది మనిషికి మొదటి సోపానం.

మనం ఏది ఆలోచించినా, ఏ నిర్ణయం తీసుకున్నా కేవలం నమ్మకాలపై ఆధారపడి నిర్ణయం తీసుకోకూడదు. శాస్త్రీయ దృష్టితోనే, నిజం వెలుగులోనే ఆలోచించాలి. ఆ ఆలోచనలతోనే అడుగులు ముందుకు వేయాలి.

ప్రకృతి నియమాలకి భిన్నంగా ఈ విశ్వంలో ఏదీ జరగదు. ప్రతి పనికీ ఒక నిర్దిష్ట కారణం ఉంటుంది. లేదా అనేక కారణాలు ఉంటాయి. కార్యకారణ సంబంధం లేకుండా అనంతసృష్టిలో ఆవగింజంతైన పని ఏదీ జరగదు.

కార్యకారణ సిద్ధాంతం మీద రూపొందిన బౌద్ధంలో నమ్మకాలకీ, ఊహలకీ ఆస్కారం లేదు. ఒకవేళ కాలాంతరంలో అలాంటివి వచ్చి చేరి ఉంటే... అది బౌద్ధ దృక్పథం కాదు.

స్వచ్ఛమైన నదీప్రవాహంలో అప్పుడప్పుడూ వచ్చి కలిసే మలినాలుగానే వాటిని భావించాలి. శాస్త్రీయతకి విరుద్ధమైన అంశాలేవీ నిజమైన బౌద్ధంలో ఉండవు. అవి బుద్ధుడు చెప్పినవీ కావు.

ఎందుకంటే... బుద్ధుడు అశాస్త్రీయవాది కాదు.

నూటికి నూరుపాళ్ళూ నిఖార్సయిన శాస్త్రీయవాది.

అతి చిన్న విషయాన్ని కూడా – అది భౌతిక విషయమైనా, నైతిక విషయమైనా, సామాజిక విషయమైనా ఏదైనా సరే దాన్ని శాస్త్రీయ దృక్పథంలోనే చూస్తాడు. చేస్తాడు. చెప్తాడు. వ్యాఖ్యానిస్తాడు.

ఇలాంటి ఒక సంఘటన చూద్దాం. ఇది చాలా చిన్న సంఘటనే. అయినా దానిలో ఆయన చూపించిన శాస్త్రీయ దృక్పథం స్పష్టంగా కనిపిస్తుంది.

ఒకనాడేమయ్యిందంటే ...

**గర్భిణికి వైద్య పరీక్షలు:**

రాజగృహ నగరంలో ఒక ధనిక వ్యాపారి ఉన్నాడు. అతనికి ఒక అందమైన కూతురుంది. ఆమెకి చిన్నప్పటినుండి 'భిక్షుణి' కావాలనే కోర్కె బలంగా ఉండేది. యుక్తవయస్సుకు వచ్చాక కూడా ఆ కోర్కె సడలలేదు.

"నేను సన్యసిస్తాను. భిక్షుణిగా మారతాను" అని తల్లిదండ్రులకి చెప్పింది. కానీ వారు ఒప్పుకోలేదు. ఆలస్యం చేయకుండా పెళ్ళి చేసేశారు.

ఆమె అత్తగారింటికి వెళ్ళింది భర్త, అత్తమామల ప్రేమలు పొందింది. కానీ ఆమెమనస్సులోని 'భిక్షుణీ కావాలన్న కోర్కె' మాత్రం తొలగిపోలేదు.

ఒక వసంతోత్సవం రోజున నగరమంతా అలంకరించారు. ప్రతివారు అనేక రకాల ఆభరణాలు దరించారు. ఉల్లాసంతో ఉన్నారు. కానీ, ఈమె మాత్రం దిగాలుగా ఒక గది మూలన కూర్చొంది.

అది గమనించిన ఆమె భర్త ఆమె దగ్గరకు వెళ్ళి,

"ఎందుకిలా దిగులుగా ఉన్నావు?" అని అడిగాడు.

ఆమె చిన్ననాటినుండి 'భిక్షుణిగా మారాలి' అని తనలో ఉన్న కోర్కెను తెలిపింది.

"నా తల్లిదండ్రులు నా మాట వినలేదు. మీరైనా నా మాటవిని, నాకు ఈ సంసారబంధం నుండి విముక్తి కలిగించండి. నాకు భిక్షుణిగా మారడానికి అనుమతి ఇవ్వండి" అని ప్రాధేయపడింది.

ఆమె అభిప్రాయాన్ని గౌరవించిన భర్త మరునాడే ఆమెను



భిక్షు సంఘానికి పంపాలని నిర్ణయించుకున్నాడు.

అప్పటికే బుద్ధుని బౌద్ధసంఘంలోనుండి చీలి, బైటకు వచ్చిన దేవదత్తుడు గయలో కొత్త భిక్షుసంఘాన్ని ఏర్పాటు చేశాడు.

ఆ భార్యాభర్తలిద్దరూ చర్చించుకొని, కొందరి సలహాతో దేవదత్తుని నాయకత్వంలో నడిచే భిక్షుసంఘంలో చేరాలని నిశ్చయించుకొన్నారు. ఆమె అలావెళ్ళి దేవదత్తుని భిక్షుసంఘంలో చేరింది.

ఆమె అప్పటికే గర్భం దాల్చింది. ఆ విషయం ఆమెకప్పటికి తెలియదు.

ఆ సంఘంలో చేరాక రెండు నెలలకి ఆమె గర్భం విషయం బైటపడింది. వెంటనే భిక్షుణీసంఘం ఆమెపై నిందారోపణలు చేసి దేవదత్తుని దగ్గరకు తీసుకుపోయారు

దేవదత్తుడు కోపించి,"సంఘంలో చేరి, అక్రమంగా కామకలాపాలు సాగిస్తున్నావా? నీలాంటివాళ్ళు నా సంఘంలో ఉండకూడదు" అన్నాడు.

" నాకే పాపమూ తెలియదు. ఇక్కడికి వచ్చాక ఎలాంటి తప్పిదం చేయలేదు" అని వేడుకొంది.

"తప్పుచేసింది కాక, కప్పిపుచ్చుకొంటున్నావా? నీలాంటి వారుంటే సంఘానికే ముప్పు" అని కోపించి, ఆమెను తన సంఘం నుండి వెలేశాడు.

ఆమె దీనంగా బైటకు వచ్చి, ఏమి చేయాలో తోచక బాధపడింది.

"బాధపడకమ్మా! బుద్ధుడు ఇప్పుడు జేతవనంలో ఉన్నారు. నీవు బుద్ధుని దగ్గరకు వెళ్ళి ఆయన సంఘంలో చేరు" అని చెప్పారు కొందరు.

వారి మాటలమీద ఆమె 40 యోజనాలు (320 కిలోమీటర్లు) దూరం నడిచి బుద్ధుని దగ్గరకు వెళ్ళింది.

విషయం చెప్పింది.

అప్పుడు బుద్ధుడు ఆమెను సముదాయించి ఆ రాత్రి అక్కడ ఉంచాడు. మరునాడు సాయంత్రానికి కోసలరాజు ప్రసేనజిత్తుని, మహాదాత అనాథపిండకుని, బౌద్ధ ధార్మికురాలు మిగారమాతగా ప్రసిద్ధిపొందిన ఉపాసిక విశాఖను, మహావైద్యుడు జీవకుణ్ణి పిలిపించాడు. బౌద్ధసంఘంలోని ప్రముఖుల సమక్షంలో సమావేశపరచి ఆ గర్భిణీ భిక్షువుని పిలిపించాడు. వైద్యశాస్త్ర పారంగతులైన ఇద్దరు భిక్షుణీలను పిలిపించి, విశాఖతో...

"మిగారమాతా! నీవూ, ఈ భిక్షుణీలూ కలిసి జీవకుని సలహాతో ఈమెకు గర్భపరీక్షలు చేయండి. ఆమె ఎన్ని నెలల గర్భవతో తేల్చండి. ఈమెకు గర్భం దేవదత్తుని సంఘంలో చేరాక వచ్చిందా? అంతకు ముందు ఆమె భర్తవద్ద ఉన్నప్పుడే వచ్చిందా? తేల్చి చెప్పండి." అన్నాడు.

వారు ఆమెను ఒక గదిలోకి తీసుకుపోయి, పాదాలు, పొట్ట, నాభి ఇతర పరీక్షలు చేసి వచ్చి,

"భగవాన్! ఈమె భర్తవద్ద ఉన్నప్పుడే గర్భాన్ని ధరించింది" అని నెలలు, రోజులతోసహా చెప్పారు.

"నీవు భిక్షుణిగా ఉండటానికి అర్హురాలివే" అంటూ ఎంతో దయతో ఆమెను ఆదరించి, తన సంఘంలో చేర్చుకున్నాడు. "ఈమె ప్రసవించేదాకా, కావలసిన సేవలన్నీ మీరే చేయండి" అని ఆమెకు సహాయకురాలిగా కొందరు భిక్షుణీలను నియమించాడు.

ఆమె మగబిడ్డను ప్రసవించింది. ఆ బిడ్డ బాధ్యతను కోసలరాజు ప్రసేనజిత్తు తీసుకున్నాడు. చేరదీసి పెంచాడు. ఆ బిడ్డే బౌద్ధసంఘంలో 'కుమార కాశ్యపునిగా' ఖ్యాతిగాంచాడు.

ఒకవ్యక్తి అపరాధా? నిరపరాధా? అని తేల్చాల్సింది శాస్త్రీయ విధానాలే తప్ప, ఊహలు, చెప్పుడు మాటలు కావు.

పై విషయంలో మూడు శాస్త్రీయ కోణాలు ఉన్నాయి.

ఒకటి : ఆమె గర్భం ధరించిన కాలాన్ని లెక్కించి పరిగణించడం. శాస్త్రీయ విధానాలతో ఆమె గర్భం ధరించిన కాలాన్ని లెక్కించి, నిర్ణయం తీసుకోవడం. ఈనాడు మనం రక్త పరీక్షలు, డి.ఎన్.ఎ. పరీక్షలు, స్కానింగ్‌లు చేయించి, వైద్యుల నివేదికల్ని తీసుకొంటూ నిజానిజాల్ని తేలుస్తున్నాం.

ఇది వైజ్ఞానిక అంశం.

రెండు : జీవకునిలాంటి మహావైద్యుడు ఉన్నప్పటికీ ... అతని సలహాతో ఆమెకు స్త్రీలచేతే పరీక్షలు చేయించడం.

ఇది నైతిక అంశం.

మూడు: తాను ఒక్కడే నిర్ణయం తీసుకోకుండా సంఘం, ఇతర బౌద్ధ పోషకుల సమక్షంలో నిర్ణయం తీసుకోవడం.

ఇది సామాజిక, ప్రజాస్వామిక అంశం.

నేరనిరూపణలో ఇన్ని అంశాల్ని పరిగణనలోకి తీసుకోవడం అనేది శాస్త్రీయ దృక్పథం.

బుద్ధుని ఆచరణ శాస్త్రీయం అని చెప్పడానికి ఇదొక మచ్చుతునక మాత్రమే.

ఇలాంటివి ఎన్నో ఉన్నాయి.

**ప్రజలకి చెప్పాలా? వద్దా?**

**29వ ఏట ఇల్లు విడిచిన సిద్ధార్థుడు ఆరు సంవత్సరాలు అన్వేషించి, తన 35వ ఏట జ్ఞానాన్ని పొంది బుద్ధుడయ్యాడు. ఆ తర్వాత నలభై ఐదేళ్ళ తన సుదీర్ఘ ప్రస్థానంలో నిరంతరం జనం మధ్య తిరుగుతూ ఎన్నెన్నో ధర్మ ప్రబోధాలు చేశాడు. ఆయన చేసిన ప్రతి ప్రబోధం మనిషిని, మనసుని అన్నిరకాల బానిసత్వాలనుండి బైట పడేసిందేతప్ప మూఢనమ్మకాలవైపు ఒక్క తప్పటడుగు కూడా వేయించలేదు. దేవుడు, దయ్యం, ఆత్మ, పరమాత్మ, అతీత శక్తులు, మూఢనమ్మకాలను కలిగించే కుయుక్తులు - ఇలాంటి అశాస్త్రీయ అంశాలకి ఆయన ప్రబోధాల్లో చోటులేదు.**

ఆయన చెప్పిన ధర్మ ప్రబోధాలు 2500 సంవత్సరాలు దాటినా వాటిలో దాదాపుగా... ఏ ఒకటో రెండో తప్ప ..మిగిలినవన్నీ ఈ నాటికీ ప్రామాణికాలుగా, శాస్త్రీయంగా నిలబడే ఉన్నాయి.

అసలు తాను కనుగొన్న జ్ఞానమార్గం ప్రజలకి చెప్పాలా? వద్దా? చెప్తే అర్థం చేసుకోగలరా? లేదా? గంభీరమైన ఈ ధర్మాన్ని అర్థం అయ్యేట్టు చెప్పడం ఎలా? అనే సంశయం బుద్ధునికే కలిగింది. చెప్తే ఎలా చెప్పాలి? అని ఆలోచించుకున్నాడు. ఆలోచనలోంచే దానికీ ఒక శాస్త్రీయ మార్గాన్ని ఎంచుకున్నాడు.

అది వచ్చే సంచికలో చూద్దాం.

తెలంగాణ వారసత్వ సంపద

# తెలంగాణా పురావస్తు వారసత్వ సంపదల పరిరక్షణ చట్టం 2017 ను పటిష్టం చెయ్యాలి

-సంకేపల్లి నాగేంద్రశర్మ
9441797650.

**తె**లంగాణా చారిత్రిక వారసత్వసంపద పరిరక్షణకై పాలకుల తోపాటు, చరిత్రకారులు, మేధావులు, రచయితలు, సాహితీవేత్తలు, ఎన్జీవోలు ముందుకు రావాలి. అన్నీ ప్రభుత్వంపైనే నెట్టివేయ కుండా, ఈచారిత్రిక సంపదల పరిరక్షణ మరియు స్థలాలు అన్యా క్రాంతం, దుర్వినియోగం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై వుంది. శిథిల దశలో వున్న కట్టడాలు, దేవాలయాలు, కోటలు, ఖిల్లాలు, గడీలు, వక్ఫ్ ఆస్తులు, మసీదులు, దర్గాలు, చర్చీలు, పాత భవనాల వరిరక్షణ విషయమై కూలంకషంగా చర్చించి ఆచరణాత్మక విధానాలను అవలంబించాలి. చారిత్రిక, పురావస్తు ప్రాధాన్యం కలిగివున్న అంశాల జాబితాను, పునఃసమీక్ష చేసి, వాటి పరిరక్షణకు తగిన కృషి జరగాల్సి వుంది. 2014లో ఉమ్మడి రాష్ట్ర విభజన తర్వాత వేరైన రెండు రాష్ట్రాలలో కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని ఆర్కియాలోజికల్ సర్వే ఆఫ్ ఇండియా నంస్థ తమ విభాగాలను రెండు రాష్ట్రాలలో విడివిడిగా ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. అంతేకాకుండా తెలంగాణ ప్రభుత్వం ఈనెల ఏప్రిల్ 16 న ప్రత్యేక అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేసి, తెలంగాణాలో వారసత్వ సంపద పరిరక్షణ, 2017 చట్టాన్ని తెచ్చే బిల్లును ఏకగ్రీ వంగా ఆమోదించింది. గత ఉమ్మడి రాష్ట్రంలోని వారసత్వ, పురావ స్తు పరిరక్షణ చట్టాలు కాలానుగుణంగా లేవని, పాత చట్టం వల్ల ప్రయోజనంలేదని, ప్రాచీన శిథిల భవనాల్ని తొలగించి కొత్తవి కట్టడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ ఆటంకాలను అధిగమించడానికి సరికొత్తగా కాలానుగుణ చట్టం తయారు చేసి నట్లు, త్వరలోనే నిపుణులు, ప్రతిపక్ష నేతలు, శాసనసభ్యులతో ఒక సమావేశం ఏర్పాటు చేసి, ఈచట్టం నియమ నిబంధనల్ని నిష్పాక్షికంగా రూపొందిస్తామని ముఖ్యమంత్రి కెసీఆర్ బిల్లు ప్రవేశ పెట్టిన నందర్భంగా జరిగిన చర్చకు నమాధానంగా చెప్పారు. హైదరాబాదులోని గోలకొండ కోటలో స్వాతంత్ర్యోత్సవానికై పురావస్తుశాఖ వారి పూర్వానుమతులు, అలాగే ఇటీవల జరిగిన కృష్ణాపుష్కరాల సందర్భంగా, పూర్వ మహబూబ్‌నగర్ జిల్లా అలంపురంలోని జోగులాంబ-బ్రహ్మగుడులకు మరమ్మత్తులు చేయించాలంటే, పురావస్తుశాఖ నిబంధనలు ఆడ్డుపడ్డాయని, హైదరాబాద్‌లోని కొన్ని ప్రాచీన శిథిల కట్టడాలు నమస్యగా పరిణమించడం వల్ల నూతన చట్టం తేవడానికి కారణం అయిందని అన్నారు. ఆలాగే ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణాలోని వారసత్వ, చారిత్రిక సంపదలు కొంతమేరకు నిర్లక్ష్యం చేయబడ్డాయని, కేటాయించిన నిధుల వినియోగంలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలను ముఖ్యమంత్రి ప్రస్తావించారు. కొత్త చట్టానికి తగిన నిబంధనలు తేవడానికి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులతో పరిరక్షణ అంశాల ఎంపికలో మార్పులు, చేర్పులు, చట్టం అమలు, నిర్వహణ విషయంలో తీసుకోవాల్సిన అంశాలపై ఒక కమిటీ వేయబడుతుందని, ఇది తరచుగా సమావేశమవుతూ పరిస్థితుల్ని సమీక్షిస్తుందని అన్నారు. అలాగే జిల్లాలలో జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో ఉన్నతాధికారులతో పురావస్తు పరిరక్షణ కమిటీలు వేస్తామని, పకడ్బందీగా పురావస్తు పరిరక్షణ చర్యలు చేబడుతామని అన్నారు. కేవలం హైదరాబాద్ నగరంలోని రాచనగరి కట్టడాలను పరిరక్షించడమే కాకుండా, రాష్ట్ర మంతటికి ఈ చట్టం వర్తింపజేస్తామని ముఖ్యమంత్రి పేర్కొనడం ఆయనకు పురావస్తుశాఖపై వున్న ప్రత్యేక శ్రద్ధాశక్తులకు నిదర్శనం.

ప్రస్తుతం హైదరాబాదులోని ఆర్కియాలోజికల్ సర్వే ఆఫ్ ఇండియా సంస్థ 2017 జూన్ 1 నుండి ఆంధ్రరాజధాని అమరావతి కేంద్రంగా, తెలంగాణాకు హైదరాబాద్ కేంద్రంగా విడివిడిగా పనిచేస్తాయని కేంద్ర ఆర్కియాలోజి శాఖ తాజాగా ప్రకటించింది. ఉమ్మడి రాష్ట్రంలోని 342 మంది సిబ్బందిలో 88మందిని తెలంగాణాకి 254 మందిని ఆంధ్రప్రదేశ్‌కీ కేటాయిస్తున్నట్లు ఆశాఖ ప్రకటించింది. ఈరెండు రాష్ట్రాలకున్న 4కోట్ల వార్షిక బడ్జెట్‌ని రెండు రాష్ట్రాలకి దామాషా ప్రాతిపదికన పంచుతారు. వచ్చే సంవత్సరం నుండి రెండు తెలుగు రాష్ట్రాలకు వేర్వేరుగా కేంద్ర బడ్జెట్‌లో కెటాయింపులు జరుగుతాయి. ఎపిలో 128 కట్టడాలు, తెలంగాణాలో 8 కట్టడాల పరిరక్షణకు ఈనూతన విభజన సంస్థలు కృషి చేస్తాయి. గతంలోనే ఈ కట్టడాలు గుర్తింపబడ్డాయి. తెలంగాణాలోని గోలకొండకోట, చార్మినార్, వరంగల్ కోట, రామప్పగుడి, వేయిస్తంభాల గుడి, గద్వాల జిల్లాలోని అలంపురం దేవాలయం, నూతన సంగారెడ్డి జిల్లా కొండాపూర్లోని శాతవాహనుల స్థావరంలోని పురావస్తుశాఖ మ్యూజియం వంటి వాటి పరిరక్షణ హైదరాబాద్ కేంద్ర ఆర్కియాలోజి సంస్థ పరిధిలోవుంది. ఇవే కాక, తెలంగాణాలోని ఎన్నో ప్రాచీన చారిత్రిక కట్టడాలు కేంద్ర ఆర్కియాలోజీ శాఖ వారి పరిధిలోకి చేర్చాల్సివుంది. గద్వాల, వనపర్తి నంస్థానాల చిహ్నాలు, కోటల్ని అభివృద్ధి చేయాల్సివుంది. మెదక్, భువనగిరి, దేవరకొండ కోటల్ని బాగుచేయించాలి. వీటిని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర పురావస్తు, టూరిజం శాఖల మంత్రిత్వశాఖల దృష్టికి తీసుకొనివెళ్ళాల్సివుంది. తగిన స్థాయిలో ప్రాతినిధ్యపు కసరత్తులు ఎప్పటికప్పుడు జరపాల్సి వుంటుంది.

క్రిష్ణాతీరంలోని నాగార్జునసాగర్ నందికొండ మ్యూజియం (ఎఎన్ఐ)పరిధి ఆంధ్రలోకి చేరిపోయింది. ఇక్కడ తెలంగాణా రాష్ట్ర ఆధ్వర్యంలో బుద్ధవనం ప్రాజెక్టు నిర్మాణాలు సుమారు వందకోట్లతో ఊపందుకున్నాయి. ఆగిపోయిన మ్యూజియాన్ని తెరవాల్సి వుంది. పాత పది జిల్లాల పరిధిలోకాకుండా, కొత్తగా ఏర్పాటైన 21 జిల్లాలలో పురావస్తు, టూరిజం జిల్లా శాఖ కార్యాలయాలను ప్రత్యేకంగా ప్రారంభించాల్చి వుంటుంది. ఆదిలాబాద్, నిర్మల్, భూపాలపల్లి, ఆసిఫాబాద్, మంచిర్యాల, సిరిసిల్ల రాజన్న, పెద్దపల్లి, సిద్ధిపేట, వనపర్తి,

మెదక్, గద్వాల, జగిత్యాల, మేడ్చల్, సూర్యాపేట, సంగారెడ్డి, జనగామ తదితర జిల్లా కేంద్రాలలో పురావస్తుశాఖ వారి జిల్లా శాఖ కార్యాలయాల ఏర్పాటుతోపాటు, సంబంధిత మ్యూజియంలను ఏర్పాటు చేయాల్సి వుంటుంది. ఇందులకు ఆయా ప్రాంతాలలో వున్న యూనివర్సిటీలు, ఉన్నత విద్యాసంస్థలు, దేవాదాయ, బిసి, గిరిజన, మైనారిటీ వక్ఫ్ శాఖలు, రెవిన్యూ, విద్య, పౌరసంబంధాలు, భారీనీటిపారుదల, పంచాయతీరాజ్, అటవీ, మైనింగ్, విద్యుత్, పోలీస్ శాఖలు జిల్లా కేంద్రాలలోని పురావస్తుశాఖలతో అనుసంధానమై కలిసి పనిచేసే ప్రణాళికను రూపొందించాల్సి వుంటుంది. గ్రంథాలయ సంస్థ, సినిమా–ఫొటోగ్రఫీ, టూరిజం మంత్రిత్వశాఖలు, సంబంధిత కార్పోరేషన్లు, కాకతీయ మిషన్, భగీరథ మిషన్ వంటి విభాగాలు సైతం పురావస్తు, టూరిజం ప్రాథమ్యాలను గుర్తించి చేయూత నివ్వాల్సి వుండేలా నిబంధనల్ని చేర్చాల్సి వుంటుంది. వివిధశాఖల భాగస్వామ్యంతో టూరిజం, పురావస్తుశాఖల ప్రగతి వెల్లివిరుస్తుంది. ప్రస్తుతం రాష్ట్రంలో వరంగల్, కరీంనగర్, మహబూబ్నగర్ పాతజిల్లాలలో మూడుచోట్ల పురావస్తుశాఖ వారి అసిస్టెంట్ డైరక్టరేట్ కార్యాలయాలు పనిచేస్తున్నాయి. హైదరాబాద్లోని గన్ ఫౌండ్రీలో పురావస్తుశాఖ వారి సంచాలకుల ప్రధాన కార్యాలయం పనిచేస్తున్నది. పబ్లిక్ గార్డెన్స్, బిర్లాటెంపుల్, సాలార్ జంగ్ వంటి మ్యూజియములు హైదరాబాద్లో వున్నవి. సంగారెడ్డిలో కొత్తగా జైల్ మ్యూజియం ఏర్పాటవుతున్నది. 3 చోట్ల వున్న పాత అసిస్టెంట్ డైరెక్టరేట్లు ఇలాగే కొనసాగించడమే కాకుండా, జిల్లాకొక పురావస్తు, టూరిజం శాఖల కార్యాలయాలను రాష్ట్రప్రభుత్వం ప్రారంభించాల్సి వుంటుంది. వీటిని సంయుక్తంగా కలిసి ప్రారంభించడం వల్ల ఖర్చులు కూడా ఆదా అవుతాయన్న భావనలున్నాయి.

పురావస్తుశాఖ ఆస్తులకు టూరిజం శాఖ సొగసులు అద్దితే, టూరిజం శాఖ వల్ల అభివృద్ధి పనులు జరిగి, పర్యాటకుల రాకపోకలు పెరగడం వల్ల, పురావస్తుప్రాధాన్యం, టూరిజం ఆదాయాలు కలిసి వస్తాయి. ప్రతిఏటా కాలానుగుణంగా పురావస్తు, టూరిజం విధానం పక్కాగా ఖరారుచేయాల్సి వుంటుంది. ప్రభుత్వ, ప్రయివేట్, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం వుండేలా ప్రణాళికల్ని తీర్చిదిద్దాల్సి వుంటుంది. ఇవన్నింటిని మిళితం చేస్తూ, కొత్తగా వచ్చే చట్టాన్ని సమగ్రంగా తీర్చి దిద్దాలి. తెలంగాణా సాంస్కృతిక విధాన రూపకల్పనలో పురావస్తు అంశాల భూమికను నిర్లక్ష్యం చేయరాదు. మెదక్లోని ప్రాచీన చర్చి, పాత ఆదిలాబాద్ జిల్లాలోని గోండ్వానా గిరిజన సంస్కృతి, పొచ్చెర, కుంతల జలపాతాలు, ఖమ్మం జిల్లా జలపాతాలు, జోడేఘాట్ కొమ్రం భీం స్మృతి వనం ఏర్పాటు, వేములవాడ చాళుక్యుల శాసనాలతో సైట్ మ్యూజియం ఎర్పాటు, కోటిలింగాల శాతవాహనుల స్థావరాలలో సైట్ మ్యూజియం, కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీలో బౌద్ధ అధ్యయన కేంద్రం, వరంగల్లో కాకతీయ పురావస్తు సంపదల సమగ్ర పాజెక్టు, అధ్యయనం, మహబూబ్నగర్లో చెంచు అధ్యయన విభాగం వంటివి ఏర్పాటు చేయాల్సివుంటుంది. యాదాద్రి సమీపంలోని కొలనుపాక జైన కేంద్రాన్ని జైన అధ్యయన కేంద్రంగా అభివృద్ధి చేయాల్సి వుంది. ఇక్కడి పురావస్తు శాఖ వారి మ్యూజియాన్ని తాజాగా అభివృద్ధి చేయాల్సి వుంది. ప్రస్తుతం హైదరాబాద్లో గిరిజనశాఖ వారి ట్రైబల్ మ్యూజియం వుంది. వరంగల్ జిల్లాలోని లక్నవరం వంటి చెరువుల అభివృద్ధి ఊయాల వంతెనల ఏర్పాటుతో పర్యాటక సొగసులతో కళకళలాడుతున్నది. రామప్ప, ఘనపురం శిథిల గుడులను పునరుద్ధరించాల్సివుంది. రాష్ట్రంలోని కాకతీయ మిషన్ కింద చేబడుతున్న చెరువుల అభివృద్ధి పనులలో భాగంగా, ట్యాంకు బండ్లను విహార కేంద్రాలుగా తీర్చిదిద్దే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం వుంది. స్మాట్, అమృత్ వంటి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖల నిధులు కూడా పురావస్తు అంశాల ప్రాధమ్యాన్ని చెప్పకనే చెబుతాయి. అలాగే కరీంనగర్ మానేర్రివర్ ఫ్రంట్ కూడా గుజరాత్లోని సూరత్ లాగా అభివృద్ధి చేయడానికి నిధుల కేటాయింపులు జరిగాయి. ఇటీవల 195కిలోమీటర్ల కరీంనగర్–నిజామాబాద్ రైల్వేలైన్ ప్రారంభం కావడం, గోదావరి నదిపై బృహత్ వంతెనల నిర్మాణం పూర్తికావస్తుండటం కూడా శుభసూచకాలే. 50కోట్లతో ఆదిలాబాద్ కరీంనగర్లను కలిపే రాయపట్నం బ్రిడ్జి గత సంవత్సరం ప్రారంభమైంది. కాళేశ్వరం–సిరివంచె (మహారాష్ట్ర)ను కలిపే నూతన మూడు వంతెనల్లో ఒకటి ఇటీవల ప్రారంభమైంది. మిగతా రెండు నిర్మాణాలు పూర్తయితే, గోదావరి నది గుండా మహారాష్ట్ర, ఛత్తీస్గడ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలతో దగ్గరి రవాణా సంబంధాలు మెరుగవుతాయి. ఇందువల్ల టూరిజం, పురావస్తుశాఖల ప్రగతి ఒక దారిలో పడే వీలుంది. కాళేశ్వరం, మేడిగడ్డ చనాకా–కొరటా, సుందిళ్ళ, మల్లన్నసాగర్, ప్రాణహిత భారీ ప్రాజెక్టుల నిర్మాణాలు జరిగితే ఇవి టూరిజం ప్రాధాన్యాన్ని సంతరించుకోగలవు. కాళేశ్వర క్షేత్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి 25 కోట్లు ఇవ్వనున్నట్లు మేడిగడ్డ ప్రాజెక్టు శంఖుస్థాపన సమయంలో ప్రకటించారు. అలాగే వేములవాడ, యాదాద్రి దేవాలయాల పునర్ నిర్మాణాలు రెండు వందల కోట్ల వ్యయంతో మొదలయ్యాయి. హైదరాబాద్ కు సమీపంలోని రాచకొండ గుట్టల అభివృద్ధి జరగాల్సి వుంది. ఇవి పురావస్తు, ప్రకృతి, వన్యప్రాణి, పక్షులు, ఉద్యాన వనాలు, అభయారణ్యాలు వంటి ప్రాకృతిక సౌందర్య ప్రాథమ్యాలను చెడిపేయకుండా చూడాలి వుంది. పురావస్తు విభాగంలో గిరిజన సంస్కృతి, తెలంగాణా సంస్కృతి, పండుగల వంటి అంశాలపై అధికారులకు అవగాహన ఏర్పడేలా చట్టంలో నిబంధనలు రూపొందించబడాలి. మేడారం సమ్మక్కజాతర, ఆషాడం లష్కర్ గోలకొండ బోనాలు, గోదావరి, కృష్ణానదుల పుష్కరాల సమయంలో పురావస్తు, టూరిజం శాఖల గైడ్ లైన్స్ మేరకు ఏర్పాట్లు జరగాలి. కేంద్ర టూరిజం, పురావస్తు శాఖల సమన్వయంతో రాష్ట్ర పురావస్తువిభాగం అనుసంధానమై, ప్రస్తుతం ఉన్న మ్యూజియంల పటిష్టత, పురావస్తు భవనాల మరమ్మత్తులు, నిర్వహణ, నిధులు, తగినంత సిబ్బంది వంటి విషయాలలో ప్రత్యేక శ్రద్ధాశక్తుల్ని నూతన చట్టం గమనించాలి. 14వ ఆర్థిక సంఘం నిధుల్ని వినియోగించు కోవాలి.

నిజాం ప్రభుత్వ హయాంలో 1914లో ఏర్పాటైన రాష్ట్ర పురావస్తుశాఖ టూరిజంరంగాన్ని కలుపుకొని మూడు పువ్వులు ఆరుకాయలుగా అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నాం.

- బి.ఎస్.రాములు
8331966987

# మా స్వప్నం... మా ప్రపంచం

**మా** స్వప్నం... మా ఆదర్శ ప్రపంచంలో... పిల్లలందరూ మల్లెపూలలా, మందారాల్లా నవ్వుతున్నరు. ఆడుతున్నరు, పాడుతున్నరు, పిల్లలందరూ నాలుగేళ్ళ వయస్సు నుండి పదహారేళ్ళు చక్కగా ఫ్రీగా రెసిడెన్షియల్ స్కూల్స్‌లో చదువు కుంటున్నరు. మూడు పూటలు కడుపునిండా పోషకాహారం తింటున్నరు. స్వేచ్ఛా సమానత్వం, సౌభాతృత్వంతో ఆనందంగా బతుకుతున్నరు. డిగ్రీ కాలేజి లెక్చరర్ల లెక్కనే అందరి బతుకు ప్రమాణాలు మంచిగున్నయి. ఉత్పత్తి పరిశ్రమల్లో ఆరు గంటల డ్యూటీ మాత్రమే చేస్తున్నరు. రెండు షిఫ్టులు కలిసి పరిశ్రమలు 12 గంటలు పనిచేస్తున్నవి. విద్యా వైద్యం నూరుశాతం ఉచితంగా పొందుతున్నరు. డ్రైనేజీ నీళ్ళు శుభ్రపరుస్తున్నరు.

ఊరు చుట్టూ చక్కని చెట్లు హెలికాప్టర్ నుంచి చూస్తుంటే చెట్ల మధ్యల్లోంచి సౌరవిద్యుత్ ప్లేట్లు మెరుస్తూ ఊరు చుక్కల్లా కనపడుతున్నది, పవన విద్యుత్ రెక్కలు గిరగిర తిరుగుతున్నయి.

రైళ్లు, బస్సులు సౌర విద్యుత్‌తో బైకులు, కార్లు గాలితో, నీళ్లతో నడుస్తున్నవి. పిల్లలను కనే తల్లలకు తొమ్మిది నెలలు, తండ్రులకు ఆరు నెలలు ప్రసూతి సెలవులు ఇస్తున్నరు. ఇద్దరిలో ఒకరు డ్యూటీ చేస్తున్నరు. అయినా జనాభా రోజురోజుకు తగ్గిపోతున్నది. మేమిద్దరం మాకు ఒకరు కనీసం కనాలని సీనియర్ సిటిజన్లు మా కాలంలో నలుగురిని కనేవాళ్ళమని నముదాయిస్తున్నరు.

మండల, జిల్లా, రాష్ట్ర జాతీయ స్థాయిలో మూడు నెలలకోసారి టోర్నమెంట్స్ జరుగుతున్నయి. వేల మంది ఒలంపిక్స్‌కు ఎన్నికవుతున్నరు. ప్రతి స్కూలులో, కాలేజీలో ఏడాదికి మూడు సావనీర్లు ఈమెయిల్ చేస్తున్నరు. ఫేస్ బుక్‌లో, వాట్సప్‌లో, యూట్యూబ్‌లో పెడుతున్నరు.

జీనోం పరిశోధనలతో పంటల తీరు మారుతున్నయి. మనుషుల అనారోగ్యాల మూలాలను పెకిలిస్తున్నరు. రాజకీయ నాయకులు రోజుకు మూడు గంటలు అందరితోపాటు లెక్చరర్లుగా, డాక్టర్లుగా, టీచర్లుగా, సైంటిస్టులుగా పని చేసి జీతం తీసుకుంటున్నరు. రిటైర్డ్ సీనియర్ సిటిజన్ల రెసిడెనియల్ స్కూల్ పిల్లలతో, పక్కపక్కలో ఉండి ఆడుకుంటున్నరు. పాఠాలు, అనుభవాలు చెప్తున్నరు. మా చిన్నప్పుడు బీడీలు, సిగరెట్లు, గుట్కాలు, మద్యంతో చెప్తుంటే స్కూలు పిల్లలు ఆసక్తిగా వింటున్నరు. మా కాలంలో కులమతాల లొల్లి ఉండేది అని సీనియర్ సిటిజను చెప్తుంటే కులం అంటే ఏంటి? మతం అంటే ఏంటి? అని... పిల్లలు అడుగుతుంటే ఏం జెప్పాల్నో ఎలా జెప్పాల్నో తెల్వక నవ్వకుంట పాత ముచ్చట్ల మురికి కంప అని దాటేస్తున్నరు.

22 ఏళ్ళ వయస్సు దాటిన యువతీయువకులు చక్కగా చదువుకొని ఇష్టపడ్డవాళ్ళతో తల్లిదండ్రులు పెండ్లి చేస్తున్నరు. ప్రతి నెల రెండవ శనివారం సామూహిక వివాహాలు చేస్తున్నరు. ప్రతి నూతన జంట తరఫున వందమంది బంధుమిత్రులకు ఉచితంగా భోజనం పెడుతున్నరు. వారానికి అందరూ ఐదు రోజులు పని చేస్తున్నరు. అందంగా, ఆరోగ్యంగా మగ పిల్లలు ఆరు అడుగులు ఆడపిల్లలు 5–8" కన్నా ఎక్కువ ఎత్తు పెరుగుతున్నరు. ఆడపిల్లలు, మగపిల్లలు పద్దెనిమిదేళ్ళ దాటినవాళ్ళంతా అరవై కిలోల బరువు ఉంటున్నరు. అందరు 82 సంవత్సరాల దాక బతుకుతున్నరు. అందరూ యేడాదిలో ఒక పదిహేను రోజులు విమానాలల్లో, రైళ్ళల్లో ఉచితంగా విజ్ఞానయాత్రలు చేస్తున్నరు.

ప్రతి జిల్లా, మండల కేంద్రంలో రెస్ట్ హౌజ్‌లు, గెస్ట్ హౌజ్‌లు, ఉచిత భోజనం, ఉచిత వసతితో ప్రేమతో ఆదరిస్తున్నరు. రోడ్లు, డ్రైనేజీలు అన్ని చక్కగా పరిశుభ్రంగా కనపడుతున్నవి. ప్రతి ఒక్కరూ వారానికి మూడు గంటలు పోలీసుగా యేడాదికి 20 రోజులు సైనికులుగా పని చేస్తున్నరు. ప్రతి నాలుగైదు కిలోమీటర్లకు వాగులు, వంకలు, నదులపై బ్యారేజీలు, చెక్‌డ్యాంలు, పార్కులు, గార్డెన్లు, ఎక్కడి వర్షపు నీళ్ళు అక్కడే ఇంకుతున్నవి. రోడ్లపక్కన, రైలు పట్టాల పక్కన ఐదు వరుసల చెట్లు, వనాలు ... చక్కని గాలి.

ఎకరానికి 60 క్వింటాళ్ళు పండిస్తున్నరు. సహజ ఎరువులు వాడుతున్నరు. సినిమాలను, టీవీ ఎపిసోడ్ సైంటిఫిక్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ సర్టిఫై చేస్తున్నది. ప్రతి సినిమా, టీవీ ఎపిసోడ్ స్క్రిప్టును ముందేచూసి ఓకే చేస్తున్నరు. అందరు చక్కగా ఆటలు, పాటలు పాడుకుంటున్నరు. అందరు 1500 చదరపు అడుగుల ఇంటిలో మూడు తరాలు హాయిగా ఉంటున్నరు.

ఇంట్లో వండుకుంటే సమయం వృధా. క్యాంటీన్లో తింటే నాలుగోవంతే ఖర్చు అందరు కాలనీలోని క్యాంటిన్లో కలిసి తింటున్నరు. కొన్ని ఊర్లల్లో ప్రతిరోజు క్యాంటిన్లో ఒకసారి, ఇంటిలో ఒకసారి తింటున్నరు. ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఉద్యోగులు అందరు యూనిఫాం వేసుకుంటున్నరు. అన్ని స్కూళ్ళ విద్యార్థులు ఒకే యూనిఫాం వేసుకుంటున్నరు. నూరు శాతం స్కూళ్ళు, కాలేజీలు, యూనివర్శిటీలు ప్రభుత్వ సైంటిఫిక్ విద్యాశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్నవి.

అడవుల్లో కూడా ఇంటింటికి నల్లా నీరు, విద్యుత్ అన్ని గ్రామాలు, స్మార్ట్ సిటీలకు సమానంగా విద్య, వైద్యం, ఆటస్థలాలు, రెసిడెన్షియల్ స్కూళ్ళు విద్యుత్, రవాణా, గృహవసతి, రోడ్లతో అందంగా మెరుస్తున్నవి. సైన్స్, టెక్నాలజీ పరిశోధనలు నిత్యం జరుగుతున్నవి.

# భారత స్వాతంత్ర్య ఉద్యమానికి ఊపిరి పోసిన తెలుగు రైతు ఉద్యమాలు

డా॥ జి. వెంకటేశ్వరరావ్
9491457496

**గా**ంధీజీ 1921 వ సంవత్సరంలో స్వాతంత్ర్య పోరాటాన్ని శాంతియుతమైన పద్ధతులతో ప్రారంభించిన తరువాత, రైతులు గాంధీజీ చేపట్టిన ఉద్యమాలను సమర్ధిస్తూ అఖిల భారత కాంగ్రెస్ తమ సమస్యలను పరిష్కరించే సంస్థగా భావించి, స్వాతంత్ర్య ఉద్యమంలో విస్తృతంగా పాల్గొన్నారు. గాంధీజీచే ప్రేరేపింపబడిన రైతు ఉద్యమాలు ముఖ్యంగా బీహారులోని చాంపరాన్‌లో1917లో నీలిమందు సాగుచేసేవారిపై సాగిన పోరాటం, గుజరాత్‌లోని కైరాలో 1918లో జరిగిన సత్యాగ్రహం, బ్రిటీషువారిపై మొదటి సారిగా గాంధీపద్ధతిలో జరిగిన రైతు ఉద్యమాలు. బ్రిటీషువారి పరిపాలన త్వరలో అంతమొందుతుందనే ప్రగాఢమైన విశ్వాసంతో భారతదేశమంతా ఈ ఉద్యమాలు ప్రారంభమైనాయి. రైతులు పన్నులను చెల్లించడం మానివేసి దేశంలో జరుగుచుండిన రాజకీయ పరిణామాలను ఆసక్తిగా పరిశీలించడం ప్రారంభించారు. ఇటువంటి పరిస్థితులలో గాంధీజీ సహాయ నిరాకరణ ఉద్యమాన్ని అర్థాంతరంగా విరమించారు. దీనితో కోట్లకొలది రైతులు గాలికి వదిలివేయబడినారు.

ఈ సమయంలోనే ఆంధ్రప్రాంతంలో కిసాన్‌సభ అనే స్వతంత్ర ప్రతిపత్తిగల సంస్థ- ఎన్.జి.రంగా మొదలగువారిచేత స్థాపించ బడినది. ఆంధ్రప్రాంతరైతు సంఘాన్ని 1928లో ఎన్.జి.రంగా, జి.వి.రత్నం, బాపినీడులు స్థాపించారు. కృష్ణా, గోదావరి జిల్లాలలో 1931లో ప్రారంభింపబడిన "పునరావాస వ్యతిరేక పోరాటం (ఇంగ్లీష్) వెంకటగిరి సంస్థానంలో జరుగుచుండిన అడవీ సత్యాగ్రహం, జమీందారీ వ్యతిరేకపోరాటం, మందస, చల్లపల్లిలోని పోరాటాలు, కానూరులో జరుగుచుండిన రైతు ఉద్యమం, మునగాలలోని రైతు పోరాటం - ఇవన్నీ జమీందారులు పేద రైతులపై సాగించుచుండిన దమననీతికి వ్యతిరేకంగా జరిపిన పోరాటాలని చెప్పవచ్చు. ఆంధ్రప్రాంతంలో జరిగిన ఈ ఉద్యమాలు 1937-38 సంవత్సరాలలో కొమ్మారెడ్డి సత్యనారాయణ నాయకత్వంలో ఇచ్ఛాపురం నుంచి, మద్రాసువరకు జరిగిన రైతు రక్షణయాత్రతో పతాకస్థాయిని అందుకొన్నాయి. ఈ ఉద్యమాలు రైతులలో ఉన్న అసంతృప్తిని వ్యక్తంచేయడానికోసం, మరియు క్రొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం యొక్క దృష్టికి తీసుకురావడానికోసం శాంతియుతంగా జరిగిన ఉద్యమాలు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన స్వాతంత్ర్యోద్యమం జమీందారీ విధానంపై ఉన్న తీవ్ర అసంతృప్తిని తెలియచేయడానికోసం జరిగిన ఉద్యమంగా భావించవచ్చును.

జమీందారుల దోపిడీతనం, అస్తవ్యస్త పరిపాలనవల్ల రైతులలో అసంతృప్తి పెరిగి 1929-1939 సంవత్సరాలమధ్య ఆంధ్ర ప్రాంతంలో జమీందారీ రైతు సంఘం 1929 ఆగష్టులో పశ్చిమగోదావరి జిల్లాలోని ఏలూరులో ప్రారంభించబడింది. ఈ రైతు సంఘానికి ఒరిస్సా రైతు నాయకుడు బి. విశ్వనాథ్‌దాస్ ముఖ్య సలహాదారునిగా ఉండినారు. ఆ తరువాత 1929 నవంబరులో విజయవాడలో వి. రామదాసుపంతులు అధ్యక్షతన ఆంధ్రరాష్ట్ర సమావేశం జరిగింది. జమీందారీ రైతుసంఘం తన కార్యకలాపాలను ప్రారంభించింది. 1931వ సంవత్సరం సెప్టెంబరు మాసంలో వెంకటగిరిలో ఆంధ్రప్రాంత రైతు సమావేశం ఎన్.జి.రంగా అధ్యక్షతన నిర్వహింపబడింది. జమీందారీ వ్యవస్థను చట్టబద్ధంగా నిర్మూలించాలని ఈ సమావేశం తీర్మానించింది. తరువాత 1933లో ఎన్.జి.రంగా ఆధ్వర్యంలో జరిగిన ఆంధ్రప్రాంత రైతు సమావేశం-రైతుల కనీస కోర్కెలను తీర్చాలని తీర్మానించింది.

ఆంధ్ర జమీందారీలను గురించి సమగ్రమైన సమాచారాన్ని సేకరించి మద్రాసు ఎస్టేట్ ల్యాండ్ యాక్ట్ (1937-39) కమిటీకి సమర్పించాలని నిర్ణయించింది. 'జమీందారుల పాలనలో 136 సంవత్సరాలు' అనే అంశంమీద రిపోర్టు తయారు చేయబడి- దానిలో జమీందారులు రైతులపై విధించుచున్న అధిక పన్నులు, ఇతర అపరాధాలు, రైతుల సమస్యలను గురించిన వివరాలు ప్రస్తావన చేయబడినవి. ఆవిధంగా కాంగ్రెస్ జమీందారీలను రద్దు చేయాలనే ఉద్దేశ్యంతో అనేక ఉద్యమాలను చేపట్టినది. అందువల్ల ఆంధ్రప్రాంతంలో అనేక రైతు ఉద్యమాలు జరిగినాయి. వీటిలో ముఖ్యమైనవి- వెంకటగిరి సంస్థానం (నెల్లూరు జిల్లా), మునగాల సంస్థానం (కృష్ణాజిల్లా), కాశీపట్నం ఎస్టేట్ (తూర్పుగోదావరి జిల్లా), చల్లపల్లి జమీందారీ (కృష్ణాజిల్లా), మందస ఎస్టేట్ (విశాఖజిల్లా) మొదలైనవి.

**ఇచ్ఛాపురం నుంచి- మద్రాసు వరకు సాగిన రైతురక్షణ యాత్ర:** 1937లో జరిగిన రైతు రక్షణ యాత్ర మొట్టమొదటి యాత్ర కాదు. మద్రాసు ప్రెసిడెన్సీ అంతటా ఇటువంటి యాత్రలు జరిగినాయి. ఈ యాత్రలు ప్రజాబాహుళ్యంలో - ముఖ్యంగా రైతులలో అప్రమత్తతను చైతన్యాన్ని తీసుకొని రావడానికి ఉపకరించాయి. ఆంధ్రప్రాంతంలోని రైతులు 1937 జులైలో ఇచ్ఛాపురంనుండి మద్రాసువరకు రైతురక్షణ యాత్రను నిర్వహించారు. సోషలిస్టులు, కమ్యూనిష్టులు, వారి నాయకులు ఈ రైతు రక్షణయాత్రలో పాల్గొన్నారు. ఎన్.జి.రంగా, నరేంద్రదేవ్, ఇందులాల్ యాగ్నిక్, స్వామి సహజానంద సరస్వతి- ఇతర నాయకులు ఈ యాత్రలో పాల్గొన్నారు. ఈ రైతురక్షణ యాత్రను భారత స్వాతంత్ర్య ఉద్యమంతోను, గాంధీజీ ప్రారంభించిన దండియాత్రతోను పోల్చవచ్చని చరిత్రకారులు అభిప్రాయపడినారు. ఈరైతు యాత్ర విశాఖపట్నం, తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణ, గుంటూరు, నెల్లూరు జిల్లాల్లోనూ, రాయలసీమలోని కర్నూలు జిల్లా, మద్రాసు ప్రాంతంలోని చెంగల్పట్టు జిల్లాలోని రెండు తాలూకాలలోను పర్యటించింది. ఎస్టేట్ ల్యాండ్ చట్టం, అటవీ చట్టాలలోని లొసుగులను

– వీటివల్ల రైతులకు కలుగుచుండిన నష్టాలను గురించి మద్రాసు ప్రభుత్వానికి తెలియజేయాలనే ఉద్దేశ్యంతో ఈయాత్ర జరిగింది.

అఖిలభారత కిసాన్‌సభ అధ్యక్షులైన ఎన్.జి.రంగా 1937 జులై 8వ తేదీ ఇచ్ఛాపురంలో ఈ రైతురక్షణ యాత్రకు జెండాను ఊపినారు. ప్రముఖ రైతునాయకుడు కొమ్మారెడ్డి సత్యనారాయణ ఈ యాత్రను స్వాగతించి రైతుయాత్రను విజయవంతం చేయమని కోరినారు. ఈయాత్ర ఆంధ్రప్రాంతంలోని అనేక జిల్లాలలో పర్యటించి ప్రతి గ్రామంలోను సభలను నిర్వహించింది. నెల్లూరు జిల్లా ఆత్మకూరులో జరిగిన సభలో కొమ్మారెడ్డి సత్యనారాయణ ప్రసంగిస్తూ "రైతు సంఘాలు, గ్రామాలలోని కాంగ్రెస్‌వారు ప్రత్యేక శ్రద్ధ తీసికొని జమీందారీ వ్యవస్థ రద్దు అయ్యేవరకు ఉద్యమం సాగించాలని కోరినారు.

ఈ రైతు రక్షణయాత్ర మద్రాసుకు చేరి, శాసనసభ స్పీకర్ బులుసు సాంబమూర్తికి తమ సమస్యలను గురించి తెలియజేసే మహజరును సమర్పించింది. దీనిలో జమీందారీలోని శిస్తులు, నీటిపన్నులు మొదలగు విషయాలను ప్రస్తావించారు. పంటలు సుక్కిపోయినపుడు శిస్తు రెమిషన్ యివ్వడంలేదని పేర్కొన్నారు. పశువులమేత కోసం అటవీభూములను యివ్వాలని, పన్నులు వసూలుచేసే అధికారాన్ని ఆయాగ్రామాధికారులకు ఇవ్వాలని కోరినారు. భూములను సర్వే చేయడం, పన్నులను విధించడం మొదలగు పనులను ప్రభుత్వమే చేయాలని– ప్రభుత్వం రైతు సంఘాలను గుర్తించాలని కోరినారు.

ఈ రైతురక్షణయాత్ర రైతులలో చైతన్యాన్ని తీసికొని వచ్చింది. వారి హక్కులను తెలియజెప్పింది వారిలో విశ్వాసాన్ని పెంచింది. ఈ ధైర్యంతోనే రైతులు ముందుకు వచ్చి తమ కష్టములను తెలియజేశారు. ఈ విధంగా రైతు రక్షణయాత్ర 1938–39లలో జమీందారీ వ్యతిరేక పోరాటానికి చేయూతనిచ్చింది. దీనితో కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో జమీందారీ రద్దు చట్టాన్ని ప్రవేశపెట్టి మద్రాసు రాష్ట్రంలోని జమీందారీలనన్నిటినీ రద్దు చేసింది. ఈ సందర్భంలో జమీన్‌రైతు పత్రిక 7–10–1949 సంచికలో రామానాయుడు వ్రాసిన సంపాదకీయం చరిత్రాత్మకమైనది. "147 సంవత్సరాలుగా జమీందారులు చేసిన దుష్కార్యములు, దుండగాలు, అన్యాయాలు, అక్రమాలు దారుణమైనవి. వారు నీతి నియమాలను వదలి, రైతుల ఆస్తులను ఆక్రమించారు. జాతీయ సంపదలైన జలాశయాలు మొదలగువాటిని పాడుచేశారు. ఒకమూల ఆహారపు కొరత, మరొకవైపున విద్యావిహీనత రైతుజాతిని హీనపరచినవి. ఆ దుశ్చర్యాబద్ధమైన జమీందారీవిధానం ఈశ్వరానుగ్రహమున అంతరించిపోబోతున్నది. ఈ గగనమున **జమీందారీ రద్దు విదానాన్ని లేవదీసిన ఎన్.జి.రంగాను, జమీందారీ విచారణను ప్రారంభించి ప్రభుత్వంలోకూడ ఒక అలజడిని పుట్టించిన ప్రకాశం పంతులును, రద్దుశాసనం కోసం కృషిచేసిన కళావెంకట్రావును అభినందించకుండా ఉండజాలము.** వారికి జమీన్ రైతులు శాశ్వతంగా కృతజ్ఞులై ఉండగలరు."

**తెలంగాణలో రైతుల తిరుగుబాటు:**

తెలంగాణాలో వచ్చిన తిరుగుబాటు సాయుధ పోరాటానికి దారితీసింది. రావి నారాయణరెడ్డి నాయకత్వంలో చిద్దం ఎల్లారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు మొదలగు ఆంధ్ర మహాసభ నాయకులు, నిజాం నిరంకుశ రాజ్యంలో రజాకార్ల సైన్యంచేత హింసింపబడుచుండిన తెలంగాణ రైతుల హక్కులను పరిరక్షించడానికి పూనుకొన్నారు. వీరు చిన్న కమతాలరైతులను, వ్యవసాయ కూలీల హక్కులను కాపాడటానికి పూనుకొన్నారు. స్వతంత్ర భారతదేశంలో తన రాజ్యాన్ని విలీనం చేయడానికి నిజాం నిరాకరించడంతో వేలకొలది తెలంగాణా ప్రజలు, రైతుల దేశభక్తితో నిజాంపాలనను అంతమొందించడానికి పూనుకొన్నారు. ఈ విమోచన ఉద్యమంలో ధనవంతులైన రైతులుకూడ పాల్గొన్నారు. కాంగ్రెసువారు నిజాం రాష్ట్రమంతటా సత్యాగ్రహాలు చేయడం ప్రారంభించారు. కానీ ఆంధ్రమహాసభ ఆధ్వర్యంలో కమ్యూనిష్టులు రజాకారులను ఎదిరించారు. ఆ సమయంలో నలభైవేల గ్రామాలు విముక్తి చేయబడగా, కోట్లకొలది ఎకరాల భూమిని రైతులకు పంచిపెట్టడం జరిగింది.

భారతసైన్యం1949లో పోలీసు చర్య ప్రారంభించినపుడు నాలుగువేల మంది ఉద్యమకారులు చంపబడినారు. 1950 నాటికి పదివేలమంది కమ్యూనిష్టులు నిర్బంధించబడినారు. భారతసైన్యం తెలంగాణ ప్రాంతానికి తరలింపబడిన తరువాత తెలంగాణా తిరుగుబాటు రైతు ఉద్యమంగా మారింది. మొదట్లో ఈ ఉద్యమం ఉధృతంగా ఉంది. దీనితో రైతులు, సన్నకారు రైతులు, కౌలుదారులు, కూలీలు మొదలగువారు పాల్గొన్నారు. పోలీసు చర్య తరువాత పెద్దరైతులు ఈ గెరిల్లా ఉద్యమం పట్ల ఆసక్తిని చూపించలేదు. 'రైతుల సహాయ సహకారాలు లేకపోయినట్లయితే, భారతదేశంలో విప్లవాలు విజయవంతం కావడం కష్టమని తెలంగాణా ఉద్యమం తేటతెల్లం చేసింది."

**స్వాతంత్ర్యం వచ్చినా మారని రైతుల పరిస్థితి:**

**దేశానికి వెన్నెముకగా ఉన్న రైతుల పరిస్థితి స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని సంవత్సరాలు గడిచినా అనుకున్నంతగా మెరుగుపడలేదు. రైతు పంటను పండిస్తున్నాడేగాని అతని కష్టం మిగలడంలేదు. అనేక ప్రాంతాలలో రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. మనం తినే తిండిలోకూడ ఆ పాపం ఉంటుంది. ఇటీవల మహారాష్ట్రలోని విదర్భ ప్రాంత గ్రామంలో దాదాజీ రామాజీ ఖోబ్రగడే అనే కరైతు ఎక్కువ పంటను పండించే హెచ్.ఎం.టి అనే కొత్త వరి విత్తనాలను కనుగొన్నారు. వ్యవసాయ శాస్త్రజ్ఞులు, కొంతమంది విత్తన వ్యాపారులు ఈ రైతును మోసం చేసి, అతని విజ్ఞానాన్ని తస్కరించి పికెవి, హెచ్.యం.టి. పేరుతో ఇదే విత్తనాలను విరివిగా అమ్మడం ప్రారంభించారు. ఇదే రైతు ఎక్కువదిగుబడి వచ్చే ఏడురకాల విత్తనాలను కనిపెట్టినాడు. ప్రభుత్వం ఇటువంటి అమాయక రైతులను వ్యవసాయ శాస్త్రజ్ఞుల, విత్తన వ్యాపారస్తుల నుంచి కాపాడవలసి ఉంది. ఈ బడుగురైతు కనిపెట్టిన విజ్ఞానాన్ని గుర్తించి అతనిని ప్రోత్సహించవలసి ఉంది. రైతు సంక్షేమం– దేశ సంక్షేమమని గుర్తించి రైతును అన్నివిధాల కాపాడవలసిన అవసరం ఉంది.**

(ఆం.ప్ర. హిస్టరీ కాంగ్రెస్ వ్యవస్థాపకుడు డా॥ మలిరెడ్డి పట్టాభిరామరెడ్డిగారికి అంకితమిచ్చిన వ్యాసానికి సంక్షిప్త రూపం)

మన రాజులు-
వారి బిరుదులు-14

# కొండవీటి రెడ్డిరాజులు

-ఈమని శివనాగిరెడ్డి (స్థపతి)
సెల్ : 98485 98446

క్రీ.శ.1323లో, సుస్థిరపాలన నందించిన కాకతీయులపై పరాయి సేనల కిరాయి దాడి జరిగినపుడు, తెలుగునేల అతలాకుతల మైంది. చివరి కాకతీయ పాలకుడైన ప్రతాపరుద్రుడు, ఢిల్లీ సుల్తాన్ బందీగా మరణించటంతో, కాకతీయసామ్రాజ్యం అంతరించింది. కాకతీయుల పతనానంతరం పుట్టుకొచ్చిన రాజ్యాల్లో రెడ్డిరాజ్యం ఒకటి. ప్రోలయ వేమారెడ్డి రెడ్డిరాజ్య స్థాపకుడు. క్రీ.శ 1325 నాటికి గోదావరి- పెన్నా నదుల మధ్యగల రెడ్డిరాజ్యాన్ని, అద్దంకి రాజధానిగ క్రీ.శ.1353 వరకూ పాలించాడు. ప్రోలయ వేమారెడ్డి తరువాత, అతని తమ్ముని కొడుకైన అనపోతారెడ్డి క్రీ.శ. 1354లో సింహాసనా న్నధిష్టించి, రాజధానిని అద్దంకి నుంచి కొండవీడుకు మార్చి, క్రీ.శ. 1364 వరకూ పాలించాడు. అతని తరువాత, అతని తమ్ముడు అనవేమారెడ్డి అధికారాన్ని చేపట్టి క్రీ.శ. 1364 నుంచి క్రీ.శ.1386 వరకూ ప్రజారంజకమైన పాలన నందించాడు. అనపోతవేమారెడ్డి మరణంతో, కొండవీటి సింహాసనంపై అతని కుమారుడైన కుమార గిరిరెడ్డి కూర్చుని క్రీ.శ.1386 నుంచి క్రీ.శ.1402 వరకూ పాలించి రెడ్డిరాజుల వైభవ, ప్రాభవాలను ఇనుమడింపజేశాడు. ఇతడు రాజమహేంద్ర శాఖను ఏర్పరచి, కుమారుడైన రెండో అనపోతారెడ్డిని రాజప్రతినిధిగ నియమించాడు. కుమారగిరిరెడ్డి తరువాత, పెదకోమటి వేమారెడ్డి క్రీ.శ. 1402లో కొండవీటి ప్రభువై క్రీ.శ.1420 వరకూ, అటుతరువాత అతని కొడుకు రాచవేమారెడ్డి క్రీ.శ.1420 నుంచి 1424 వరకూ పాలించాడు. విజయనగర రాజుల దాడిలో రాచవేమారెడ్డి ఓడిపోవ టంతో కొండవీటి రెడ్డిరాజ్యం అంతరించింది.

రాజమహేంద్రవర శాఖకు అల్లాడరెడ్డి రెండో కుమార గిరిరెడ్డి, క్రీ.శ.1414 నుంచి 1420 వరకూ, మూడో అనపోతారెడ్డి క్రీ.శ.1423 వరకూ, అని తల్లి, వీరభద్రారెడ్డి క్రీ.శ.1428 వరకూ పాలించారు. గజపతుల దండయాత్రలో వీరభద్రారెడ్డి ఓడిపోవడంతో రాజమహేంద్రవరరెడ్డి రాజ్యశాఖ కనుమరుగైంది.

రెడ్డిరాజ్య స్థాపకుడైన ప్రోలయవేమారెడ్డి సోదరుడైన మల్లారెడ్డి, కందుకూరును రాజధానిగ, కందుకూరు రెడ్డిరాజ్యశాఖకు పాలకు డైనాడు. మల్లారెడ్డి తరువాత, అతని మనుమడైన పినకోమటిరెడ్డి కొడుకు అయిన శ్రీగిరిరెడ్డి, క్రీ.శ.1398 నుంచి స్వతంత్రపాలన సాగించాడు. శ్రీగిరిరెడ్డి క్రీ.శ.1406లో మరణించిన తరువాత, అతని తమ్ముడైన రెండో మాచారెడ్డి కొడుకైన రెండో కోమటిరెడ్డి క్రీ.శ.1404 లో రాజైనాడు. తరువాత, రెండో మల్లారెడ్డి కొడుకైన మూడో కోమటిరెడ్డి క్రీ.శ.1411లో రాజైనాడు. విజయనగర పాలకుడైన మొదటి దేవరాయలు చేసిన దండయాత్రలో మూడోకోమటిరెడ్డి క్రీ.శ.1427లో ఓడిపోవటంతో కందుకూరి రెడ్డిశాఖ తన ఉనికిని కోల్పోయింది.

రెడ్డిరాజులు సుస్థిర పాలనతోపాటు వ్యవసాయాన్ని, వర్తకాన్ని ప్రోత్సహించారు. పటిష్టమైన రక్షణ కోసం అనేక కోటల్ని నిర్మించారు.




ప్రజల మనోభావాలను గౌరవించి అనేక ఆలయాలను నిర్మించారు. సాగునీరు, తాగునీటికోసం అనేక చెరువులు నిర్మించారు. కవులు, కళాకారులను పోషించి, మధ్యయుగాంధ్రదేశంలో తమకంటూ ఓ స్థానాన్ని కల్పించుకొన్నారు.

రెడ్డిరాజ్యస్థాపకుడైన ప్రోలయవేమారెడ్డి చరిత్ర, పాలన, బిరుదులను తెలుసుకోవటానికి వలివేరు, నకరికల్లు, సంతమాగు లూరు, ముట్లూరు, గణపేశ్వరం, ద్రాక్షారామం, పువ్వాడ, మల్లవరం, ఆతుకూరు, దృజ్జవరం, మంచాల, కల్పపాముల, వేమవరం, పెరవలి, అమరావతి శాసనాలు, ఎఱ్ఱాప్రెగడ రాసిన హరివంశం, నృసింహపురాణం, వామనభట్టు బాణుని వేమభూపాలచరితం, శ్రీనాధుని హరవిలాసం మొదలైన గ్రంథాలు ఉపయోగపడతాయి. 28 సంవత్సరాలపాటు నిరాటంకంగా, జనరంజకంగా, కాపుజన

కల్పతరువుగా ఏలిన ప్రోలయ వేమారెడ్డి ధైర్యసాహసాలు, దాననిరతి, గుణగణాలను తెలియజేసే బిరుదుల్ని ధరించాడు. వాటిలో **పల్లవాదిత్య, పల్లవ త్రినేత్ర, జగనొబ్బగండ, చెంజిమల చూరకార, వీరనారాయణ, మేచ్ఛాబ్ధికుంభసంభవ, ఏకరాయ స్థాపనాచార్య, ఏక సింహాసనాలంకార, నిశ్శీమ భూదాన పరశురామ, శ్రీ పరిమిత భూదాన పరశురామ, శ్రీపర్వతాహోబల సోపాన నిర్మాత, ధర్మ ప్రతిష్ఠాగురు, కేళాదిరాయ, సంగ్రామ ధనుంజయ, బ్రహ్మకుండినీ సహ్యజాగౌతమీ జలక్రీడా వినోదుడు, అనేక నగర ఓపికంఠప్రతిష్ఠ పీఠచేవిధ ఆరామ, అనవరత పురోహిత కృతసోమపాన** అనేవి ముఖ్యమైనవి.

ప్రోలయవేముని తరువాత రెడ్డిరాజ్యాన్నేలిన అనపోతారెడ్డి చరిత్ర తెలుసుకోటానికి ద్రాక్షారామం, ఈడ్పుగల్లు, మోటుపల్లి, నాగళ్ళ, అమరావతి, మాన్యమంపురం, పచ్చల తాడిపర్రు, కొల్లూరు, అన్నవరం, రాజమండ్రి మ్యూజియం శాసనాలు, ఉత్తరహరివంశం, విష్ణు పురాణం, శృంగార నైషధం, వేమభూపాలీయం, కొండవీటి దండకవిలె, మెకంజీ రాతప్రతులు ఎంతో ఉపకరిస్తాయి. ఇతనికి **ద్వీపజేత, ప్రత్యబ్దం ప్రతిపక్ష దేశజయనః, వీరాన్న వోత** అనే బిరుదులున్నాయి.

అనపోతారెడ్డి తరువాత, అతని తమ్ముడు అనవేమారెడ్డి క్రీ.శ. 1364 లో కొండవీటి సింహాసనాన్ని అధిష్ఠించి, క్రీ.శ. 1386 వరకూ జనరంజక పాలననందించాడు. అనవేముని చరిత్ర, పాలనా విశేషాలను తెలుసుకోవటానికి పెదచెరుకూరు, నడుపూరు, సింహాచలం, వాడపల్లి, పలివెల, శ్రీశైలం, ద్రాక్షారామం, మాన్యమాపురం, అనపర్తి, ధృజ్జవరం, ఇప్పగల్లు, పచ్చల తాడిపర్రు, కొల్లూరు, వానపల్లి, పెదపలకలూరు శాసనాలు, వెన్నెలకంటి సూరన రాసిన విష్ణు పురాణం, శ్రీనాధుని శృంగార నైషధం ఉపకరిస్తాయి.

అనవేముడు, **రాజమహేంద్ర నిరువద్యనగరాది బహువిధ స్థలదుర్గ విదళన బలరామ, సాగర గౌతమీ సలిల సంగమ సకల జలదుర్గ సాధన రఘురామ, (రాజమహేంద్రవరం, నిరవద్య పురం(నిడదవోలు) మొదలైన దుర్గాల్ని చీల్చటంలో బలరాముడు, గౌతమీ, సముద్ర సంగమంలోనున్న జలదుర్గాల్ని లొంగదీసుకున్న రఘురాముడు, దివిదుర్గ విభాల (దివిదుర్గాన్ని భగ్నం చేసినవాడు) జలదుర్గమల్ల** అన్న బిరుదులను ధరించాడు. ఇంకా ఇతనికి **ప్రజాపరిచిత చతుర్విధోపాయ, కరవారభైరవ, క్షురికాసవశయ, కరవాల వైనతేయ, మహనీయాంధ్రదేశ పట్టాభిషేక సంవృత మహాభాగ్య** అని కూడా కీర్తించబడినాడు. వసంతోత్సవాలను ఘనంగా జరిపించి **వసంతరాయ, కర్పూర వసంతరాయ** అన్న బిరుదులు కూడా పొందాడు.

అనపోతారెడ్డి తరువాత అతని కుమారుడైన కుమారగిరిరెడ్డి క్రీ.శ.1386 నుండి 1402 వరకూ పాలించాడు. చక్కని పరిపాలన నందించి కొండవీటి సామ్రాజ్య ప్రాభవాన్ని కందుకూరు నుంచి కటకం వరకూ, శ్రీశైలం నుంచి తూర్పుసముద్రం వరకూ పాలించి, వసంతోత్సవాలను ఘనంగా జరిపించి, కర్పూర వసంతరాయలుగా పేరుగాంచిన కుమారగిరిరెడ్డి పాలన గురించి తెలుసుకోవటానికి పాలకొలను, సింహాచలం, అమరావతి, తొత్తరమూడి, మధురపూడి, సంతానసాగరం, గోపవరం, సర్పవరం, తాళ్ళూరు, కోరుమిల్లి, వేమవరం, అనపర్తి, కొమరగిరిపురం, కొత్తూరు, త్రిపురాంతకం, యనమదల, పరుచూరు శాసనాలు, శ్రీనాధుని హరవిలాసం, కాశీఖండం, భీమేశ్వర పురాణం, కొమ్మన శివలీలా విలాసం ఉపయోగపడతాయి.

కొండవీటి వసంతోత్సవాలను తిలకించటానికి వచ్చిన జనంమీదికి స్వయంగా కస్తూరి మొదలైన సుగంధద్రవ్యాలనూ, కర్పూరకళికల్ని వెదజల్లి ఆనందించిన అనవేమారెడ్డిని గుర్తుకు తెచ్చుకుని; **ఘనసాల కస్తూరికాది వస్తు విస్తార విరచితాపూర్వ వసంత విహార** అని, **కర్పూరవసంతరాయ**లని, కుమారగిరిరెడ్డిని జనం కొనియాడగా, అవే ఆయన బిరుదులైనాయి. కుమారగిరిరెడ్డి బావ, కాటయవేమారెడ్డిని దండనాయకునిగా, ప్రధానిగా నియమించు కొన్నాడు. కాటయవేమునికి **జగనొబ్బగండ, కాళిందిరాయ, భుజబల భీమ, పాండ్యరాయగజసింహపల్లవత్రినయన** బిరుదులున్నాయని అతని పాలకొల్లు శాసనం తెలియజేస్తుంది.

కొండవీటి చివరి పాలకుడైన రాచవేమారెడ్డిగానీ, రాజమహేంద్ర వరం, కందుకూరు శాఖలకు చెందిన రెడ్డిరాజులుగానీ ఎలాంటి బిరుదులూ ధరించిన ఆధారాలు లభించటంలేదు.

**కవిత**

## ఒంటరి అనాథ!

–**గుర్రాల రమణయ్య**, 99639 21943

శిలలు కరగటం చూశాను
మెలికలు మెలికలు తిరిగి
శిల్పంగా మారటం చూశాను
శిలలే అందమైన దేవుడిగా
ఆభరణాలతో కళకళలాడటం చూశాను
చెట్లు కరిగిపోవటం
గుమ్మాలుగా కిటికీలుగా
డబుల్‌కాట్ మంచాలుగా
కుర్చీలుగా టేబుళ్ళుగా
చివరికి చితిమంటలుగా
రూపాంతరం చెందటం చూశాను
కొండ కరగటం చూశాను
కంకర కంకరగా మారి
కాళ్ళ కింద రోడ్డై పరచుకోవడం
సిమెంట్‌లో కలిసి కాంక్రీటై
ఫ్యాక్టరీలుగా అపార్టుమెంట్లుగా
పెరిగి పెద్దవటం చూశాను
అన్నీ చూశాక
మనిషిని చూస్తుంటే
అధోముఖంగా మారుతూ
ఒంటి రెక్కతో
సంసార సాగరమందు
దీపస్తంభంగా నిలుచున్న
ఎడారి ఓడలాగున్నాడు
ఎవరినీ పలుకరించక
ఏ పిలుపుకీ స్పందించక
'ఎక్కడేసిన గొంగళి...'లాగున్నాడు!
అన్నీ పోగొట్టుకొంటూ
అన్నింటికోసం పరితపిస్తున్న
'ఒంటరి అనాథ' ఇప్పుడు మనిషి!

-వుప్పల నరసింహం
సెల్ : 99857 81799

# నాయీల నైపుణ్యం, నాణ్యమైన శస్త్రచికిత్సలు

**దే**శంలో ఇప్పుడు నైపుణ్యాల గూర్చిన చర్చ విశేషంగా జరుగుతోంది. కేంద్రప్రభుత్వంలో ఇందుకోసం 'కౌశల్ విభాగ్' పనిచేస్తోంది. యువతకు అనేక రంగాలలో తర్ఫీదు ఇచ్చేందుకు కృషి జరుగుతోంది.

ఒకప్పుడు అంటే రెండు, మూడు వందల సంవత్సరాల క్రితం భారతదేశంలోని ప్రతి గ్రామంలో ఈ కౌశలం, నైపుణ్యం గల వ్యక్తులు అనేకమంది వుండేవారు. విచిత్రమేమిటంటే ఆ కౌశలం, విద్య, నేర్పు, అభిరుచి, ఆలోచనలన్నీ అద్భుతం. అయితే అవన్నీ అంతర్ధానమయ్యాయి. దానికి పరాయి పాలకులు ప్రధాన కారణం.

భారతదేశంలో వర్ణవ్యవస్థ కొనసాగినప్పటికీ అన్ని కులాల్లో ఆయా వృత్తులకు చెందిన నైపుణ్యాన్ని విశేషంగా ప్రదర్శించిన వారున్నారు. ఆ కౌశలం విదేశీయులను సైతం ఆశ్చర్యచకితుల్ని చేసింది, అబ్బురపరిచింది, నిశ్చేష్టులను చేసింది. అంతగొప్ప నైపుణ్యం, వివిధరంగాలలో గల నేర్పు, విశిష్టత క్రమంగా లుప్త మవడం బాధాకరం. వాటి కొనసాగింపు లేకపోవడం నిరాశ కలిగించే అంశం.

వర్ణవ్యవస్థలో నాయీబ్రాహ్మణుల(మంగలి)కు అంత దర్జాగాని, హోదా గాని, గౌరవం గాని లేదు. కాని వారిలో నైపుణ్యం, నేర్పు, జ్ఞానం, విజ్ఞానం, శోధనాగుణం విశేషంగా కనిపిస్తుంది. అలాగే వివిధ చేతివృత్తులవారిలోనూ అద్భుతమైన నైపుణ్యం, కౌశలం కనిపిస్తుంది. చివరకు దళితుల్లోనూ చర్మవస్తువుల తయారీ నైపుణ్యం అపురూపం, అతుల్యం, అమోఘం. చివరకు వారు సర్జరీ సైతం అవలీలగా చేసేవారు. జంతుచర్మాన్ని కుట్టేవారికి మనుషుడి చర్మాన్ని కుట్టడం ఎడమచేతి పనిగా భావించిన అనుభజ్ఞులు ఈ నేలపై జీవించారు, శ్వాసించారు. వినమ్రంగా జీవితం గడిపారు. తమ నైపుణ్యాన్ని కొత్త తరాలకు అందించారు. అనంతరం ఆ నైపుణ్యాలు క్రమంగా అంతర్ధానమవసాగాయి.

ఆ విద్వత్తు అంతా ఆంగ్లేయులు భారత్‌ను బానిసత్వంలోకి లాగకముందు అపూర్వంగా వెలుగొందింది. ఆ వెలుగులను విదేశీయులు కొల్లగొట్టారంటే ఇప్పటి తరానికి నమ్మడానికి మనసు అంగీకరించకపోవచ్చు గాని అది వాస్తవమని ఆంగ్లేయులే తమ తమ అనుభవాల్లో, డైరీల్లో, తమ పార్లమెంటు రికార్డుల్లో నిక్షిప్తం చేశారు. అవి అందరికీ అందుబాటులో ఉన్నాయి. లిఖితపూర్వక విషయాల్ని, సంగతుల్ని, వాస్తవాల్ని ప్రతిఒక్కరు నమ్మక తప్పదు, విశ్వసించకనూ తప్పదు.

అలాంటి అనేక, అసంఖ్యాక అనుభవాల్లో ఒక అనుభవ మేమిటంటే...1745 సంవత్సర ప్రాంతంలో భారతదేశాని కొచ్చిన డాక్టర్ థామస్ క్రూసో అద్భుతమైన అనుభవాల్ని తన రచనలో పొందుపరిచాడు. ఆ ప్రపంచానికి ప్లాస్టిక్ సర్జరీని భారతదేశం అందించిందని ఆయన రాసుకున్నాడు. అనేకానేక విషయాల్లో ఇది ఒకటి మాత్రమే.

పూణేలోని ఒక నాయీవైద్యుడి(మంగలి) దగ్గర తాను గొప్ప వైద్యం అభ్యసించానని. అంత జ్ఞానవంతుడైన వైద్యుడిని తాను అంతకు ముందు ఎప్పుడూ చూడలేదని పేర్కొన్నాడు.

ఒక మరాఠా సైనికుడు తన రెండుచేతులు తెగిపోయి ఆ వైద్యుడి దగ్గరకు వస్తే తాను (డాక్టర్ థామస్ క్రూసో) ప్రధాన వైద్యుడైన ఆ నాయీ సహాయంతోఆ సైనికుడి రెండు చేతులను అతికించాను, సర్జరీచేసి వాటిని తిరిగి పనిచేసేలా చేశానని చెప్పుకున్నారు. ఈ గొప్ప విద్యను, నైపుణ్యాన్ని ఆ నాయీ దగ్గర ఒక్క పైసా రుసుం చెల్లించకుండా నేర్చుకున్నానని ఎంతో వినమ్రంగా తన డైరీలో రాసుకున్నారు. ఇలాంటి నాయీలు చాలా గ్రామాల్లో చాలామంది ఉన్నారని కూడా ఆయన ఉటంకించారు.

డాక్టర్ థామస్ క్రూసో లండన్‌కు తిరిగివెళ్ళి ప్లాస్టిక్ సర్జరీని ప్రాక్టీస్‌చేసి ఆ సర్జరీ విధానాన్ని తనపేర రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. (అతని శిష్యులు ఆపని చేశారని అంటారు). వాస్తవం మాత్రం ఆ ఘనత పూణేలోని ఆ నాయీ బ్రాహ్మణుడికే చెందుతుంది. ఆ నైపుణ్యం, ఆ నాయీ అందించిన ప్రసాదమే. ఇలాంటివి ఎన్నో జరిగాయి. ఎన్నో రంగాలకు చెందిన నైపుణ్యాలు ఇంగ్లాండుకు ఆ రోజుల్లో చేరాయి. అది సత్యం.

దేశ స్వాతంత్ర్యానికి పూర్వం, స్వాతంత్ర్య అనంతరం కూడా చాలా గ్రామాల్లో నాయీ బ్రాహ్మణులు వైద్యులుగా, సర్జన్లుగా తమ సేవలను సమాజానికి అందించారు. వయసులో పెద్దవారికి ఈ విషయం ఇప్పటికీ గుర్తుండే ఉంటుంది. గ్రామాల్లో నాయీల దగ్గర వైద్యపరికరాలు కనిపించేవి. పెద్దపెద్ద వ్రణాలను కోసి చికిత్స చేసారు. సర్జన్లు చేసే పనిని వారు సునాయాసంగా చేశారు. రోగులకు వారిపై పూర్తి విశ్వాసం ఉండేది. శతాబ్దాలకు పైగా వస్తున్న విజ్ఞానం ఆధారంగా ఆ వైద్యం చేస్తున్నారన్న నమ్మకం రోగుల్లో కనిపించేది. నయమైనవారు కళ్లముందు కనిపించడంతో ఆ నాయీ వైద్యులను ఆశ్రయించారు. మరో ప్రత్యామ్నాయం కూడా వారిముందు లేదు. సర్జరీనే కాక ఇతర జబ్బులకు అనేక మొక్కల రసాలను భస్మాలను లేపనాలను తయారుచేసి వైద్యసేవలు అందించారు. ఇదంతా సేవాదృక్పథంతో చేయడం కొసమెరుపు.

పురుషులు ఇలా సర్జరీ చేయడం, వైద్యంచేయడంలో మునిగిపోతే

నాయీబ్రాహ్మణ మహిళలు మంత్రసానులుగా కాన్పులు చేసారు. ఆ మహిళల దగ్గరగల నైపుణ్యం కారణంగా అనేక కొత్త తరాలు వెలుగుచూశాయి. శైశవ దశలోని అనేక రుగ్మతలకు వాళ్లూ వైద్యం అందించి ఆ నవజాత శిశువుల ప్రాణాలను నిలిపారు. బాలింత జబ్బులకు సైతం వంటింటిలో లభ్యమయ్యే అనేక ఆయుర్వేద ఔషధాలతో అద్భుతమైన చికిత్స అందించి మరణాలనుంచి కాపాడారు. ఆయుష్షుపోశారు. అద్భుత నైపుణ్యాన్ని ప్రదర్శించి ఎందరినో ఆశ్చర్య చకితుల్ని చేశారు. పాశ్చాత్య దేశాల ప్రసూతి విధానానికి భారతదేశ ప్రసూతి విధానానికి ఎంతో తేడాను పాశ్చాత్యులు గమనించారు. ఈ దేశ "జలవాయువు"కు అనుకూలమైన పద్ధతిలో నాయీబ్రాహ్మణ మహిళలు పురుళ్ళు పోశారు. సర్జన్లుగా పేరు తెచ్చుకున్నారు. ఈ విద్యను వారు తమ పూర్వీకుల నుంచి నేర్చుకొని ఆచరణలో పెట్టారు.

శిశువు పుట్టుక, బారసాలనుంచి మొదలు అంతిమ సంస్కారం వరకూ ఈ నాయీబ్రాహ్మణుల నైపుణ్యం,జ్ఞానం-ఆచరణ అద్భుతమని ఆంగ్లేయులు సైతం అభినందించారు. ఐతే కొత్త ఆవిష్కరణల అనంతరం అలోపతి వైద్యవిధానం బ్రిటీషువారి ప్రాపకంలో అధికారిక హోదా పొందడంతో ఈ దేశీయ పద్ధతులు, వైద్యవిధానాలు కనుమరుగవుతున్నాయి. ఇప్పటికీ ఎక్కడైనా మారుమూల ప్రాంతాల్లో ఈ వైద్యం, వైద్యులు మినుకు మినుకుమని కనిపిస్తే వారికి "దండం" పెట్టాలి. ఎందుకంటే ఆధునిక అల్లోపతికి ఊపిరిలూదింది వారేనని బ్రిటీషు చరిత్రకారులు, డాక్టర్లు అంటున్నారు. కొత్తకు, పాతకు వారధులుగా వారు నిలిచారు. మానవాళికి గొప్పసేవలు అందించారు. ఆవిష్కరణలకు తమవంతు సేవలు అందించారు. జ్ఞానాన్ని ఔపోసన పట్టి నిలిపారు. తమకు సమాజంలో హోదా, గౌరవం గూర్చి ఆలోచించకుండా నిరపేక్షకంగా సేవలు అందించిన వారెవరైనా అభినందనీయులు. ఇది చరిత్ర గుర్తుంచుకోవలసిన విషయం.

(ఆధారం: గొప్పవక్త రాజీవ్ దీక్షిత్ ఉపన్యాసం)


**నడుస్తున్న చరిత్ర** 2013 నవంబరు వరకు

**అమ్మనుడి** 2015 మార్చి నుండి...

**పాత సంచికలు విడిగా గాని,**

**సంపుటి (వాల్యూం) బౌండులుగా గాని**


**కావలసినవారు సంప్రదించండి.**

అమ్మనుడి, జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ,

హిందీ కళాశాల వీధి, మాచవరం, విజయవాడ-4.

ఫోన్ : 98480 16136, 0866-2439466


# తెనుగులెంక సూక్తులు-22



*సోమెరుగక బామరయక*
*వేమరు చెమరోడ్చువారు పెద పొట్టలతో*
*ఏమహినందును తన్మహి*
*సోమించుట కల్ల నిత్య శోభావృతమై॥*

'తెనుగు లెంక' 'అభినవ తిక్కన'
**తుమ్మల సీతారామమూర్తి.**

ప్రజాస్వామ్య ప్రభుత్వమంటే ప్రజలందరి బాగోగులు చూడాలి. అందరికీ బ్రతికే అవకాశాలు కల్పించాలి. కాని ఇప్పుడున్న ప్రభుత్వాలు పెద్దల కొమ్ము కాస్తాయి. పేదలు చచ్చినప్పుడు మొసలి కన్నీరు కారుస్తాయి. ఉప్పో, పప్పో, బియ్యమో కాస్త తక్కువ ధరకు అందించి బాకాలు ఊదుకుంటాయి. ధనవంతులకోసం ఎన్నో సౌకర్యాలు కల్పించడానికి తాపత్రయపడే ప్రభుత్వాలు పేదలకోసం సంపూర్ణంగా, చిత్తశుద్ధితో ఎందుకు పనిచేయవు? ధనవంతులయితే ఎలక్షన్ల ఖర్చులకు చందాలిస్తారు. పేదలు చందాలు ఇవ్వరు. సరికదా డబ్బో, సారానో ఇస్తే ఓటేస్తారనే ధీమా! అందుకని పేదలు పేదలుగానే ఉండాలని రాజకీయ నాయకులు అనుకుంటారు.

పేదలు సుఖదుఃఖాలను లెక్కించకుండా ఎంతో కష్టపడి సంపాదించిన సొమ్మును వారే అనుభవించే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. సంపూర్ణ మద్యనిషేధం చేయగలిగితే కష్టజీవుల సొమ్ము వృధా కాకుండా ఆగిపోవడంతోపాటు వారి ఆరోగ్యాలు చక్కబడతాయి. సారాద్వారా వచ్చే ఆదాయాన్ని మరిగిన ప్రభుత్వాలు ఆపని చెయ్యకుండా, మీనమేషాలు లెక్కిస్తున్నాయి. పేదలు కష్టపడిన సొమ్మును ఏ చిట్‌ఫండ్ కంపెనీలోనో, ఏదైనా బ్యాంకులోనో, మరేదైనా సంస్థలోనో మదుపు చేసుకుంటే , ఆ సొమ్మంతా వారు తిని బోర్డులు తిరగేస్తున్నారు.

ప్రజాస్వామ్యంలో ప్రజలందరు సుఖంగా ఉండే అవకాశాలు కల్పించాలి. అది సాధ్యం కావాలంటే పేదలు, శ్రమజీవులు సంపాదించిన సొమ్ము వృధా కాకుండా, అన్యులపాలయి పోకుండా వారి కుటుంబాలకే ఉపయోగపడేలా చూడాలి. అప్పుడే ప్రజలు ఆకలిదప్పులు లేక, అనారోగ్యం పాలుకాక ఆనందంగా ఉంటారు. ప్రజలు ధనిక, పేద తేడా లేకుండా అందరూ సుఖంగా ఉంటేనే ఆ రాజ్యం విస్తరిస్తుంది. ఆ రాజ్యం శోభిస్తుంది, నిత్యశోభలతో ప్రకాశిస్తుంది. అందుకే ప్రభుత్వాలు పేదల పక్షాన ఆలోచించి, వారి క్షేమాన్ని ఆశించి, వారంతా తమంతతాముగా నిలదొక్కుకునేలా చేయాలి. ఉచితంగా ఇవ్వడం మాని, వారు చెమటోడ్చి సంపాదించిన డబ్బు వారి జీవనానికి సరిపోయేటట్లు చూడాలి.

అందుకే తుమ్మల "సుఖం తెలియక, దఃఖాన్ని లెక్కించక చెమటోడ్చి పనిచేసేవారు ఆకలికి అల్లాడుతూ ఖాళీ కడుపులతో ఏరాజ్యంలో ఉంటారో ఆ రాజ్యం ప్రకాశించదు. ప్రగతిని సాధించదు." అన్నారు. అందుకే నాయకులు ఆలోచించి పేదలు తమ సొంత కాళ్ళపై వ్యక్తిత్వంతో నిలబడేటట్లు చేయడానికి వ్యూహాలు రచించాలి. వాటిని అమలు చేయాలి.

**-డా॥నాగభైరవ ఆదినారాయణ**
చరవాణి: 98497 99711

# చీకటిలో చిరుదీపాలు వెలిగిద్దాం రండి

-గోవిందరాజు చక్రధర్
98498 70250

మనజాతికి అస్తిత్వాన్నిచ్చి, మన మనుగడకు మూలస్తంభంలా నిలిచిన మాతృభాష పట్ల తెలుగు వారెవరికీ అంత శ్రద్ధాసక్తులు, పట్టింపులు లేకపోవడం దురదృష్టకరం.

పొరుగున ఉన్న తమిళులను చూస్తే ముచ్చటేస్తుంది. వారిలో వారికి ఎన్నిగొడవలైనా ఉండవచ్చు. సైద్ధాంతికంగా ఉత్తర దక్షిణ ధృవాలు కావచ్చు. కానీ కట్టుబొట్టు నుంచి, భాష, సంస్కృతివరకు అందరిదీ ఒకేమాట, ఒకేరీతి.

జయలలిత మరణానంతరం తమిళనాడు అసెంబ్లీలో చోటుచేసు కున్న పరిణామాల మాటెలా ఉన్నా టీవీల్లో వాటి ప్రత్యక్ష ప్రసారాల నుంచి కొన్ని విషయాలు గ్రహించవచ్చు.

అసెంబ్లీలో సభ్యులంతా మల్లెపువ్వులాంటి తెల్లటి లుంగీ, చొక్కాలు ధరించి ఉన్నారు. ఎవరు ఏ పార్టీవారో గుర్తుపట్టలేనంత సారూప్యత కన్పించింది. ఎంత ముఖ్య విషయమైనా, జాతీయ టీవీ ఛానళ్లతో మాట్లాడుతున్నా తమిళంలోనే మాట్లాడుతారు.

తెలుగునాట పరిస్థితి ప్రత్యేకించి చెప్పుకోనవసరం లేదు. తెలుగువారి సాంప్రదాయ వస్త్రధారణకు మనం ఎప్పుడో పాతరేశాం. పాతతరానికి చెందిన కొద్దిమందిని మాత్రమే సాంప్రదాయ పంచెకట్టులో చూస్తున్నాం.

**కవిత్వం మీదే మోజు :** మరోపక్క ఆధునిక తెలుగు వచనం వయసు చాలా చిన్నది. వివిధ రకాల తెలుగు వచన రీతులను మనం ఇంకా పెంపొందించుకోలేక పోతున్నాం. ప్రముఖ భాషావేత్త చేకూరి రామారావు (చేరా) చెప్పినట్లు, ఇప్పటికీ కవిత్వం మీదే మనకు మోజు. పత్రికా వార్తలలో కూడా ఈ కవిత్వ ధోరణులు పొంగిపొర్లు తున్నాయి. ప్రకృతి వైపరీత్యాన్నో అలజడినో, అశాంతినో వ్యక్తీకరిం చడానికి కవిత్వాన్ని ఆశ్రయిస్తున్నారు. సందర్భాన్నిబట్టి అర్థచ్ఛాయా భేదాలతో ప్రయోగించగల వివిధ వచన రీతులను మనం ఈనాటికీ ఏర్పరచుకోలేక పోవడం, కనీసం ఆ దిశగా దృష్టిపెట్టక పోవడం బాధ కలిగించేదే. చక్కటి వచనం రాయడ మెలాగో, వివిధ రకాల వాక్యనిర్మాణాలతో వ్యక్తీకరణలను ఎలా సంపన్నం చేసుకోవచ్చో యువతకు తెలియచెప్పాల్సిన అవసరం ఉంది.

**పుస్తకాలను పక్కన పెట్టేశాం:** తెలుగుభాషా సంస్కృతులకు పొంచి ఉన్న ముప్పును విహంగ వీక్షణ చేస్తే రాబందుల రెక్కల చప్పుడు స్పష్టంగానే విన్పిస్తోంది.

తెలుగు టీవీ ఛానళ్లు, అంతర్జాల ఆధారిత సామాజిక మాధ్య మాలు వచ్చాక పుస్తక పఠనం దారుణంగా వెనకబడింది. ముప్పై నలభై ఏళ్లక్రితం వార, మాస పత్రికలు పుంఖాను పుంఖాలుగా వెలువడేవి. వాటిలో కథలు, ధారావాహికలు, వ్యంగ్య చిత్రాలు రాజ్యమేలేవి. ధారావాహికలను తర్వాత పుస్తకాలుగా ప్రచురించే వారు. అద్దెపుస్తకాల దుకాణాలు వీధి కొక్కటిగా విరాజిల్లాయి. పలు దృక్పథాలతో కూడిన సాహిత్య ఉద్యమాలు, గోష్ఠులు, చర్చలు ఉధృతంగా సాగేవి. ఇవన్నీ ఆకాలపు యువత వ్యక్తిత్వాన్ని మలచడంలో కీలక భూమికను పోషించేవి.

ఇప్పుడు ఉద్యోగపథమే యువతకు తారకమంత్రం. ఏ కోర్సు చేయాలి, అమెరికా వెళ్లటానికి దగ్గర దారేది అనే అన్వేషణలో మునిగి తేలుతున్నారు.

సొంత గ్రంథాలయాలతో కళకళలాడిన ఇళ్లలో ఇప్పుడు మచ్చుకు ఒక్క పుస్తకమూ కన్పించటం లేదు. మరీ అత్యవసర మనిపిస్తే తప్పించి ఎవరూ ఏ పుస్తకమూ కొనటంలేదు.. స్నేహితుల దగ్గర తీసుకుని కూడా చదవటం లేదు. స్మార్ట్ ఫోన్లతోనూ, టీవీ ధారావాహికలు, వార్తలతో కాలం దొర్లించేస్తు న్నారు. టీవీలు, సామాజిక మాధ్యమాల్లో తెలుగు, ఇంగ్లీష్‌కాని సంకరభాష వర్ధిల్లుతోంది.

పుస్తకాలకు ఆదరణ లేకపోవడంతో పేరున్న ప్రచురణ సంస్థలే దుకాణాలు మూసేస్తున్నాయి. ధైర్యంచేసి సొంతంగా ప్రచురించు కునే రచయితలు రెండు, మూడువందల ప్రతులకు పరిమితమవు తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ గ్రంథాలయాలు పాలకుల నిర్లక్ష్యానికి, నిరాదరణకు కునారిల్లిపోతున్నాయి. అవినీతి చెదలతో అవి కూపుకూలుతున్నాయి. ప్రజల నుంచి మునిసిపాలిటీలు గ్రంథాలయ సెస్సును ముక్కుపిండి వసూలు చేసినా, ఆ నిధులను గ్రంథాలయాలకు ఇవ్వడం లేదు. గ్రంథాలయాలను అభివృద్ధి చేసి అందరికీ అందుబాటులోకి తెస్తామని పాలకులు భీషణ ప్రతిజ్ఞలు చేస్తుంటారు. విద్యార్థులకు ఉపకరించే పోటీపరీక్షల పుస్తకాలను తెప్పిస్తామని చెప్తారేకాని, మంచి సాహిత్యం, చరిత్ర పుస్తకాల ఊసే ఎత్తరు.

**మనమేం చేయగలం?**

ఈ నేపథ్యంలో తెలుగు భాషా వికాసానికి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడంతోపాటు వ్యక్తిగతంగా మనమేం చేయగలమో ఆలోచిం చండి. ఇందుకు ఉపకరించే కొన్ని సూచనలు.

1. తెలుగుభాషపై అనురక్తిని పెంపొందించుకోవాలి. ఇతరులకూ అభిమానం ఏర్పరచాలి. అవకాశం ఉన్న ప్రతి సందర్భంలోనూ తెలుగులోనే మాట్లాడ యత్నించాలి. తెలుగుపదాలున్నచోట అన్యభాషా పదాలను దూరం పెట్టాలి. రోజువారీ సాధారణ సంభాష ణల్లోనూ దీన్ని విధిగా పాటించాలి.

2. టీవీ కార్యక్రమాలకు, స్మార్ట్‌ఫోనుకు వెచ్చిస్తున్న సమయాన్ని కుదించుకోవాలి. వారానికి కనీసం ఒక రోజయినా ఫోనును పూర్తిగా దూరం పెట్టాలి.

3. పుస్తక పఠనాన్ని తిరగదోడాలి. కనీసం వారానికి ఒక పుస్తకం వంతున చదవాలి. ఇతరత్రా ఖర్చులు తగ్గించుకుని అయినా మంచి పుస్తకాన్ని కొనటం అలవాటు చేసుకోవాలి. అలాగే పిల్లల చేత పాఠ్యాంశాలకు తోడు వారి ఊహాశక్తికి పదును పెట్టే కథల పుస్తకాలు చదివించాలి. వారిలో సృజనాత్మకతను పెంపొందించేందుకు మీవంతుగా ఏమి చేయవచ్చో ఆలోచించండి. పిల్లలతో విధిగా రోజూ కొంత సమయం గడుపుతూ కుటుంబం గురించి చెప్తూ అవగాహన

కల్గించాలి. వేసవి శిబిరాల పేరిట ఏదోరకంగా వారిని తీరికలేకుండా ఉంచుదామని

ప్రయత్నించకండి. మిత్రులు, బంధువులు తారసపడినపుడు మీరు చదివిన మంచి పుస్తకం గురించి వారికి వివరించండి. వారు ఆసక్తి చూపితే ఆ పుస్తకాన్ని చదివించే ప్రయత్నం చేయండి.

4. టీవీ కార్యక్రమాల్లో దిన పత్రికల్లో యధేచ్ఛగా ఇంగ్లీష్‌ను వాడుతూ తెలుగు భాషకు చెరుపు కలిగిస్తున్నారని భావించినా, హాస్యం పేరిట వెకిలితనం వెర్రితలలు వేస్తుందని అనుకున్నా ఆ విషయాన్ని ఆయా సంస్థల యాజమాన్యాల దృష్టికి తీసుకువెళ్ళండి. అందుకోసం ఉత్తరాల ఉద్యమం చేపట్టవచ్చు. నా ఉత్తరాన్ని ఎవరు పట్టించుకుంటారన్న నిర్లిప్త భావనను వీడండి. మిత్రులను కూడా ప్రోత్సహించి వారిచేతకూడా ఉత్తరాలు రాయించవచ్చు. ఇలాంటి ప్రయత్నాలతో తప్పనిసరిగా పరిస్థితిలో ఎంతోకొంత మార్పు వస్తుంది.

5. భాషకు చెరుపు కలిగించే ప్రభుత్వ నిర్ణయాలపై కూడా ఇదే తరహా ఉద్యమాన్ని సాగించవచ్చు. పదిమంది భావసారూప్యత గలవారిని కూడగట్టి ప్రశాంతంగా నిరసనను ప్రకటించవచ్చు. చినుకు చినుకు కలిసి సాగరమైనట్లు భాషాభిమానులు గట్టి సంకల్పం పూని రాసే ప్రతి ఉత్తరమూ – తుపానుగా మారి పాలకులను దారికి తెస్తుంది.

6. రచయితలు, మేధావులు, అధ్యాపకులు తమ పరిధిలో శిక్షణ శిబిరాలు నిర్వహించేందుకు ముందుకు రావాలి. యువతకు వివిధ సాహిత్య ప్రక్రియలను పరిచయం చేయడంతో పాటు స్వయంగా వారు రచనలు చేసేలా ప్రణాళికలు రూపొందించాలి. వ్యవసాయం మాదిరే రచనా వ్యాసంగమూ దండగమారి వ్యవహారంగా మారిందన్న భావనతో చాలామంది ప్రతిభావంతులు అస్త్రసన్యాసం చేశారు. ఈ ధోరణి ఇలాగే కొనసాగడం క్షంతవ్యం కాదు.

మీ వంతుగా మీ పరిధిలో మన భాషకు ఏం చేయగలరో ఆలోచించండి.

చుట్టూ గాఢాంధకారం అలముకుంటున్నవేళ చిరుదీపం వెలిగించే ప్రయత్నమన్నా చేయకుంటే ఎలా? ఆ ప్రయత్నం మీరే ఎందుకు మొదలు పెట్టకూడదు?

కవిత


## జీవ ప్రవాహం

-పి.లక్ష్మణ్‌రావ్
94412 15989

గోరుముద్దలతో
అమ్మ తినిపించిన తెలుగు మాటలు
జీవకణాలై చైతన్యం రగిల్చాయి
జోలపాటలతో
అమ్మ వినిపించిన జానపదాలు
వెన్నెల కిరణాలై వేకువ తెచ్చాయి
తప్పటడుగులను సరిచేసి
నాన్న నేర్పించిన తెలుగు పదాలు
మార్గ నిర్దేశాలై దిశను మార్చాయి
చిటికెనవేలు పట్టుకొని
నాన్న నడిపించిన వెలుగు జాడలు
తెలుగు జాడలై దరిని చేర్చాయి
వెన్నెల రాత్రి
నానమ్మ చెప్పిన పురాణగాథలు
భాషాభూషణాలై
నిలువెల్లా అల్లుకున్నాయి
అక్షరాభ్యాసం నాడు
తొలిగురువు రాయించిన బీజాక్షరాలు
బోధి వృక్షమై జ్ఞానోదయానికి
పునాదులు వేశాయి
అణువణువునా మాతృభాష
జీవప్రవాహమై అడుగువేసింది
అడుగడుగునా అమ్మనుడి
తోడునీడై గొడుగు పట్టింది
ఇప్పుడు
అమ్మనుడిలేని జీవితమంటే
ఊపిరిలేని శరీరమే!



పుస్తక
సమీక్ష




# డా॥బాలాంత్రపు 'రజనీ'కి అక్షర హారతి

**తె**లుగువారి లలితకళానిధి, నవీన వాగ్గేయకారుడు, శ్రవణ మాధ్యమం ద్వారా సంగీత సాహిత్యాలకు నిరుపమాన సేవ చేసిన97 సంవత్సరాల నిత్య వసంతోత్సాహి- బాలాంత్రపు రజనీ కాంతరావు. శ్రీ రజనికి బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్, గుంటూరు వారు జనవరి 2017 లో విశిష్ట సేవా పురస్కారప్రదానం చేసిన సందర్భంగా "రజని" సంచికను వెలువరించారు.

శ్రీ మోదుగుల రవికృష్ణ సంపాదకత్వంలో 'మన రజనికి సత్కారం' అంటూ ప్రారంభ వ్యాసంతో మొదలయ్యే ఈ సంచికలో రజనీ సుదీర్ఘ జీవనయానాన్ని వ్యక్తిగా, పండితుడిగా, కవిగా, గాయకుడిగా, వాగ్గేయకారుడిగా, సంగీత సాహిత్య సంపదను తెలుగు జాతికి అందించిన రజని గురించిన విశేషాలతో కూడిన పది వ్యాసాలు ఉన్నాయి. ప్రజాదరణ పొందిన 'ఒహోపావురమా' (స్వర్గసీమ చిత్రం) పాట గురించి గోపీచంద్ దర్శకత్వంలో వచ్చిన లక్ష్మమ్మ కథకు పాటలు సంగీతం తానే యిచ్చినా, ఘంటసాల పేరుతోనే 'వెలువడటం', 'ఓవిభావరీ', 'చల్లగాలిలో' పాటలు తానే రాసి స్వరరచన చేసినా సాలూరి రాజేశ్వరరావుకు యిచ్చి వేయటం, విప్రనారాయణ యక్షగానాన్ని కృష్ణశాస్త్రి సహరచయితగా రాసిన సందర్భాలలోని విశేషాలు ఆకట్టుకుంటాయి. ప్రఖ్యాత సినీ సంగీత విమర్శకులు శ్రీ వివికె రంగారావు ఆంగ్లంలో వ్రాసిన వ్యాసం ఇందులో ఉంది. దీనిలో రజని ప్రతిభాపాటవాలను విశదీకరిస్తూ, గేయం, పద్యం, కవిత్వం, పాట, నృత్యం మొదలగు ప్రక్రియలలో తెలుగు భాషను ప్రేమించే వారికి రజనీ అభిమాన పాత్రుడు అవుతాడని పేర్కొన్నారు. రజని అలనాటి తెలుగు చలన చిత్రాలకు రాసిన పాటలు, సంగీత దర్శకత్వాల గురించి వివరంగా మూల్పూరు నరసింహారావు ఒక వ్యాసంలో వివరించారు.

ప్రముఖ సాహితీవేత్త డా॥ నాగళ్ల గురుప్రసాదరావు 'రజనీ భావ కెరటాలు' శీర్షికన వ్రాసిన వ్యాసంలో రజని వ్రాయగా ఒక దిన పత్రికలో ప్రచురించిన చిన్న వ్యాసాల గురించి విశ్లేషిస్తూ - అవి రజని యొక్క ఉపజ్ఞను నిరూపించేవిగా అభివర్ణించారు. రజని విలక్షణ రచన 'ఆంధ్ర వాగ్గేయకార చరిత్ర' ను ప్రశంసిస్తూ వారి గేయ కావ్యాలు, యక్షగానాలు, ఆంగ్లానువాదాలు, పరిశోధన గ్రంధాలు, వ్యాసాలు అన్నీ కూడ రజనికి దైవదత్తంగా వచ్చినవే అని వ్రాశారు. డా. మహాలక్ష్మి కుమారి- రజనిని నవీన వాగ్గేయ కారునిగా పేర్కొంటూ, ఆయన ప్రగతిశీల దృష్టిని, గేయ సాహిత్యంలో సంగీత సాహిత్య నృత్య కళలను తీర్చిదిద్దిన ప్రతిభా మూర్తిగా చిత్రీకరించిన తీరు ఆసక్తి కరం. అంతర్జాతీయంగా జపాన్ దేశంలో బహుమతి పొందిన "కొండనుండి కడలిదాకా- గోదావరి" పేరున గోదావరీ నదీ ప్రస్థానాన్ని సంగీత రూపకంగా మలిచిన సృష్టికర్త రజని అని కూడ వ్యాసకర్త తెలియచేసారు.

చివరి పేజీలలో 60-70 సంవత్సరం క్రితం వ్రాసిన 'రజని గీతాలు కొన్ని' అంటూ ఒక ఐదు గీతాలను ప్రచురించారు. 'స్వాతంత్ర్యోత్సవపుష్పాంజలి' గా 'మాదీ స్వతంత్ర దేశం' అనే గీతం, 'స్వతంత్ర భేరి శీర్షికన' 'మ్రోయింపు జయభేరి' గీతం, 'జోత' శీర్షికన గాంధీజీ పై గీతం, 'ఓ విభావరీ, ఓహో విభావరీ మరియు పరిష్వంగము' అనే పేరున రెండు భావగీతాలు చేర్చబడ్డాయి. ఈ గీతాలన్నీ ఆరు దశాబ్దాల క్రితం అత్యంత ప్రజాదరణ పొందినవి.

రజని సంగీత ప్రస్థానంగురించి చాల విశదంగా ఈ సంచికలో పొందుపరిచారు. అదే విధంగా ఆయన సాహిత్య ప్రస్థానం (30 సంగీత రూపకాలు, 18 సంగీత నాటకాలు, 12-15 వరకు గల ప్రచురిత రచనలు, క్షేత్రయ్య, అన్నమయ్య, త్యాగయ్య, రామదాసుల జీవిత చరిత్రలు, శతపత్ర సుందరి మొదలగు రచనల గురించి ప్రస్తావించే ఒకటి, రెండు వ్యాసాలు ఉంటే బాగుండుననిపించింది. ఇక, ఇందులోని వ్యాసాలు, ముఖా ముఖిలు, గీతాలు మొదలగు వాటి రచనా కాలం ఎప్పుడో తెలియ చేసే తేదీలు ఇచ్చి ఉండవలసింది. రజని తంబురా పట్టుకొని ఉన్న ఈ మధ్యతీసిన ముఖచిత్రంతో మొదలై, ధన్యవాదాలు అని చెప్తున్నట్లున్న చివరి పేజి చిత్రం, మధ్య పేజీలలో తొమ్మిది ఛాయాచిత్రాలు రజని హావభావాలు తెలియచేస్తూ ఒక ప్రత్యేక శోభను తీసుకువచ్చాయి. దీనికి ప్రముఖ ఫొటోగ్రాఫర్ శ్రీ తమ్మా శ్రీనివాసరెడ్డి అభినంద నీయుడు. ఈ రజని సంచిక సంగీత, సాహిత్యాభిమాను లయిన తెలుగువారందరూ చదవి తీరవలసిన పుస్తకం.

'రజని' (బాలాంత్రపు రజనీకాంతరావు విశిష్ట సేవా పురస్కార సన్మాన సంచిక) ప్రచురణ: బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్, గుంటూరు. పుటలు: 52, వెల:రూ. 40/-. ప్రతులకు- 1) నవోదయ బుక్ హౌస్, కాచిగూడ, హైదరాబాద్. 2) విశాలాంధ్ర బుక్ హౌస్ వారి అన్ని శాఖలు,


-ఎమ్.వి. శాస్త్రి
9441342999


**నడుస్తున్న చరిత్ర** 2013 నవంబరు వరకు
**అమ్మనుడి** 2015 మార్చి నుండి...

**పాత సంచికలు విడిగా గాని,**
**సంపుటి (వాల్యూం) బౌండులుగా గాని**
**కావలసినవారు సంప్రదించండి.**

అమ్మనుడి, జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ,
హిందీ కళాశాల వీధి, మాచవరం, విజయవాడ-4.
ఫోన్ : 98480 16136, 0866-2439466

పుస్తక సమీక్ష




# పరిశోధనల త్రవ్వకాలూ వెలుగుచూసిన జీవన కళాదృశ్యాలూ

'తొవ్వ ముచ్చట్లు' పేరు పెట్టడంలోనే తెలుగు దేశీయ పరిమళం అనుభూతి చెందుతాం. ప్రాణం లేచి వస్తుంది. ప్రతి ఆదివారం ఆంధ్రభూమిలో ఈ శీర్షిక రచయిత జగమెరిగిన జయధీర్ తిరుమలరావు గారు. ఈ శీర్షిక కోసం ఆదివారం ఆంధ్రభూమికై పాఠకులు ప్రతివారం ఎదురు చూస్తుంటారు.

గతకాలంలో పల్లెటూళ్ళలో అవ్వకథలలో ఎన్నో ముచ్చట్లు. అందులో ఎన్నో ఎరుక పాతరల దొంతరలు ఉండేవి!

వర్తమాన కాలంలో ఈ తొవ్వముచ్చట్లు అనేక లోతట్టు పల్లెల క్షేత్ర పర్యటనల జీవన కళా పరిశోధనల వెలుగు జోతులు నిర్లక్ష్యం నీడల్లో అట్టడుగున పడి కాన్పించని సంస్కృతుల, వ్యక్తుల, గుంపుల శేషవిశేషాల ఆత్మకథా కథనాలివి.

త్రోవలో ప్రజలతో మమేకమై వారి కలలు, కళలు, కష్టసుఖాలు, జాతరలు, పాటలు, ఆచారవ్యవహారాలు, ఆకాంక్షలు వంటివెన్నో కలుపు గోరుతనంతో తెలుసుకొని రాసిన వ్యాసాలివి. నిర్లక్ష్యానికి గురైన కళల, కళాకారుల గురించి దొరతనాలకు సంబంధించిన బాణపరంపర లుంటాయి. ఒక రకమైన వైతాళిక పాత్ర నిర్వహిం చారు తిరుమలరావు.

తెలుగమ్మనుడి అంశాలు ఇందులో ఉన్నాయి. ఇందుకు ఉదాహరణం అశాస్త్రీయ అక్షర మాటలు– వాచకాలు అనే రచన. బొంబాయి –నవదీప్ పబ్లికేషన్స్ వేసిన అక్షరమాల పుస్తకాన్ని తన మనుమరాలు 'జైత్ర' ద్వారా పరీక్షించి రాశారు. దానిలో 'అ' అంటే 'అమ్మ' అని బొమ్మ చూపారు, ప్రచురణకర్తలు. పిల్లనెత్తుకున్న అమ్మ అవడం, అమ్మ, పిల్లల బొమ్మలు రెండూ పెద్దవిగా వేశారు. చిన్నపిల్ల–చిన్నపిల్లనే చూస్తోంది కాని అమ్మను చూడటం లేదు. బొమ్మలు పిల్లల పుస్తకాల్లో వేసేటప్పుడు స్పష్టత ఉండాలనేది తెలియపర్చారు రావుగారు. 'ఋ'కి ఋషిబొమ్మ వేసినప్పుడు పాప గడ్డాన్ని చూసి 'తాత' అందట. 'అః' అక్షరానికి అంతఃస్వరమని ఇవ్వడంలో విసర్గలు ఆ తరువాత కాకత–తరువాత వుంటే ఎలా సరిపోతుందన్నారు. ఇటువంటి సున్నితమైన, సునిశితమైన భాషాం శాలు కూడ వ్యాసాలలో ఉన్నాయి. వాచకాల తయారీ శాస్త్రీయంగా ఉండాలంటూ వాటిని తయారు చెయ్యడం నిజంగా కష్టం అని నిర్మాణాత్మక దృష్టితో అన్నారు.

'ఒక శాస్త్రం–పలు క్షేత్ర పర్యటనలు' రచనలో నన్నయ మహాభారతం కన్నా 50 ఏళ్ళ ముందుకాలానికి చెందిన సంస్కృత భాషాశాసనంలో తెలుగుమాటలు తెలపడం, తెలుగుభాషా ప్రాచీనతకి చెందిన శోధనా కోణమే. కేవల గ్రంథాలతోనే కొంతమంది పరిశోధనలతో పొద్దుబుచ్చు తున్న కాలంలో శ్రీ జయధీర్ అభిలేఖాగారాల్లో పరిశోధనల త్రవ్వకాలు సాగించడం నూతన కోణాలను అన్వేషించడం సమాజపరం చేయడంలో ఈ రచనలు కొత్త తోవలు తెరిచాయి. ఇందుకు మరోకోణంలో కట్టమంచి సాక్ష్యం పలుకుతుంది. మనకు ముసలమ్మ మరణం, కళాపూర్ణోదయం, సాహిత్య విమర్శ కోణాల్లోంచే కట్టమంచి కనపడగా 'తెలంగాణా' హైదరాబాదు చరిత్రాంశాల్లో మరొక కోణంలో కట్టమంచి మంచి వాక్యాలు చెప్పడం చరిత్రను విప్పడమే.

దేశంలోనే అత్యున్నత స్థానం వహించిన హైదరాబాదు ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని కట్టమంచి 'అధికమెట్ట' (ఉన్నత శిఖరం) అని పొగడడం, 1927లో హైదరాబాదుకు రెండోసారి పర్యటించినప్పుడు కట్టమంచి – కొందరు పండితుల్ని రాతప్రతుల్ని సేకరించమని కోరగా వారు అతితక్కువ సమయంలోనే ఆరువందల రాతప్రతులను సేకరించడం, ఆయన 1938లో నైజాంని ఎంతో ప్రశంసించడం వంటి అంశాలు వెల్లడించారు. నైజాంమీద ప్రజలు తిరగబడ్డారు. వర్తమాన కాలంలో నైజాంని క్రూరునిగా కాక అభివృద్ధి కాముకునిగా చూస్తున్నవాళ్ళ సంఖ్య కొంత పెరిగిందని, వీరివాదనకు కట్టమంచి కితాబు పనికివస్తుందని అనడంలో తిరుమలరావుగారి వ్యంగ్య రహస్యం, వర్తమానానికి చరిత్రను అనుసంధానపరచే పద్ధతి తెలుస్తుంది. నాలుగు పుస్తకాలు చూసి నలభై నాలుగు వ్యాసాలను ఎవొల్యూషన్ ఎగ్జిబిషన్‌గా (పరిణామ ప్రదర్శన శాల) రాసే కొందరున్న ఈ కాలంలో ఈ తొవ్వముచ్చట్లు పరిశోధక రచయితలకు దిక్కుచుక్కానులవుతాయి. వెనుకబడిన కళాకారులు, వెనుకబడిన ఉపకులాలు ఎక్కడ నిర్లక్ష్యానికి గురిఅవుతారో అక్కడ తిరుమల రావు చూపులు, ఆలోచనలు, ఉద్ధరణలు ఉంటాయన్న ముచ్చట లంతటా కనుగొనగలం.

జ్వాలాముఖి రచనకు 'ప్రశ్నించే నిప్పుల కుంపటి' అనే శీర్షిక సార్థకం. విప్లవ మహావక్తగా ఆయనపాత్ర బహుకోణాల్ని వెల్లడించారు. 'వైద్య వాద్య నిపుణ క్షురకర్ములు' లో రెండువేల ఏళ్ళ చరిత్రగల మంగలివారిపై అన్నవరపు పరబ్రహ్మయ్య రాసిన మహాపద్మనంద చరిత్ర' గురించిన అంశాలు అబ్బురపరిచేవిగా ఉన్నాయి. సమాజంలో విడదీయరానివారైన వారు వైద్యం, వాద్యం, సౌందర్యరక్షణ వంటి అంశాలలో చేసిన సేవలు అవిస్మరణీయాలని నొక్కి చెబుతారు 'అరణ్యనేత్రకవి' తిరుమలరావు.

'కనుమరుగవుతున్న రుంజవాద్యం' ఒక వాస్తవం. కళఅయి, కళప్రయోగింపబడినప్పుడు అది కవిత్వమై కళాలోకనాధులు గుర్తుకు వస్తారు. కళనీ, కళాకారుణ్ణీ బ్రతికించుకోలేక మనల్ని మనమే తిట్టుకునేటట్టు వాయిస్తుంది ఈ వ్యాసం. కళ విజ్ఞానాంశాలు ఆకళ భూగోళంపైనే ఎంతగొప్పదెందుకయిందో గ్రహిస్తాం.

ఆయన కన్నీరు పెట్టినచోట మనం కన్నీరు పెట్టడం, దళిత ఆదివాసీ ఉపకులాల వెనుకబాటుతనం ఆయన చూపిన ఆయన రచనల సూక్ష్మ దర్శినులతో మనం చూసి ఆలోచిస్తాం, స్పందిస్తాం. ఆమోదించేవి ఆమోదించి వ్యతిరేకించి తీరవలసినవి వ్యతిరేకిస్తాం. అటువంటి స్పందనలను కలిగించడంలో సఫలమైన ఈ సామాన్య ప్రజాపక్షపాతపు రచనల పాతరను తవ్వుకొందాం. ఇలా సవాలక్ష జీవకళాదృశ్యాలు చూడ టానికి తోవలో పయనిద్దాం. ముచ్చట్లు ఎక్కడికో తీసుకుపోతాయిమరి.

**తొవ్వముచ్చట్లు రెండవ భాగం** రచన : జయధీర్ తిరుమలరావు, 252 పుటలు, వెల : రు.150/–; ప్రతులకు : ప్రముఖ పుస్తక విక్రేతలు మరియు సాహితీ సర్కిల్, 402, ఘరొండా అపార్టుమెంట్లు, ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం, డి.డి.కాలనీ, హైదరాబాదు–7.

**–అరసింగం.**

ఉద్యమ వార్తలు

## విశాఖపట్టణంలో చురుకుగా సాగుతున్న భాషోద్యమం

విద్యాహక్కుచట్టాన్ని పూర్తిగా అమలు చేయాలని కొంతకాలంగా విశాఖపట్నం నుంచి పోరాటాన్ని సాగిస్తున్న నరవ ప్రకాశరావు గారూ, తెలుగు భాషోద్యమ కార్యకర్తలు పారుపల్లి కోదండరామయ్యగారూ, పరవస్తు సూరిగారు మరికొందరు మిత్రులను కలుపుకొని చేస్తున్న కృషి ఫలితంగా ఏప్రిల్‌నెలలో విశాఖపట్టణంలో 24వ తేదీన, ఆతర్వాతా పలు సమావేశాలు జరిగాయి. నిర్మాణాత్మకంగా ప్రజా చైతన్య కార్యక్రమాన్ని చేపట్టాలని వారు ఆలోచిస్తున్నారు. 24వ తేదీన జరిగిన సమావేశంలో పట్టణంలో వివిధ రంగాల్లోని ప్రముఖులు పాల్గొన్నారు.




## సాహితీవేత్త వేదగిరి రాంబాబు చొరవ, ఆదర్శం

గిడుగు, గురజాడల స్ఫూర్తితో ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించడం కోసం ప్రముఖ సాహితీవేత్త, రచయిత, ఉపన్యాసకుడు, శ్రీ వేదగిరి రాంబాబు ఏప్రిల్‌లో కావలి, నెల్లూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట, ఒంగోలు, చీమకుర్తి మున్నగు ప్రాంతాల్లో పర్యటించి వివిధ సాహితీ సంఘాలలో, బాలల కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ప్రతినెలా కొన్ని ఊళ్లలో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టనున్నారు.నెల్లూరులో ఆయన పాల్గొన్న సభాదృశ్యం ఇది.



## గ్రంథాలయం




**తెలుగుభాష-కొన్ని సంగతులు:** ఆలోచింపజేసే పుస్తకం; రచన: వి.చెంచయ్య. పుటలు: 40, వెల: రు.15, ప్రచురణ: విప్లవ రచయితల సంఘం, నెల్లూరు జిల్లా. ప్రతులకు: వి.చెంచయ్య, సాహితీనిలయం,10-40-15ఎ/1, జనతాపేట నార్త్, కావలి-524 201. ఫోన్: 94406 38035.




**ఏకాంతసేవ :** విఖ్యాతులైన వేంకట పార్వతీశ్వర కవులు 1922కు ముందు రచించిన గేయకావ్యం. 2016 నవంబరులో మళ్ళీ ప్రచురించారు. సంపాదకులు: మోదుగుల రవికృష్ణ. పుటలు: 118, ప్రతులకు:సాహితీ మిత్రులు, 28-10-16, మసీదు వీధి, అరండల్‌పేట, కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ-2. ఫోన్ : 9490634849.




**అంకురం :** బౌద్ధవ్యాసాల సమాహారం; రచన: బొర్రా గోవర్ధన్. పుటలు: 112, వెల: రు.80, ప్రచురణ: లతారాజా ఫౌండేషన్, హైదరాబాదు. ప్రతులకు: ఆర్ట్స్&లెటర్స్,హైదరాబాదు, ఫోన్:040-27635654, మంగళగిరి బుద్ధవిహార ట్రస్టు, మంగళగిరి, ఫోన్: 98481 99098, లతారాజా ఫౌండేషన్, హైదరాబాదు, ఫోన్: 98852 81545, బొర్రాగోవర్ధన్, నగరం, గుంటూరు జిల్లా.-522 268. ఫోన్: 93906 00157.





**చిత్రకవిత్వం:** రచన: ప్రయాగ కృష్ణమూర్తి. పుటలు: 43, , ప్రతులకు: ప్రయాగ కృష్ణమూర్తి, ఫ్లాట్ నెం.102, విద్యాగ్రాండ్ అపార్ట్‌మెంట్, బ్రహ్మంగారి గుడిదగ్గర, రామిరెడ్డిపేట, నరసరావుపేట-522 601.ఫోన్: 81790 63842




**జీవరహస్య లిపి:** కవిత్వం; రచన: ఖాదర్ షరీఫ్. పుటలు: 87, వెల: రు.100, ప్రచురణ: సన్నిధి ప్రచురణలు, నెల్లూరు. ప్రతులకు: పెరుగు రామకృష్ణ, ఇం.నెం.25-1-949, 5వ వీధి, నేతాజీ నగర్, నెల్లూరు-4.ఫోన్: 98492 30443. మరియు ఎస్.కె.షారూన్ బేగం, ఎస్.కె.ఫిర్దోస్ బేగం, క్వా.నెం.ఎ/13, సోమశిల, ఎస్.పి.ఎస్.ఆర్.నెల్లూరు-524 301.




**కవనభువనం:** రుబాయీ కావ్యం; రచన: డా॥తిరుమల శ్రీనివాసాచార్య. పుటలు: 122, వెల: రు.100, ప్రచురణ: సుదర్శనం ప్రచురణలు, హైదరాబాదు. ప్రతులకు: డా॥తిరుమల శ్రీనివాసాచార్య, ఎ40, 201, సింగపూర్ క్లాస్ (సంస్కృతి) టౌన్‌షిప్, హైదరాబాదు - 88. ఫోన్: 99493 65903




**చిలకమర్తీయం;** పుటలు: 80, వెల: రు.30. ప్రచురణ: ప్రతులకు: పెరుమాళ్ళ రఘునాథ్, కార్యదర్శి, చిలకమర్తి ఫౌండేషన్, 23-15-3/2/1, సుభాష్ నగర్, కోరుకొండ రోడ్, రాజమహేంద్రి-533 105.




**పాడవే కోయిల :** తెలుగు గజళ్ళు; రచన: ఎస్.ఆర్.పృథ్వి. పుటలు: 40, వెల: రు.50, ప్రతులకు: పి. ఉషారాణి, 3-866, ఎం.జి.స్ట్రీట్, రామక్రిష్ణ నగర్, రాజమహేంద్రవరం-533 001. ఫోన్: 0883-2421123

# ఇవీ సంగతులు!

**లో**క్‌సభలో కేంద్రమంత్రి ప్రకటనను ఈ క్రింద చదవండి. ఆయన ఉన్న సంగతులు చెప్పి ఊరుకున్నాడు! రాష్ట్రాల్లో బోధనామాధ్యమం వారి ఇష్టమని మేం చేసేది లేదని చెప్పి ఊరుకున్నాడు.

పేరుకే తెలుగుకొక మంత్రిత్వశాఖ! తెలుగు చదువుకోవడం దండుగ అని సాక్షాత్తూ మునిసిపల్ శాఖా మంత్రిగారు తెలుగు శాఖ మంత్రిగారి సమక్షంలోనే చెప్తున్నారు!

మరొకపక్క విద్యాశాఖ మంత్రిగారు ఇంగ్లీషును బాగా నేర్పేందుకు బ్రిటీష్ నిపుణులతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. ఉన్నత విద్యావంతులకు విదేశాల్లో ఉద్యోగాలకోసం ఇంగ్లీషు భాషను నేర్పిస్తున్నారు. ఇదంతా ఇంగ్లీష్ కమ్యూనికేషన్ స్కిల్స్ ప్రాజెక్టు క్రింద! అంటే వీరందరికీ అందిన ఇంగ్లీషు మీడియంలో చదివిన భాషమీద పట్టు రాలేదనేగా అర్థం! అందుకని మరీ బ్రిటీషు వాళ్లచేతనే ఇంగ్లీషు నేర్పిస్తున్నారు! మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందా?!

## మాతృభాష ద్వారానే విద్య

### బోధనామాధ్యమంపై లోక్‌సభలో మంత్రి ప్రకటన

లోక్‌సభలో అడిగిన ఒక ప్రశ్నకు జవాబుగా మానవవనరుల శాఖామాత్యులు శ్రీ ఉపేంద్రకుష్వాలా ఈ క్రింది ప్రకటన చేశారు

పిల్లలకు ఉచిత, తప్పనిసరి విద్యా హక్కు చట్టం 2009 (Right to Education-RTE) లోని 29(2)వ అధికరణ ప్రకారం "విద్య మాధ్యమం సాధ్యమైనంత వరకు విద్యార్థి మాతృభాషలోనే" (medium of instructions shall, as far as practicable, be in child's mother tongue) ఉండాలి. జాతీయ బోధనప్రణాళికా సంఘం (NCF) 2005. ప్రాథమిక విద్య విద్యార్థి మాతృభాషలోనే ఉండాల్సిన అవసరాన్ని తెలియచెప్పింది. కానీ బోధనప్రణాళిక, విద్యాబోధన క్రమబద్ధీకరణ రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ఉన్నాయి. బడులలో, పాఠశాలల్లో ఏ మాధ్యమం నడపాలి అన్నది రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని విషయం. పలు రాష్ట్రాలు మాతృభాషలో విద్యాబోధనపై చట్టాలు రూపొందించుకున్నాయి, అమలు పరుస్తున్నాయి కూడా!

భారతదేశంలో ఉన్న భాషా పరిస్థితులు క్లిష్టమైనవి. ఈ పరిస్థితిని మెరుగుపరిచేందుకు త్రిభాషా సూత్రం సహకరిస్తుందన్నది జాతీయ బోధనప్రణాళికా సంఘం స్పష్టంగా తెలుపుతోంది. ఈ సూత్రం ప్రకారం హిందీయేతర రాష్ట్రాలలో పిల్లలు హిందీని మూడో భాషగానో, రెండో భాషగానో నేర్చుకోవాలి. హిందీ రాష్ట్రాలలో పిల్లలు అక్కడ మాట్లాడబడని భాషలలో ఏదయినా ఒక భాషని అభ్యసించాలి. సంస్కృత భాషను మాత్రం ఆధునిక భారతీయ భాషగా పరిగణిస్తూ ఈ భాషలకు అదనంగా అభ్యసించవచ్చు. అలాగే, యోగాభ్యాసాన్ని ఆరోగ్య, శారీరిక విద్యలో అంతర్గతంగా నేర్పించాలి. అన్ని రాష్ట్రాలు ఈ జాతీయ బోధనాప్రణాళికా సంఘం సూచనలు పాటిస్తున్నాయి, లేదా అనుసరిస్తూ తమ సొంత విధానాలను అమలు పరుస్తున్నాయి.

*(21 నవంబర్ 2017న ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ద్వారా భారత ప్రభుత్వ మానవ వనరుల శాఖ అందించిన సద్దు)*


తెలుగు మాధ్యమం చదివితే భవిష్యత్ శూన్యం

మంత్రి నారాయణ వ్యాఖ్యలు


సీఎం సమక్షంలో ఒప్పందం కుదుర్చుకుంటున్న ప్రతినిధులు

లక్ష మందికి ఆంగ్లంలో శిక్షణ

ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్ ప్రాజెక్టుకు శ్రీకారం

బ్రిటిష్ కౌన్సిల్‌తో అవగాహన ఒప్పందం

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136)
RNI-APTEL/2015/62362

## 30 ఏప్రిల్ 2017న విజయవాడలో

# డా॥ మండలి బుద్ధప్రసాద్‌కు ఆత్మీయ అభినందన సభ




ప్రసంగిస్తున్న తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షుడు, అమ్మనుడి సంపాదకుడు డా॥ సామల రమేష్‌బాబు



డా॥ బుద్ధప్రసాద్‌ను సత్కరిస్తునన అమ్మనుడి ప్రచురణకర్త డా॥ సామల లక్ష్మణబాబు

మండలి బుద్ధప్రసాద్‌గారికి కృష్ణా విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ పురస్కారాన్నిచ్చిన సందర్భంగా విజయవాడ- రామా ఫంక్షన్ హాలులో ఏప్రిల్ 30వ తేదీన విజయవాడ సాహితీ సాంస్కృతిక సంస్థలు మరియు ప్రముఖులచే 'ఆత్మీయ అభినందనోత్సవం' జరిగింది. ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా॥ దీర్ఘాసి విజయభాస్కర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆత్మీయ అతిథులుగా శాసనమండలి అధ్యక్షులు శ్రీ చక్రపాణి, పాత్రికేయ ప్రముఖులు శ్రీ సి. రాఘవాచారి, కృష్ణావిశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య ఎస్. రామకృష్ణారావు, రిజిస్ట్రార్ ఆచార్య డి.సూర్యచంద్రరావు, ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎం. ముత్యాల నాయుడు, కృష్ణా విశ్వవిద్యాలయం తొలి ఉపకులపతి ఆచార్య మైనేని కేశవ దుర్గాప్రసాద్, నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య కె.వియన్నారావు, శాసనమండలి మాజీ సభ్యులు ఐలాపురం వెంకయ్య, విజయవాడ- అమరావతి సాంస్కృతిక కేంద్రం అధ్యక్షుడు వై. హరిశ్చంద్రప్రసాద్, అమ్మనుడి సంపాదకుడు డా॥ సామల రమేష్‌బాబు పాల్గొని ప్రసంగించారు. డా॥ బుద్ధప్రసాద్ తన గురువు డా॥ ఎస్. గంగప్ప గారికి గురు సత్కారం జరిపారు. ఐలాపురం రాజా, డా॥ ఈమని శివనాగిరెడ్డి, గోళ్ల నారాయణరావు, తమ్మా శ్రీనివాసరెడ్డి, గుత్తికొండ సుబ్బారావు, డా॥ జి.వి.పూర్ణచందు సభ నిర్వహించారు.

ఫోటోలు: తమ్మా శ్రీనివాసరెడ్డి



చెన్నైలో జరిగిన మెలట్టూరు భాగవత ప్రదర్శన సందర్భంగా 'మార్కండేయ చరిత్రము' తెలుగు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శ్రీ మండలి బుద్ధప్రసాద్, సినీనటి ఊర్వశి శారద, డా॥ జయధీర్ తిరుమలరావు, డా॥ మధురాంతకం నరేంద్ర, డా॥ నాగసూరి వేణుగోపాల్ తదితరులు (పూర్తివ్యాసం: సాహితీరంగం- పుట25)

అమ్మనుడి (తెలుగుజాతి పత్రిక) Pages : 52
AMMANUDI (Telugu Monthly)
May 2017, Vol.3, Issue 3
Date of publication : 1st of every month
Date of posting : 4th of every month
RNI-APTEL/2015/62362
Postal Reg. No.TEN/12/2015-17

